అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
గురువారం 20-4-2023
సంపుటి : 9 సంచిక : 109 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు వెల : 6.50

పరదాల చాటున పేదరికం!

అతిథులకు కనిపించకుండా దారిద్ర్యాన్ని దాచేస్తున్నారు

- జీ-20 సదస్సు పేరుతోసర్వాంగసుందరంగా వారణాసి
- అంతా కృత్రిమం...
- ఇంతకుముందు నగరాన్ని ఇలా ఎందుకు శుభ్రం చేయలేదని ప్రశ్నిస్తున్నారు.

జీ-20 సమావేశాల నేపథ్యంలో వారణాసిని అందంగా అలంకరించాలని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతే...ప్రభుత్వ యంత్రాంగం మొత్తం కదిలింది. చెట్లు, వంతెనలకు సైతం రంగులు వేశారు. మురికివాడలు కన్పించకుండా ఆకుపచ్చని పరదాలు కట్టారు. పెద్ద పెద్ద బోర్డులు ఏర్పాటు చేశారు. మొత్తానికి అతిథులకు రోడ్డు పక్కన గుడిసెలు కన్పించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. వాస్తవానికి వారణాసిలో మూడింట రెండో వంతు ప్రాంతం మురికి వాడలు, పూరి గుడిసెలతోనే నిండి ఉంటుంది. పేదరికాన్ని నిర్మూలిస్తామని హామీలు గుప్పించే నేతలు ఇప్పుడు పేదరికం బయటకు కనబడకుండా మభ్యపెడుతున్నారు. ఆకుపచ్చని పరదాల చాటున నిజాలను ఎందుకు కప్పిపెడుతున్నారని మురికి వాడల ప్రజలు నిలదీస్తున్నారు.





వారణాసి : జీ-20 సదస్సు సందర్భంగా వారణాసి నగరంలోని వీధుల్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. వివిధ దేశాల నుంచి వచ్చిన అతిథుల్ని ఆకట్టుకునేందుకు చేయాల్సిందంతా చేశారు. రోడ్లన్నీ తళతళలాడుతున్నాయి. అయితే ప్రతి రోజూ ఇలా ఎందుకు ఉండడం లేదని వారణాసి మురికివాడల్లో నివసిస్తున్న ప్రజానీకం వేస్తున్న ప్రశ్నలు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి.

రాత్రింబవళ్లూ డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతూ దుర్గంధం వెదజల్లుతున్న ప్రాంతంలో నివసిస్తున్న గుడియా అనే మహిళ మాట్లాడుతూ "మురికివాడలు కన్పిస్తే చాలు...బుల్‌డోజర్లు వచ్చి నేలమట్టం చేస్తున్నాయని" వాపోయారు. పేదరికం కానీ, పేదలు కానీ అతిథులకు కన్పించకుండా చేస్తున్నారని చెప్పారు. పిల్లలు, వృద్ధులకు రోజుకు రెండు పూటలా ఆహారం దొరకడం కూడా దుర్భరం అవుతోందని, అయినా ఎవరికీ పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రిజ్వానా అనే మరో మహిళ మాట్లాడుతూ 'నాకు వివాహమై పదేళ్లు అయింది. నగరాన్ని ఇంత సుందరంగా ఎప్పుడూ చూడలేదు. అంతా కృత్రిమంగా కన్పిస్తోంది. బీజేపీ వాళ్లు ఓట్ల కోసమే మా ప్రాంతానికి వచ్చే వారు. ఇప్పుడు రాత్రికి రాత్రే చెత్తాచెదారాన్ని తొలగించారు. ఆకుపచ్చని లాన్లు ఏర్పాటు చేశారు. ఒంటెలు, గుర్రాలు, ఏనుగులు, నెమళ్లు, చివరికి సీతాకోక చిలుకల బొమ్మల్ని కూడా ఏర్పాటు చేశారు. వావ్...ఎప్పుడూ ఇలా ఉంటే ఎంత బాగుండు' అని అన్నారు.

రాజ్‌ఘాట్ సమీపంలోని మురికి వాడలో నివసిస్తున్న అజయ్ గోండ్‌ది మరో వ్యథ. ఆ ప్రాంతంలోని ఇళ్లను కూల్చేస్తామని ఉత్తర రైల్వే నోటీసులు ఇచ్చింది. ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఇళ్లు కూల్చేస్తే తమ ప్రపంచమే నాశనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటిపన్ను, నీటిపన్ను, కరెంటు బిల్లులు కడుతున్నా తమకు ఎందుకీ దుస్థితి అని నిలదీశారు. అతిథులను సంతృప్తి పరచడం కోసం తమ బతుకులను నాశనం చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం పేదరికాన్ని నిర్మూలించడానికి బదులు పేదల్ని నిర్మూలించాలని చూస్తోందని జర్నలిస్ట్ ప్రదీప్ కుమార్ చెప్పారు. జీ-20 సమావేశాల కోసం చేసిన కోట్లాది రూపాయల ఖర్చుతో పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వవచ్చని అన్నారు. ప్రస్తుత వ్యవస్థలో మురికివాడల సంఖ్య పెరుగుతోందని చెప్పారు. మరోవైపు సామాన్య ప్రజానీకం ఆర్థిక పరిస్థితులు ...2లో



కార్పొరేట్, మతతత్వ ఎజెండా
దేశానికే ప్రమాదం

అదానీ అక్రమాలపై సమాధానమివ్వడంలో మోడీ విఫలం

- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పోలీసు రాజ్యం
- గాంధీ, ఆజాద్, నెహ్రూ వంటివారి చరిత్ర లేకుండా చేస్తున్న వైనం
- అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న గవర్నర్లు
- కేంద్రం విధానాలపై ప్రజలను సమీకరించి పోరాడాలి: సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్ పిలుపు
- బీజేపీని వ్యతిరేకిస్తున్నందుకే బీఆర్ఎస్‌ను సమర్థిస్తున్నాం
- హామీల అమలు కోసం ఉద్యమిస్తాం
- వారంలో సీఎం కేసీఆర్‌ను కలుస్తాం
- లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్, మతతత్వ ఎజెండా దేశానికే ప్రమాదకరమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ విజయరాఘవన్ విమర్శించారు. మంగళవారం నుంచి ప్రారంభమైన సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డితో కలిసి విజయరాఘవన్ మాట్లాడారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చించామన్నారు. ప్రజా సమస్యలపై భవిష్యత్ కార్యాచరణను రూపొందించామని చెప్పారు. ఇటీవల కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ వల్ల పేదలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదన్నారు. ఎలాంటి చర్చ లేకుండానే పార్లమెంటు ఆమోదించిందని అన్నారు. ప్రజలకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చలేదని, నిరుద్యోగం తీవ్రంగా ఉన్నా తగ్గించే చర్యలు చేపట్టలేదని విమర్శించారు. అదానీ అక్రమాలపై హిండెన్‌బర్గ్ నివేదిక ఇచ్చినా దానిపై పార్లమెంటులో చర్చ జరగలేదన్నారు. ప్రతిపక్ష ...5లో

ప్రొఫెసర్ సాయిబాబా కేసును మరోసారి విచారించాలి

విచారణను నాలుగు నెలల్లోగా పూర్తి చేయాలి

- నిర్దోషిగా ప్రకటించిన ముంబయి హైకోర్టు తీర్పును పక్కన పెట్టిన సుప్రీం



న్యూఢిల్లీ : ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాకు బుధవారం సుప్రీంకోర్టులో భారీ షాక్ తగిలింది. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో నమోదైన కేసులో సాయిబాబాను నిర్దోషిగా ప్రకటిస్తూ ముంబయి హైకోర్టు ఇచ్చిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసింది. ఈ కేసును తాజాగా మళ్లీ విచారించాలనీ, విచారణను నాలుగు నెలల్లోగా పూర్తి చేయాలని తీర్పునిచ్చింది. ముంబయి హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ఎన్ఐఏ ...5లో

పొంగులేటి..మెలికపెట్టి

12 సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్‌కు షరతు

భట్టి ప్రాతినిధ్యం వహిస్తున్న మధిరపైనా పట్టు

- కంటోన్మెంట్ కూడా కావాలె
- ఖమ్మం పార్లమెంట్‌లో పోటీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ పార్టీ వేటు తర్వాత బీజేపీ గడప తొక్కాలా? కాంగ్రెస్ గూటికి చేరాలా? సొంత పార్టీ పెట్టాలా? అనే దానిపై చర్చోపచర్చల తర్వాత హస్తం పార్టీవైపే పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మొగ్గుచూపుతున్నట్టు తెలిసింది. బీజేపీలోకి వెళ్తే వెంట నడిచేదేలేదంటూ ఆయన అనుచరగణం తెగేసి చెప్పటంతో కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్టు సూత్రపాయంగా తెలిసింది. 11 అసెంబ్లీ సీట్లు, ఖమ్మం పార్లమెంటరీస్థానం తాను చెప్పినోళ్లకు ఇవ్వాలని మెలికపెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. కాంగ్రెస్ ఎల్పీ నేత అయిన భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర సీటూ తనకు వదిలేయాలని పట్టుపడుతున్నట్టు తెలుస్తోంది. హైదరాబాద్ పరిధిలోని కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానాన్ని కూడా తాను చెప్పినోళ్లకు ఇవ్వాలని షరతు పెట్టారని ప్రచారం జరుగుతున్నది. ఆయన ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం, ఇటు రాష్ట్రంలో రేవంత్‌రెడ్డితో సమాలోచనలు చేసినట్టు తెలిసింది. పొంగులేటి గొంతమ్మ కోరికలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో నిప్పును రాజేశాయి. ఖమ్మం జిల్లాలో రాజకీయ వేడిని పుట్టిస్తున్నాయి.

పొంగులేటికి ఖమ్మం జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో సొంత క్యాడర్ ఉంది. అయితే, ఆయన పార్టీమారినంత మాత్రానా అందరూ తన వెంటే వస్తారనే ...2లో





బొగ్గు దందా.. మోడీ అండ

ఛత్తీస్‌గఢ్‌లో అదానీ గ్రూపు మైనింగ్ విస్తరణకు తోడ్పాటు

- తవ్వకాలకు అనుమతులు
- 3వేల ఎకరాల అటవీ భూమికి క్లియరెన్స్
- రెండు ప్రభుత్వ సంస్థల నివేదికల అధ్యయనం

దేశంలో అదానీ బొగ్గు దందాకు మోడీ సర్కారు అండగా నిలుస్తున్నది. అదానీ అక్రమ సామ్రాజ్యానికి తోడ్పాటునందిస్తున్నది. ప్రకృతి సంపదను అప్పనంగా దోచిపెడుతున్నది. రాష్ట్రమేదైనా.. పరిస్థితులు ఎలా ఉన్నా.. అదానీ కన్ను పడిందంటే బొగ్గు గనులు ఆయన కంపెనీకి దక్కాల్సిందే. ఇందుకు కావాల్సిన అన్ని క్లియరెన్సులను మోడీ సర్కారు చూసుకుంటుంది. ఛత్తీస్‌గఢ్‌లోనూ అదానీ మైనింగ్ కార్యకలాపాల విస్తరణకు మోడీ ప్రభుత్వం ఈ విధంగానే సహాయపడింది. రెండు ప్రభుత్వ సంస్థల అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది.

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో బొగ్గు నిల్వలు ఎక్కడున్నా.. చట్టాలతో పని లేకుండా కేంద్రంలోని బీజేపీ సర్కారు అదానీకి అనుకూలంగా పని ...5లో

స్ట్రాంగ్ రూమ్ తాళం పగలగొట్టండి

మంత్రి కొప్పుల ఎన్నిక వివాదంపై హైకోర్టు



నవతెలంగాణ-హైదరాబాద్

జగిత్యాల జిల్లా ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎన్నిక వివాదంపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సీల్ వేసిన స్ట్రాంగ్ రూమ్ తాళాన్ని పగులగొట్టేందుకు కలెక్టర్‌కు అనుమతిచ్చింది. కొప్పుల ఎన్నిక చెల్లదనీ, లెక్కింపులో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్ వేసిన పిటిషన్‌ను హైకోర్టు బుధవారం మరోమారు విచారించింది. ఎన్నికకు సంబంధించిన డాక్యుమెంట్లు, వీవీప్యాట్లు, సీసీ పుటేజీ కావాలని లక్ష్మణ్ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై స్పందించిన హైకోర్టు..లక్ష్మణ్ అడిగిన సమాచారం ఇవ్వాలని గతంలోనే రిటర్నింగ్ అధికారికి ...5లో

జనాభాలో చైనాను అధిగమించి..
తొలిస్థానంలోకి భారత్..




న్యూఢిల్లీ : ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ రికార్డు సృష్టించింది. చైనా కంటే 29లక్షల అధిక జనాభాతో ఈ రికార్డును అధిగమించినట్టు ఐక్యరాజ్య సమితి వెల్లడించింది. ఇందుకు సంబంధించి తాజా నివేదికను ఐరాస బుధవారం విడుదల చేసింది.

1950లో ఐరాస జనాభా సమాచారాన్ని వెల్లడించడం మొదలుపెట్టిన తర్వాత ప్రపంచ జనాభా జాబితాలో భారత్ తొలిసారిగా ప్రథమ స్థానంలో నిలిచింది. జనాభా అంచనాలకు సంబంధించి 'స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ రిపోర్టు-2023' పేరుతో యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్స్ తాజా నివేదికను ...5లో

ఎంసెట్‌లో వెయిటేజీ రద్దు

- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు
- ఇంటర్‌లో 45 శాతం మార్కులొస్తేనే ప్రవేశాలకు అర్హులు
- ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల

2లో..



అంతన్నారింతన్నారో...

కార్పొరేట్ వత్తిడికి తలొగ్గిన 'జీవా'

- ఆర్భాటంగా టీఎస్ఆర్టీసీలో ప్రారంభం
- ఆ తర్వాత ఊసే లేని వైనం
- ఆయిల్‌ఫెడ్, మిషన్‌భగీరథ, వాటర్‌బోర్డు... ప్రయత్నాలు అనేకం
- ఏటా వేసవికి ముందు ఇదే హడావిడి
- కార్పొరేట్ లాబీయింగ్‌తో సర్కారు సైలెంట్

ఎస్ఎస్ఆర్ శాస్త్రి

"టీఎస్ఆర్టీసీ ఏటా 90 లక్షల లీటర్ల వాటర్ బాటిళ్లను బయటినుంచి కొని వినియోగిస్తుంది. ఇక ఆ పరిస్థితి ఉండదు. సొంతబ్రాండ్ 'జీవా' వాటర్ బాటిళ్లనే వాడతాం. స్వచ్ఛత, నాణ్యతకు పెద్దపీట వేస్తున్నాం. టీఎస్ఆర్టీసీ సొంతబ్రాండ్‌తో మార్కెట్లోకి వస్తున్న స్వచ్ఛమైన తాగునీరు 'జీవా'ను ప్రజలు ఆదరించాలి. ఆర్టీసీ ప్రత్యామ్నాయ విధానాల ద్వారా ఆదాయం పెంచుకునే ప్రయత్నంలో ఇది ఒకటి" ఈ ఏడాది జనవరి 9వ తేదీ హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ బస్టేషన్ (ఎమ్‌జీబీఎస్)లో టీఎస్ఆర్టీసీ సొంత బ్రాండ్ 'జీవా' వాటర్ బాటిళ్లను మార్కెట్లోకి విడుదల చేస్తూ రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, చైర్మెన్ బాజిరెడ్డి గోవర్దన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ చెప్పిన మాటలు ఇవి. లీటర్, అరలీటర్, 250 ఎమ్ఎల్ బాటిళ్లను కూడా మార్కెట్లోకి ప్రవేశపెడుతున్నామని ఆరోజు చెప్పారు. అక్కడితో సీన్ కట్‌చేస్తే...ఆరోజు ఎమ్‌జీబీఎస్‌లో కనిపించిన 'జీవా' మళ్లీ ఇప్పటి వరకు కనిపిస్తే ఒట్టు! ఈ నీటి వ్యాపారం కోసం టీఎస్ఆర్టీసీ భారీ కసరత్తునే చేసింది. వాటర్‌బాటిళ్ల మోడల్, పేరు సెలక్షన్ కోసం ఆన్‌లైన్ పోటీలు కూడా నిర్వహించింది. జనవరిలో నీళ్ల బాటిళ్ల లాంచ్ కాగానే, కార్పొరేట్ నీటి వ్యాపార సంస్థల లాబీయింగ్ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. దీనితో 'జీవా'కు అక్కడే సజీవ సమాధి కట్టినట్టు తెలుస్తుంది. ఈ తరహా ప్రయత్నం గతంలో టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా ...5లో



కొత్తేం కాదు...

ఏటా వేసవి సమీపించే సమయంలో వాటర్ బాటిళ్ల వ్యాపారం చేస్తున్నామంటూ ఏదో ఒక ప్రభుత్వరంగ సంస్థతో హడావిడి చేయించడం పరిపాటిగా మారింది. 2018 ఏప్రిల్‌లో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లరు అండ్ సివరేజ్ బోర్డ్ (వాటర్‌బోర్డు) 20 లీటర్లు, లీటరు, అరలీటరు, 200 మి.లీ., వాటర్ బాటిళ్లు, ప్యాకెట్లు తయారు చేస్తున్నామంటూ ఆసక్తి వ్యక్తీకరణ పేరుతో ఎంక్వయిరీ నోటీసు జారీ చేసింది. ఆ తర్వాత అది అటకెక్కింది. ఆ తర్వాత మిషన్ భగీరథ పేరుతో వాటర్‌బాటిళ్లు మార్కెట్లోకి తెస్తున్నామని కొన్ని నమూనా బాటిళ్లు ప్రవేశపెట్టారు. ఆ తర్వాత అవీ కనిపించలేదు. ఇక 2021లో తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ (టీఎస్ఆయిల్‌ఫెడ్) ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా అశ్వారావుపేటలో 'కిన్నెర' పేరుతో రూ.3 కోట్ల వ్యయంతో వాటర్ బాటిళ్ల ప్లాంటు ఏర్పాటు చేశారు. కోవిడ్‌లో అది కొట్టుకుపోయింది. ఇప్పుడు తాజాగా టీఎస్ఆర్టీసీ నీటి వ్యాపారాన్ని ప్రచారంలోకి తెచ్చారు. కార్పొరేట్ దెబ్బకి వెనక్కి మళ్ళారు.



ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమయ్యేనా?

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు లేక ఎనిమిదేండ్ల వుతోంది. ఐదేండ్లు గడిచినా పదోన్నతులు, బదిలీలు లేక ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల విద్యా వ్యవస్థలో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, ప్రధానో పాధ్యాయులు అని విభజించారు. ఎస్జీటి, స్కూల్ అసిస్టెంట్‌లకు ఎనిమిదేండ్లు, ప్రధానో పాధ్యాయులకు ఐదేండ్లు ఒక పాఠశాలలో పనిచేయడానికి గరిష్ట గడువుగా నిర్ణయించారు. కానీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఉపాధ్యాయులకు పదోన్నతులివ్వలేదనే అసహనం ఉపాధ్యాయుల్లో నెలకొంది. 2018లో జరిగిన బదిలీలు తర్వాత ఇప్పటి వరకు బదిలీలు లేకపోవడం వల్ల కొంత మంది ఉపాధ్యాయులు పదమూడు, పద్నాలుగు సంవత్సరాల నుండి ఒకే పాఠశాలలో పనిచేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, విద్యాశాఖ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ప్రకటించి దరఖాస్తులకు ఆహ్వానించింది. 50వేల మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. స్పౌజ్ కేసులను పరిష్కరించిన తర్వాత బదిలీలు, పదోన్నతులు చేయాలని స్పౌజ్ బాధిత ఉపాధ్యాయులు తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టును ఆశ్రయించారు. స్థానికులను స్థానికేతరులను చేసిన 317జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులు బదిలీలలో తమకు అవకాశం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కేసును జూన్ 13కు వాయిదా వేసింది. ఎంతోకాలంగా బదిలీలు, పదోన్నతుల కోసం ఆశలు పెంచుకుని వారికి నిరాశే మిగిలింది. ప్రభుత్వం ఈ కేసును ఈ వేసవి సెలవుల్లోగా కౌంటర్ దాఖలు చేసి కేసును త్వరగా పూర్తయ్యే టట్లు చూసి ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

భాషోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి...

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేయనున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని భాషోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాల్సిన అవసరం ఉన్నది. రాష్ట్రంలోని 10,558 భాషా పండితుల పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. 2017 డిసెంబర్ లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి సాక్షిగా భాషా పండితుల ఉన్నతీకరణలో చిన్న చిన్న లోపాలను సరిదిద్ది వీలైనంత త్వరగా పదోన్నతులు కల్పిస్తామని హామీనిచ్చారు. ఐదేండ్లు గడిచినా అమలుకు నోచుకోలేదు. కోర్టులో ఉన్న స్టేను వెకెట్ చేపించి గత 25, 26 సంవత్సరాల నుండి ఉన్నత పాఠశాలలలో బోధిస్తూ ప్రాథమిక పాఠశాల వేతనాలు తీసుకుంటున్న భాషా పండితులకు పదోన్నతుల గురించి ఆలోచించాలి. శాసన మండలి ఎన్నికల సందర్భంగా భాషాపండితులకు ఉన్నతీకరణ చేస్తున్నట్లు జీఓలు తేవడం, శాసనమండలి ఎన్నికలు ముగిసిన తర్వాత ఆ జీవోలను అటకెక్కించడం మామూలైపోయింది. ఇప్పటి వరకు నాలుగుసార్లు భాషా పండితులకు ఉన్నతీకరణ చేస్తున్నట్లు జీవోలిచ్చారు. కానీ అమలు చేయకపోవడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. భాషా పండితుల జాబ్‌చార్ట్ ప్రకారం 6,7,8 తరగతులకు బోధించాలి. కానీ ఉద్యోగంలో చేరినప్పటి నుండి ఈ తరగతులతో పాటు 9, 10వ తరగతి వరకు బోధిస్తూ శ్రమదోపిడీకి, వెట్టిచాకిరీకి గురవుతున్నారు. విద్యాకమిటీలు, విద్యా కమిషన్‌లు ఉన్నత పాఠశాలలలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మాత్రమే ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆంగ్లం, సామాన్య శాస్త్రం, గణిత శాస్త్రం, సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్‌లు ఉండి ప్రథమ భాషా తెలుగు, ద్వితీయ హిందీ బోధించే వారు మాత్రం భాషా పండితులుండటం శోచనీయం. వీరికి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి తప్ప ఇంకేమీ లేవు. ఉద్యోగంలో చేరి ఇందులోనే పదవీ విరమణ చేసే ఉద్యోగం రాష్ట్రంలోని ఏ శాఖలోనూ లేదు. ఇన్ని సమస్యలతో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారికి ప్రయోజనం కలిగే విధంగా బదిలీలు పదోన్నతులు వేసవి సెలవుల్లో చేపట్టాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

– డాక్టర్ ఎస్.విజయ భాస్కర్,
9290826988

సమాజ సేవకుడు స్వామి అల్వాల్‌కు సలామ్...

నేటి సమాజం గురించి తెలిసిందే. ఎవరి సమస్యలు, కష్టసుఖాలు వారివే. 'నేను బాగుండాలి. నాకుటుంబం బాగుండాలి' అని అనుకువారే చాలామంది ఉంటారు. ఇంకొంత మందైతే ఒక్క అన్నం పార్సల్ అనాథలకు ఇచ్చి సెల్ఫీలమీద సెల్ఫీలు దిగి సోషల్ మీడియాలో పోస్టుచేసుంటారు. కానీ కొంత మంది సమాజం కోసం పాటుపడినా, వారి జీవితం ధారపోసినా వార్తల్లోకి ఎక్కరు. ప్రచారం కూడా చేసుకోరు. అలాంటి కోవలోకి వచ్చేవారే డాక్టర్ స్వామి అల్వాల్. ఆయన స్ఫూర్తికి, ప్రేరణకు, అంకితభావానికి నిలువెత్తు నిదర్శనం. అనేకమంది సంఘ సంస్కర్తలు, సామాజిక విప్లవకారుల విగ్రహాలను ఆవిష్కరిస్తూ చాలామందికి ఆదర్శంగా నిలు స్తున్నారు. ఎంబీబీఎస్ చదివినప్పటికీ కార్పొరేట్ ఆస్పత్రిలో పనిచేయకుండా సామాజిక సేవ సంస్థల్లో వైద్యం అందిస్తూ పేదలకు సేవచేస్తున్నారు. అలాంటి వ్యక్తుల గురించి, మనలోనే ఉంటూ పనిచేస్తున్న స్వామి అల్వాల్ లాంటి సంఘ సేవకుల గురించి నేటియువత తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

స్వామి అల్వాల్ 1941లో ఎల్లమ్మ మల్లయ్య దంపతులకు హైదరాబాద్‌లో జన్మించాడు. పెరిగింది, చదివింది కూడా ఇక్కడే. చిన్ననాటి నుండే చాలా చురుకైన విద్యార్థిగా, తెలివిగల వానిగా పాఠశాలలో రాణించగలిగాడు. నాటికి జరుగుతున్న స్వాతంత్ర పోరాటం పట్ల అప్పుడప్పుడే ఏర్పరచుకున్న అవగాహనతో సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని తలంపు ఆయనలో కలిగింది. ఏడో తరగతి పాస్ అయిన తర్వాత తన తల్లిదండ్రులకు ఉన్న వెనుకబాటుతనం ,అమాయకత్వంతో శూద్రులు చదవకూడదనే వేల సంవత్సరాల మనువాద మానసిక చట్టాల మూలంగా 'ఇక చదువు మానేయ్. ఏడులో ఎల్లినవ్. ఇగ చాలు మానెయ్' అని ఒత్తిడి చేశారు. వీళ్ళు చదివించకపోయినా సొంతకష్టంతో చదువుకుంటాననే దీమా, ఆత్మవిశ్వాసంతో అల్వాల్ తల్లిదండ్రులకు తెలియకుండా దొంగచాటుగా వెళ్లి కాచిగూడ హైస్కూల్ హాస్టల్‌లో 8వ తరగతిలో జాయిన్ అయ్యాడు. అక్కడ మహారాష్ట్రకు చెందిన అనేకమంది విద్యార్థులు ఆ హాస్టల్లో చదివేవారు. అప్పటికే అంబేద్కర్, పూలే భావాలు వారి మధ్య చర్చ జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో ఆ మహనీయుల బాటలో నడవాలి, సామాజిక సేవ చేయాలనే తలంపు అల్వాల్‌కు కలిగింది.

అక్షరం ముక్క చదువు రాకపోయినా మొత్తం మహారాష్ట్రలో వివిధ పట్టణాలలో బజార్లు ఊడ్చి పరిసరాలను పరిశుభ్రం చేయడమే కాకుండా అట్టడుగు పేదలకి చదువు నేర్పాలి అనాథలకు ఆశ్రమాలు నెలకొల్పాలని భావించిన గాడ్గే బాబా జీవితంలోకి తొంగి చూశారు. గాడ్గే బాబా స్ఫూర్తితో సామాజిక సేవా సంకల్పం అల్వాల్‌లో కలిగింది. అనేకమంది దగ్గర జోలబట్టి అడుక్కొచ్చి 150సంస్థలను స్థాపించిన గొప్ప సంఘసంస్కర్త సంత్ గాడ్గే బాబా జీవితాన్ని అధ్యయనం చేసి ఆ మార్గంలో పయనించాలని నిర్ణయించుకున్నాడు. ఆయన జీవిత చరిత్రను తెలుగులో తొలిసారిగా డాక్టర్ అల్వాల్ పుస్తకం రాశారు. స్వామి అల్వాల్ తండ్రి అల్వాల్ మల్లయ్యకు సంక్రమించిన 300 గజాల స్థలాన్ని ప్రజాసేవ సామాజిక కార్యక్రమాల కోసం షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీకి విరాళంగా ఇచ్చారు. ఆ స్థలంలో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు ఉత్తరం రాసి బిల్డింగ్ మంజూరు కోసం చొరవచేశారు. ఆ భూమిపైన కొంతమంది కన్నేసి కబ్జా చేయడానికి ప్రయత్నించగా ప్రభుత్వాన్ని ఆశ్రయించి నిరాటంకంగా పోరాటం చేసి ఆ భూమిని రక్షించుకుని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ శతాబ్ది భవనంగా పేరు పెట్టారు. ఆ భవనంలో నేటికీ సామాజిక సేవా కార్యక్ర మాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, వివిధ సామాజిక ప్రజాసంఘాల కార్యక్రమాలు సభలు సమావేశాలు ఉచితంగా నిర్వహించ బడుతున్నాయి. ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రంతో పాటుగా ఇటీవల ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం, కరాటే శిక్షణ కేంద్రం ఇలాంటి అనేకం ఆ భవన్‌లో నడుస్తున్నాయి. అట్టడుగు కులంలో పుట్టి



సైలాబాబు
9177549656



అత్యున్నత చదువులు చదివి బీహార్ వంటి రాష్ట్రాలలో కేంద్ర ప్రభుత్వం మెడికల్ ఆఫీసర్‌గా పనిచేయటమే కాకుండా భారతదేశం బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతాల్లోనూ పేదలకి అనేక వైద్య సేవలు అందించారు. క్యాన్సర్, టిబి పేషేంట్లకు అనేక వైద్యసేవలు చేశారు. కాచిగూడ నుంచి అమీర్‌పేటకు వెళ్లి నేచురోపతి వైద్యం నేర్చుకొని ట్యూషన్ చెప్పి మెడికల్ విద్యార్థులను అనేక మందిని డాక్టర్లుగా ఆయన తీర్చిదిద్దారు.

1973లో బీహార్‌లో కేంద్ర ప్రభుత్వ మైకాన్ మెన్స్ హాస్పిటల్, సంస్థలలో అనేక వైద్య సేవలందించారు. టీబీ, క్యాన్సర్ పేషంట్లను దగ్గరుండి వారి బాగోగులు చూసుకున్నారు. 1979లో గుంటూరుజిల్లా బాపట్ల ప్రాంతానికి చెందిన కమ్యూనిస్టు నాయకుడు పెద్ద వెంకటేశ్వర్లు కూతురిని తన మిత్రుడి సహకారంతో కులాంతర ఆదర్శ వివాహాన్ని అల్వాల్ చేసుకున్నాడు. ఆమె సైతం సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా స్ఫూర్తి నిచ్చాడు. 2013 సంవత్సరంలో తీవ్ర అనారోగ్యానికి గురైన తన జీవిత సహచరి మరణించడంతో ఒంటరి జీవనాన్ని గడపాల్సి వచ్చింది. 300 గజాల స్థలం తీసుకున్న షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ దాన్ని సద్వినియోగం చేయడంలో ఘోరంగా విఫలం కావడంతో అటు భూమిని రిటర్న్‌బ్యాక్ తీసుకొని అందులో సేవా, సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని, మహనీయులు చేసిన త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తినిచ్చే విధంగా ఉండాలని వారి విగ్రహాలు నెలకొల్పాలనే తలంపుతో అల్వాల్ స్వామి ముందుకు నడుస్తున్నాడు.

గౌతమ బుద్ధుడు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, రమాబాయి అంబేద్కర్, సంత్ గాడ్గే బాబా, జగ్జీవన్‌రామ్, కాన్షీరాం, జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే, సంత్ గురు, రవిదాస్, నారాయణ గురు, పెరియార్ రామ స్వామి నాయకర్, ఛత్రపతి శివాజీ, గుర్రం జాషువా, చిట్యాల ఐలమ్మ, టి ఎస్ సదాలక్ష్మి, సాహూ మహారాజ్ వంటి విగ్రహాలను సొంత ఖర్చులతో నెలకొల్పారు. అల్వాల్ ఎల్లమ్మ, మల్లయ్య (డాక్టర్ స్వామి అల్వాల్ తల్లి దండ్రులు) ప్రస్తుతం ప్రపంచ మానవాళి విముక్తి ప్రదాత కారల్ మార్క్స్ విగ్రహాన్ని 2023 మార్చి 19న తిలక్‌నగర్‌లోని సంజీవయ్యనగర్ శతాబ్ది భవన్‌లో నెలకొల్పారు. 81 సంవత్సరాల వృద్ధాప్యంలోనూ అల్వాల్ మహనీయుల ఆలోచనలు అడుగుజాడలు వదిలి పెట్టకుండా, ఆచరణాత్మకంగా కృషి చేయడం అభినందనీయం.

2007సంవత్సరంలో ఎంబీ బీఎస్ డాక్టర్‌గా ఆయన రిటైర్డ్ అయిన తర్వాత కూడా రోగులకు ప్రత్యక్ష సేవలు అందించాలని ఆయన ఆరోగ్యశ్రీ అడ్వయిజర్‌గా చేరాడు. ఎనిమిది పదుల వయసులో గోల్నాక నుంచి అమీర్‌పేటకు

> డాక్టర్ అల్వాల్ జీవితంలో కించిత్తు స్వార్థం ఎరగక సమాజ హితం కోసం తన సర్వస్వం త్యాగం చేశారు. నేడు సామాజిక తరగతులు, ఉద్యోగ రంగాలలో పనిచేస్తున్నటువంటి వాళ్ళందరికీ కింద ఉన్న ఆభాగ్యులుగా జీవిస్తున్న వాళ్లకి ఏ రకంగా అండగా నిలబడాలో ఆయన వ్యక్తిగత జీవితమే పాఠం అవుతుంది. ఆయన ఆచరనే గీటురాయిగా నిలుస్తుంది. డాక్టర్ స్వామి అల్వాల్‌కు లాల్‌సలామ్.

వెళ్లడానికి ఆరోగ్యం సహకరించక దానికి దూరమయ్యాడు. ప్రస్తుతం తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మల్లు వెంకట నరసింహారెడ్డి చారిటబుల్ ట్రస్టులో డాక్టర్‌గా వైద్య సేవలందిస్తున్నారు. రిటైర్డ్ అయిన తర్వాత ఆయన తనకు వస్తున్న కొద్దిపాటి పెన్షన్‌లో నెలకు రెండు వేల రూపాయల చొప్పున శతాబ్దిభవన్ నిర్వహణ కోసం ఖర్చు పెడు తున్నారు. వారికి ముగ్గురు బిడ్డలైనప్పటికీ వారి వివాహానంతరం జీవిత సహచరి లేకపోయినా ఒంటరి జీవనాన్ని గడుపుతూ ఈరోజుకి కూడా అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. 19 మంది మహానుభావుల విగ్రహాలు నెలకొల్పడమే కాకుండా వారి జయంతులు, వర్ధంతులు, వివిధ రకాల కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు

నేటికీ ఏ చిన్న మీటింగ్ లోనైనా జై భీమ్, లాల్ సలాంతో ఆయన ప్రసంగాన్ని ప్రారంభిస్తారు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైనప్పుడు తన ముగ్గురు బిడ్డలను పిలిచి 'నా తదనంతరం కూడా శతాబ్దిభవన్‌లో సామాజిక సేవా కార్యక్రమాలకి మీ వంతు తోడ్పాటునివ్వాలని వారిని కోరారు'. కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్ ఇతర బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల కార్యక్రమాలకు ఉచితంగా భవనం ఇవ్వడమే గాక ఆయా సామాజిక కార్యక్రమాలలో క్రియాశీలక భూమిక పోషిస్తున్నారు. డాక్టర్ సి.నారాయణరెడ్డి వంటి దిగ్గజాల చేతుల మీదుగా అవార్డ్ తీసుకున్నారు. ఆయన సేవలకు గాను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దళిత రత్న అవార్డ్ ప్రదానం చేసింది. ఢిల్లీ ప్రభుత్వం 2002లో విజయరత్న అవార్డ్‌ను బహుకరించింది.

డాక్టర్ అల్వాల్ జీవితంలో కించిత్తు స్వార్థం ఎరగక సమాజ హితం కోసం తన సర్వస్వం త్యాగం చేశారు. నేడు సామాజిక తరగతులు, ఉద్యోగ రంగాలలో పనిచేస్తున్నటువంటి వాళ్ళందరికీ కింద ఉన్న ఆభాగ్యులుగా జీవిస్తున్న వాళ్లకి ఏ రకంగా అండగా నిలబడాలో ఆయన వ్యక్తిగత జీవితమే పాఠం అవుతుంది. ఆయన ఆచరనే గీటురాయిగా నిలుస్తుంది. డాక్టర్ స్వామి అల్వాల్‌కు లాల్‌సలామ్.

ఎంసెట్‌లో వెయిటేజీ రద్దు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఎంసెట్‌లో ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నిర్ణయం వచ్చే విద్యాసంవత్సరం (2023–24) నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ బుధవారం జీవో నెంబర్ 18ని విడుదల చేశారు. కరోనా నేపథ్యంలో గత మూడేండ్లుగా వెయిటేజీ నిబంధనను అమలు చేయని విషయం తెలిసిందే. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఎంసెట్‌లో ఇంటర్ మార్కులకు వెయిటేజీ ఉండబోదని స్పష్టం చేశారు. ఎంసెట్ ఆధారంగా ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్, మెడికల్, డెంటల్, ఫార్మా–డీ వంటి కోర్సుల్లో ప్రవేశాలకు 2011 నుంచి జీవో నెంబర్ 73 ద్వారా ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ అమలవుతున్నదని వివరించారు. ఆ జీవోను సవరిస్తూ వెయిటేజీని తొలగించామని తెలిపారు. ఎంసెట్‌కు హాజరైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీస అర్హత మార్కుల్లేవని పేర్కొన్నారు. వారికి వచ్చిన మార్కుల ఆధారంగా ఎంసెట్‌లో ర్యాంకు కేటాయిస్తారని వివరించారు. ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో ఇంటర్ మార్కులకు వెయిటేజీ లేదు. ఇంకోవైపు ఇంటర్ బోర్డుతోపాటు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఇతర రాష్ట్రాలకు చెందిన బోర్డులకు చెందిన విద్యార్థులు తెలంగాణ ఎంసెట్‌కు దరఖాస్తు చేస్తారు. వారి మార్కులను క్రోడీకరించి వెయిటేజీ కలిపి ర్యాంకులు కేటాయించడం కొంత ఇబ్బందిగా మారిందని అధికారులు భావిస్తున్నారు. అందుకే ఎంసెట్‌లో ఇంటర్ మార్కులకు వెయిటేజీ నిబంధనను ప్రభుత్వం తొలగించింది. ఇంకోవైపు ఎంసెట్‌కు దరఖాస్తు చేయాలంటే కనీస మార్కుల నిబంధన అమల్లో ఉంటుందని విద్యాశాఖ అధికారులు గతంలోనే స్పష్టం చేశారు. అంటే ఇంటర్ లేదా తత్సమాన పరీక్షల్లో 45 శాతం మార్కులుంటేనే ఎంసెట్‌కు దరఖాస్తు చేసేందుకు అర్హులుగా ఉంటారు.

అంతకంటే తక్కువ మార్కులొస్తే ఎంసెట్‌లో వారికి ర్యాంకులు కేటాయించే అవకాశం లేదు. ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 70 శాతం, ద్వితీయ సంవత్సరం నుంచి వంద శాతం సిలబస్‌తో ఎంసెట్ ప్రశ్నాపత్రాలను రూపొందిస్తున్నారు. ఈ ఏడాది ఎంసెట్‌కు రికార్డు స్థాయిలో దరఖాస్తులొచ్చాయి. 3.18 లక్షల మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వచ్చేనెల 10,11 తేదీల్లో ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం, అదేనెల 12 నుంచి 14వ తేదీ వరకు ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు.

దసరా నాటికి వరంగల్ హెల్త్ సిటీ పూర్తి కావాలి

మూడు టిమ్స్ ఆస్పత్రుల పనులు వేగవంతం చేయాలి

- ఎనిమిది టీచింగ్ ఆస్పత్రుల పనులు పూర్తి చేయాలి
- ఈ ఏడాది ప్రారంభ మయ్యే 9 మెడికల్ కాలేజీల డిజైన్లను రూపొందించాలి : ఆర్ అండ్ బీ అధికారులకు ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశాలు



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

దసరా నాటికి వరంగల్ హెల్త్ సిటీ నిర్మాణం పూర్తి చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు రోడ్లు, భవనాలశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ అభివృద్ధి సంస్థ ప్రాంగణంలో వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల పనుల పురోగతిపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు టిమ్స్ ఆస్పత్రుల పనుల్లో వేగం పెంచాలనీ, ఎనిమిది బోధనా స్పత్రుల పనులు పూర్తి చేయాలనీ, ఈ ఏడాది ప్రారంభమయ్యే తొమ్మిది మెడికల్ కాలేజీల డిజైన్లను రూపొందించాలని ఆదేశించారు. హైదరాబాద్ నగర శివారు ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు మరింత చేరువ చేసే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న సనత్ నగర్, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాలు వేగవంతం చేయాలని కోరారు. వరంగల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక మాడ్యులర్ థియేటర్లు, ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందే అవకాశమే లేకుండా ఎయిర్ హ్యాండ్లింగ్ యూనిట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ నిర్మాణాలకు సంబంధించి వైద్యారోగ్య శాఖ అవసరమైన అన్ని చర్యలు పూర్తి చేసినట్టు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, కుటుంబ, సంక్షేమ విభాగం కమిషనర్ శ్వేతా మహంతి, డీఎంఈ రమేష్ రెడ్డి, డీహెచ్ శ్రీనివాస రావు, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, సీఎం ఓఎస్డీ గంగాధర్, ఆరోగ్యశ్రీ సీఈవో విశాలాచ్చి, ఆర్ అండ్ బీ ఈఎన్సీ గణపతి రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ సీఇ రాజేందర్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప పాల్గొన్నారు.

పొంగులేటి..మెలికపెట్టి

(మొదటిపేజీ తరువాయి)

గ్యారంటీ లేదు. ఖమ్మం జిల్లా జెడ్పీ చైర్మెన్‌గా ఉన్న లింగాల కమల్‌రాజు పొంగులేటికి ముఖ్య అనుచరుడనే పేరుంది. బీఆర్ఎస్‌ను వీడుతానంటే కలిసి రానని ముందే స్పష్టంగా చెప్పేశారు. దీనిని బట్టే అందరూ ఆయన వెంట వెళ్లరని స్పష్టమవుతున్నది. బీజేపీలో చేరాలనుకున్న ఆయన నిర్ణయాన్ని అనుచరులు, కార్యకర్తలు నిర్ద్వంధంగా తిరస్కరించిన విషయం విదితమే. ఆ తర్వాత ఆయన కొత్త పార్టీ పెడతారనే మరో పుకారు షికారు చేసింది. అదీ పారలేదు. ఇప్పుడు కొత్త పార్టీకి స్కోప్ లేదనే విషయాన్ని పసిగట్టిన పొంగులేటి చేయి నీడన చేరాలనే నిర్ణయానికి వచ్చారు. ఆయన తీసుకున్న నిర్ణయం ఎలా ఉన్నా కాంగ్రెస్ ముందు పెట్టిన డిమాండ్లే ఇప్పుడు చర్చనీయాంశం అవుతున్నాయి. ఆ పార్టీలో కాక పుట్టిస్తున్నాయి. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమతంటా బీఆర్ఎస్ గాలి వీచినా...అంత కష్టసమయంలోనూ ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నెగ్గుకొచ్చింది. పైచేయి సాధించింది. ఆ తర్వాత కాంగ్రెస్ నుంచి గెలిచినవాళ్లు బీఆర్ఎస్‌లో చేరినా క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి ఇంకా పట్టు సడలలేదు. ఖమ్మం జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు తమ శాయశక్తులా పనిచేసుకుంటూ పోతున్నారు. ఇప్పుడు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఖమ్మం జిల్లాలోని 10 నియోజకవర్గాల్లోనూ తన అనుచరులకే సీట్లు ఇవ్వాలని కోరటం, భట్టి స్థానంపైనా పట్టుబట్టడం అగ్గిని రాజేసింది. దీనిపై మల్లు భట్టి విక్రమార్క, రేణుక చౌదరితోపాటు ఆ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు భగ్గుమంటున్నారు. పొంగులేటికి తనది బలమో, వాపో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయన ఇష్టపడి పార్టీలో చేరకుండా సవాలక్ష షరతులు పెట్టడమేంటని ప్రశ్నిస్తున్నారు. జిల్లాను ఆయనకు అప్పగిస్తే...ఇప్పటిదాకా పార్టీని నమ్ముకుని ఉన్న వారి రాజకీయ భవిష్యత్తు ఏం కావాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని ప్రశ్నించేందుకు సన్నద్ధం అవుతున్నారు. పొంగులేటి తన అనుచరులకు టికెట్లు ఇప్పించుకోవడం కోసం పార్టీకి నష్టం చేసేలా వ్యవహరించడం సరైందికాదని హెచ్చరిస్తున్నారు. పొంగులేటి డిమాండ్లకు తలొగ్గితే ఖమ్మంలో పార్టీకి పెద్ద దెబ్బ తగిలే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు ఆందోళన చెందుతున్నారు. పొంగులేటి పార్టీలోకి రాకపోయినా బీఆర్ఎస్ ఢీకొట్టి మరీ గెలిచేందుకు అవకాశాలున్నాయని చెబుతున్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఆఫీసు తుదిదశ పనులు

- పరిశీలించిన మంత్రి వేముల

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు దేశ రాజధాని న్యూఢిల్లీలో వసంత్ విహార్‌లో నిర్మిస్తున్న భారత రాష్ట్ర సమితి కేంద్ర కార్యాలయ తుది దశ నిర్మాణ పనులను బుధవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పరిశీలించారు. కేసీఆర్ ఆలోచనల ప్రకారం బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయ నిర్మాణ పనులపై మంత్రి నిర్మాణ సంస్థకు పలు సూచనలు చేశారు. కార్యాలయ ఫర్నీచర్ పరిశీలించారు. కేసీఆర్ విధించిన నిర్ణీత గడువులోగా నిర్మాణం పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని మంత్రి వారికి స్పష్టం చేశారు. మంత్రి వెంట ఆర్కిటెక్ట్ ఆస్కార్, వర్క్ ఏజెన్సీ ప్రతినిధులు ఉన్నారు.

పరదాల చాటున పేదరికం!

(మొదటిపేజీ తరువాయి)

క్షీణిస్తున్నాయని తెలిపారు. గొప్పలు చెప్పుకున్నంత మాత్రాన వాస్తవాలు దాగవని అన్నారు. సమావేశాల కోసం చేసిన వ్యయం విషయంలో పారదర్శకత లోపించిందని సర్వధర్మ సంఘ్ డైరెక్టర్ రామ్‌ధిన్ విమర్శించారు. సమావేశాల కోసం తమ భూమిని కూడా లాక్కునేందుకు ప్రయత్నాలు చేశారని చెప్పారు. వారణాసిలోని పలు ప్రాంతాలలో జీ–20 లోగోలను ప్రదర్శించారు. వీటితో పాటు బీజేపీ ఎన్నికల గుర్తు కమలం కూడా దర్శనమిచ్చింది. దీనిపై ప్రతిపక్షాలు విమర్శలు చేసినా పాలకులు పట్టించుకోలేదు. లోగోలో చూపిన 'వసుధైక కుటుంబం' భావన ఆచరణలో ఎక్కడా కన్పించలేదు.

ఎండా..ఉక్కపోత

- మహదేవపూర్‌లో 44.5 డిగ్రీల ఎండ
- అన్ని జిల్లాల్లోనూ 40 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు
- పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షంపడే అవకాశం



బుధవారం నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతలు

మహదేవపూర్ (జయశంకర్ భూపాలపల్లి జిల్లా)	44.5 డిగ్రీలు
మల్లాపూర్ (జగిత్యాల)	44.5 డిగ్రీలు
తాళ్లమడుగు(ఆదిలాబాద్)	44.3 డిగ్రీలు
రాయినిగూడెం(సూర్యాపేట)	44.2 డిగ్రీలు
వెల్గటూరు(జగిత్యాల)	44.2 డిగ్రీలు
గరిమెళ్లపాడు(భద్రాద్రి కొత్తగూడెం)	44.0 డిగ్రీలు
తాడ్వాయి (ములుగు)	44.0 డిగ్రీలు
కొల్లాపూర్(నాగర్‌కర్నూల్)	44.0 డిగ్రీలు
అర్లి(టి)(ఆదిలాబాద్)	44.0 డిగ్రీలు

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ఓవైపు కొలిమిలా ఎండ..మరోవైపు తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. చాలా జిల్లాలో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలకుపైనే నమోదవుతున్నాయి. అన్ని జిల్లాల్లోనూ 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో అత్యధికంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండలు మరీ ఎక్కువగా ఉన్నాయి. అయితే, వచ్చే నాలుగైదు రోజుల్లో ఉష్ణోగ్రతలు కాస్త తగ్గే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. రాష్ట్రం మీదుగా దక్షిణ, ఆగ్నేయ దిశల నుంచి కింది స్థాయిలో గాలులు వీస్తున్నాయని చెప్పారు. ఆదిలాబాద్, కొమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామా బాద్, నిర్మల్, సంగారెడ్డి, కామారెడ్డి, వరంగల్, హన్మకొండ, ములుగు, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన కూడా పడే అవకాశం ఉందని తెలిపారు. రాబోయే 48 గంటల్లో జీహెచ్ఎంసీ పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు.



రాష్ట్రంలో 50 కరోనా కేసులు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో ఒక్క రోజులో 50 కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ బుధవారం కోవిడ్ స్టేటస్ బులెటిన్ విడుదల చేసింది. 39 మంది కరోనా నుంచి కోలుకున్నారు. 292 యాక్టివ్ కేసులున్నాయి. కరోనా అనుమానిత లక్షణాలున్న 6,389 మందికి టెస్టులు చేయగా వారిలో 0.78 శాతం మందిలో కోవిడ్–19 ఉన్నట్టు ఫలితాల్లో వెల్లడైంది. అంతకుముందు వారంలో మంగళవారం 52, సోమవారం 41, ఆదివారం 30, శనివారం 31, శుక్రవారం 43, గురువారం 45 చొప్పున కేసులొచ్చిన సంగతి తెలిసిందే.

హుజూరాబాద్ నియోజకవర్గం పార్టీ ఇన్‌ఛార్జిగా పాడి కౌశిక్ రెడ్డి

హైదరాబాద్ : హుజూరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జిగా ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

కోవిడ్ కంటే వాయు కాలుష్యమే కారణం

- ప్రపంచ మరణాలపై నిపుణుల నివేదిక
- ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం
- పసిపిల్లల పరిస్థితి మరింత దయనీయం





పాట్నా : దేశంలోని పలు ప్రాంతాలలో వీస్తున్న వడగాలుల కారణంగా వాయు కాలుష్యం పెరుగుతోంది. ఇది ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఖాట్మండుకు చెందిన నిపుణుల బృందం నిర్వహించిన అధ్యయనం ప్రకారం ప్రపంచంలోని మరణాలకు కోవిడ్ కంటే వాయు కాలుష్యమే ఎక్కువ కారణమవుతోంది.

భారత్‌లోనే కాకుండా పలు దేశాలలో కూడా ఇదే పరిస్థితి కన్పిస్తోంది. బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్‌తో పాటు దేశంలోని కొన్ని ప్రాంతాలలో వీస్తున్న వడగాలులు...దాని ద్వారా పెరుగుతున్న వాయు కాలుష్యం నిరుపేదలు, కార్మికులకు ప్రాణసంకటంగా మారుతోంది. ముఖ్యంగా నెలలు నిండని పసిపిల్లలు శ్వాసకోశ సమస్యలతో విలవిల్లాడుతున్నారు. వీటితో పాటు గుండె జబ్బులు, ఇతర అనారోగ్యాలతో దినదినగండంగా కాలం గడుపుతున్నారు. ముఖ్యంగా నిరుపేదలే ఎక్కువగా వీటి బారిన పడుతున్నారని నిపుణుల అధ్యయన నివేదిక తెలిపింది.

'ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకూ కోవిడ్‌తో మరణించిన వారి కంటే వాయు కాలుష్యంతో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్యే ఎక్కువగా ఉంది' అని వాయు నాణ్యతా నిపుణుడు డాక్టర్ భూపేష్ అధికారి చెప్పారు. అయినప్పటికీ వాయు కాలుష్యం విషయంలో మనమేమీ చేయలేకపోతున్నామని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన గాలి నాణ్యతను మెరుగుపరచేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. 'మన ప్రాంతంలో వాయు కాలుష్యానికి కారణమేమిటో, దానిని ఎలా నివారించాలో మనకు తెలుసు. స్వచ్ఛమైన గాలి కోసం మనం ప్రభుత్వంతో, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేయాల్సి ఉంది' అని భూపేష్ వివరించారు. అడవులలో ఏర్పడుతున్న అగ్ని ప్రమాదాలు వాయు కాలుష్యానికి కారణమవుతున్నాయని నివేదిక తెలిపింది. వాతావరణ మార్పులు, నివాస ప్రాంతాలలో వ్యర్థ పదార్థాలను తగలబెట్టడం కూడా కాలుష్య కారకాలు అవుతున్నాయి. ఈ కాలుష్యం జీవవైవిధ్యం పైన ప్రతికూల ప్రభావం చూపుతోంది.

పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా మంచు పర్వతాలు ఆందోళన కలిగించే స్థాయిలో కరిగిపోతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ రెండు డిగ్రీలు పెరిగితే యాభై శాతం మంచు పర్వతాలు కనుమరుగవుతాయి. ఫలితంగా నదీ ప్రవాహాలపై ప్రభావం పడుతుంది. స్వచ్ఛమైన నీటికి సంబంధించిన జీవవైవిధ్యం, వ్యవసాయం, తాగునీరు, ఇతర మానవ అవసరాల విషయంలో కూడా తీవ్ర పరిణామాలు చోటుచేసుకుంటాయి. వాయు నాణ్యత పడిపోవడంపై నిపుణుల నివేదిక తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది.

కేరళలో పంచాయతీలకు 'జల బడ్జెట్' ! దేశంలోనే తొలిసారి

కొచ్చి : కేరళ ప్రభుత్వం 15 బ్లాక్ పంచాయతీలకు చెందిన 94 గ్రామ పంచాయతీలకు 'జల బడ్జెట్'ను ప్రచురించింది. ఇలాంటి బడ్జెట్ ప్రవేశపెట్టడం దేశంలో ఇదే మొదటిసారి. కేరళలో ప్రతి సంవత్సరం చాలినంత వర్షపాతం నమోదవుతోంది. ప్రజావసరాలకు మించి నీరు అందుబాటులో ఉంటోంది. అయినప్పటికీ నడివేసవిలో నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉండడంతో ప్రభుత్వం ముందుగానే చర్యలు చేపట్టింది. కొరతను అధిగమించే దిశగా నీటి లభ్యతను పెంచడమే ఈ బడ్జెట్ ఉద్దేశం. దీని ప్రకారం స్థానిక పంచాయతీలు నీటి వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకుంటాయి. జల సంవత్సరం (జూన్ నుండి మే వరకు) అవసరాల కోసం బడ్జెట్‌ను సిద్ధం చేశారు. ఈ సంవత్సరంలో ప్రతి 10 రోజులను ఒక యూనిట్‌గా తీసుకుంటారు. ఆ సమయంలో నీటి లభ్యత, వినియోగాన్ని గుర్తిస్తారు. హరిత కేరళ మిషన్‌లో భాగంగా నదులు, నీటిపారుదల కాలువలను పునరుద్ధరించి భూగర్భ జలాలను పెంచేందుకు కృషి చేస్తున్నారు. రాబోయే కాలంలో అన్ని పంచాయతీలకూ జల బడ్జెట్ రూపొందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం మార్చి 22న పంచాయతీలు బడ్జెట్‌ను సమర్పిస్తాయి. జల బడ్జెట్ విడుదల సందర్భంగా ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

సమ్మె చేస్తే 'ఎస్మా' తప్పదు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లకు సంబంధించిన వేతన సవరణ ఒప్పందం పూర్తి అయినందున, దాన్ని ఉల్లంఘించి ఎవరైనా సమ్మెలోకి వెళ్తే చట్టప్రకారం 'ఎస్మా' పరిధిలో చర్యలు తప్పవని కార్మికశాఖ జాయింట్ కమిషనర్ శ్యాంసుందర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారంనాడిక్కడి అంజయ్యభవన్‌లో ఆయన సమక్షంలో విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు, యాజమాన్య ప్రతినిధులు 7 శాతం ఫిట్‌మెంట్, ఇతర అలవెన్సులకు అంగీకరిస్తూ ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ పారిశ్రామిక వివాద పరిష్కార చట్టం సెక్షన్ 12 (3) ప్రకారం ఈ ఒప్పందం జరిగిందని తెలిపారు. విద్యుత్ సంస్థల్లో పనిచేసే సిబ్బంది, ఆర్టిజన్ల వేతన సవరణపై నిర్ణయం తీసుకోవడం జరిగిందనీ, అందువల్ల దాన్ని ఉల్లంఘించి ఎవరైనా, ఏదైనా సంఘం విద్యుత్ సంస్థల్లో సమ్మెలు చేపట్టడం చట్ట విరుద్ధమన్నారు. యాజమాన్యంతోజరిగిన ఒప్పందంపై 1104, 327, హెచ్-58, 1535 సంఘాల ప్రతినిధులు సంతకాలు చేశారు.



ఎన్‌సీఈఆర్టీ పుస్తకాలలో కాలం చెల్లిన సమాచారం

న్యూఢిల్లీ : ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలలో దశాబ్దం క్రితం నాటి కాలం చెల్లిన సమాచారమే దర్శనమిస్తోంది. నైరుతి రుతుపవనాలకు సంబంధించిన సమాచారాన్ని తాజా పరచలేదు. భారత వ్యవసాయ విభాగం అధికారులు 2020లో రుతుపవనాలకు సంబంధించిన తాజా సమాచారాన్ని వెల్లడించినప్పటికీ ఎన్‌సీఈఆర్టీ పుస్తకాలలో మాత్రం అది కానరావడం లేదు. పాఠశాల విద్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన సమాచారం అందించాల్సిన ఈ సంస్థ తన విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తోంది. 2010లో వాతావరణ విభాగం అందించిన సమాచారమే ఇప్పటికీ ఈ పుస్తకాలలో కన్పిస్తోంది. 'జూలై 15 నాటికి రుతుపవనాలు దేశంలోని వాయవ్య ప్రాంతంలోకి ప్రవేశిస్తాయి' అని పాఠ్యపుస్తకాలలో ఉంది. అయితే సవరించిన అంచనాల ప్రకారం రుతుపవనాలు ఈ ప్రాంతంలోకి జూలై 8 నాటికే ప్రవేశిస్తాయి. అదేవిధంగా రుతుపవనాలు సెప్టెంబర్ 1వ తేదీ నాటికి వెనక్కి వెళతాయని పాఠ్యపుస్తకాలలో పేర్కొన్నారు. అయితే వాతావరణ విభాగం మాత్రం రుతుపవనాలు సెప్టెంబర్ 17న వాయవ్య ప్రాంతం నుంచి నిష్క్రమిస్తాయని చెబుతోంది. దేశంలోని ఇతర ప్రాంతాలలో రుతుపవనాల రాకపై కూడా తాజా సమాచారం ఇవ్వలేదు. పాఠశాలల్లో విద్యార్థులకు తప్పుడు సమాచారమే అందిస్తున్నారు. దీనిపై కొందరు విద్యార్థులు ఎన్‌సీఈఆర్టీకి సమాచారం ఇచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

మేడ్చల్ వరకు ఎమ్ఎమ్‌టీఎస్

సర్వీసుల సంఖ్య పెంపు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎమ్ఎమ్‌టీఎస్ సర్వీసులను మేడ్చల్ వరకు పొడిగించినట్టు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. దానితోపాటే సర్వీసుల సంఖ్యను కూడా పెంచినట్టు బుధవారంనాడొక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. జంటనగరాల నుంచి 90 రూట్ కిలోమీటర్ల పరిధి వరకు ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్లు నడుస్తున్నాయని వివరించారు. సికింద్రాబాద్-మేడ్చల్ మధ్య 20 ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్లు నడుస్తున్నాయనీ, ఫలక్‌నుమా-ఉందానగర్ మధ్య 20 సర్వీసుల్ని పొడిగించామన్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే/వచ్చే ప్రయాణీకులు ఉందానగర్ చేరుకొని, అక్కడినుంచి వెళ్లొచ్చని సూచించారు. అతితక్కువ టిక్కెట్ ధరతో వేగవంతమైన ప్రయాణం ఎమ్ఎమ్‌టీఎస్‌తో సాధ్యమవుతుందని తెలిపారు. కనిష్టంగా రూ.5 నుంచి గరిష్టంగా రూ.15 వరకే టిక్కెట్ చార్జీ ఉంటుందన్నారు. దీనివల్ల శివారు ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని అభిప్రాయపడ్డారు.

కర్నాటక ఎన్నికల స్టార్ క్యాంపెయినర్‌గా రేవంత్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కర్నాటక రాష్ట్ర ఎన్నికలకు బుధవారం 40 మంది అగ్రనేతలను స్టార్ క్యాంపెనర్లుగా ఏఐసీసీ ప్రకటించింది. పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకగాంధీ ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి టీపీసీసీ చీఫ్ ఎనుముల రేవంత్‌రెడ్డికి అవకాశం దక్కింది. రాష్ట్రం నుంచి ఆయా నియోజకవర్గాలకు ఇంచార్జీలుగా నియమించింది.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

చేవెళ్ల, వర్ధన్నపేట నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ స్థానిక నేతలు కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం శంకర్‌పల్లి మండలం, టంగటూరు, వర్ధన్నపేట హసన్‌పర్తికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు.

రాహుల్‌ది చారిత్రాత్మక నిర్ణయం :వీహెచ్

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీసీ గణన చేపడతామంటూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని మాజీ ఎంపీ వి హనుమంతరావు చెప్పారు. ఆ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు.

ఈహెచ్ఎస్‌పై... ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో చర్చించాలి

ఆరోగ్యశ్రీ సీఈవోకు హరీశ్ రావు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నగదు రహిత వైద్య సేవలు (ఎంప్లాయీస్ హెల్త్ స్కీం -ఈహెచ్ఎస్)పై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో సమగ్రంగా చర్చించాలని ఆరోగ్యశ్రీ సీఈవో విశాలచ్చిని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. చర్చించిన అనంతరం 10 రోజుల్లో నివేదిక రూపొందించాలని సూచించారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల వినతి మేరకు కొత్త ఈహెచ్ఎస్ విధానాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలో తీసుకువస్తామని అసెంబ్లీలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన సమీక్షలో ఆ దిశగా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. ఆరోగ్యశ్రీ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలనీ, వారానికి మూడు ఆస్పత్రులు సందర్శించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో రోగులకు అందుతున్న సేవలను తెలుసుకోవాలని కోరారు.

సమాచారం అడిగితే వెంటనే ఇవ్వాలి

ఈ ఏడాది ప్రారంభించాలనుకుంటున్న తొమ్మిది మెడికల్ కాలేజీలకు గాను ఆరింటికి అనుమతులు రావడం పట్ల మంత్రి హరీశ్ రావు హర్షం వ్యక్తం చేశారు. మిగిలిన మూడు కాలేజీల అనుమతుల కోసం ఎలాంటి సమాచారం అడిగినా వెంట వెంటనే సమర్పించాలని డీఎంఈ డాక్టర్ కె.రమేశ్ రెడ్డిని మంత్రి ఆదేశించారు.

విద్యుద్ఘాతంతో కాళ్లు కోల్పోయిన పంచాయతీ కార్మికుడు



- ఉస్మానియాలో పరామర్శించిన పాలడుగు భాస్కర్
- బాధిత కుటుంబానికి రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యుద్ఘాతంతో రెండు కాళ్లు కోల్పోయి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భూక్యా వెంకటేశ్‌ను సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, గ్రామపంచాయతీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఏజే రమేశ్ బుధవారం పరామర్శించారు. బాధితున్ని, అతని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం పాలడుగు భాస్కర్ మీడియాతో మాట్లాడుతూ..ఈ నెల 13న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం ముత్యాలంపాడులో విధుల్లో భాగంగా గ్రామపంచాయతీ కార్మికుడు భూక్యా వెంకటేశ్ కరెంట్‌పోల్‌పైకి ఎక్కి పనిచేస్తూ విద్యుద్ఘాతానికి గురయ్యాడని తెలిపారు. దీనివల్ల కాళ్లు, చేతులూ పూర్తిగా చచ్చుపడిపోయాయన్నారు. ఇన్ఫెక్షన్ సోకడంతో రెండు కాళ్లూ తీసేశారని తెలిపారు. మల్టీపర్పస్ వర్కర్ విధానం వల్లనే ఆ కార్మికుడు నేడు తన రెండు కాళ్లను కోల్పోవాల్సిన వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని బాధిత కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రెండెకరాల సాగు భూమి ఇవ్వాలని కోరారు. ఈ ఘటనకు కారణమైన సర్పంచ్, అధికారులపై చర్యలు తీసుకోవాలని భాస్కర్ డిమాండ్ చేశారు.

జీవితంలో భయపడాల్సిందేమీ లేదు.
అన్నీ అర్థం చేసుకోవాల్సినవే - మేరీ క్యూరీ

'పుల్వామా'లో అసలేం జరిగింది?

సంపాదకీయం

జమ్ము-కాశ్మీర్‌లోని పుల్వామాలో 40మంది వీరజవాన్లను బలిగొన్న పాకిస్థాన్ ఉగ్రవాద చర్య విషయమై ఆనాటి రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ మాలిక్ తెలిపిన వివరాలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. వారు బలికావడానికి పాక్ కుట్రల కంటే మన కేంద్ర ప్రభుత్వం, హోం మంత్రిత్వశాఖ, రక్షణ మంత్రిత్వశాఖ వైఫల్యమే ప్రధాన కారణమని ఆయన

> 300 కిలోలకు పైగా పేలుడు పదార్థాలున్న వాహనం అక్కడికి ఎలా చేరుకోగలిగింది? ఇంత భారీ ఆర్మీ కాన్వారు కదులుతున్నప్పుడు ఉగ్రవాదులు వెనుక రోడ్లపై పేలుడు పదార్థాలతో ఎలా ప్రయాణించారు? సంఘటనకు ముందు రోజు వచ్చిన నివేదికతో సహా 11 ఇంటెలిజెన్స్ నివేదికలు ప్రత్యక్ష ఉగ్రవాద దాడికి అవకాశం ఉందని చెప్పినా బాధ్యులెవరూ ఎందుకు పట్టించుకోలేదు? సిఆర్‌పిఎఫ్ డిమాండ్ చేసినా విమానాలు ఎందుకివ్వలేదు. ఇంటలిజెన్స్ సెక్యూరిటీ లోపాన్ని ఆరా తీసిన గవర్నర్ నోరు ఎందుకు మూయించారు? మనదేశ భద్రతా ప్రయోజనాలు, రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతలకు అనుగుణంగా మోడీ ప్రభుత్వం ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి.

వెల్లడించడంతో అప్పట్లో ప్రతిపక్షాల విమర్శలన్నీ వాస్తవాలని తేటతెల్లమయింది. మాలిక్ వెల్లడించిన అంశాలపై మోడీ ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. 2019 ఫిబ్రవరి 14... వీరజవాన్ల శరీరాలు ఛిద్రమై, రహదారులు రక్తమోడిన సమయంలో... మన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్‌లో ఓ విదేశీ టీవీ ఛానల్ షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. పుల్వామా ఘటన మధ్యాహ్నం 3.15 నుంచి 3.30 మధ్య జరిగితే ఆయన సాయంత్రం 6.45గంటలకు అందుబాట్లోకి వచ్చారు. దేశంతోపాటు ప్రపంచమంతా కలవరపాటుకు గురైన సమయంలో... దాదాపు మూడు గంటలపాటు ప్రధాని అందుబాటులో లేరు. సత్యపాల్ మాలిక్ తాజా ఇంటర్వ్యూ ప్రకారం... మన లోపాలు, తప్పిదాల వల్లే ఈ ఘటన జరిగిందని చెప్పగా, 'నోర్మూసుకో... ఈ విషయాన్ని బయటకు చెప్పొద్దు' అని ప్రధాని ఆదేశించారు. హోం మంత్రి అమిత్‌షా, భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా ఈ విషయాలేవీ బయట మాట్లాడొద్దని చెప్పారు. అప్పటికి లోక్‌సభ ఎన్నికలకు ఎనిమిది వారాల సమయం మాత్రమే ఉంది. ఈ ఘటనకు ముందు లోక్‌నీతి, ది హిందూ, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలప్‌మెంట్ సొసైటీ జరిపిన సర్వేలో విపరీతంగా పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ఆర్థిక వ్యవస్థ కునారిల్లుతుండటం తదితర అంశాలపై ప్రజల తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని, ఎన్నికల్లో ప్రతిఫలిస్తుందని తేలింది. పుల్వామా ఘటన జరిగిన జరిగిన 12వ రోజున భారత యుద్ధ విమానాలు పాకిస్థాన్ లో చొరబడి బాలాకోట్ ఉగ్రవాద స్థావరంపై బాంబు దాడి చేశాయి. పుల్వామాలో చిందించిన రక్తానికి భారత్ ప్రతీకారం తీర్చుకుందని, 300మంది ఉగ్రవాదులు హతమయ్యారని మీడియా పేర్కొంది. అనంతరం దేశభక్తి, జాతీయత చుట్టూ ఎన్నికల ప్రచారం సాగింది. భారీ మెజారిటీతో బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చింది.



రాష్ట్ర పాలనా యంత్రాంగానికి అధిపతిగా ఉన్న గవర్నర్‌ను వాస్తవాలు వెల్లడించొద్దని ప్రధాని, హోంమంత్రి, జాతీయ భద్రతా సలహాదారు బెదిరించి అడ్డుకున్నారని వెల్లడికావడమే తాజా సంచలనం. ఆయన లేవనెత్తిన అంశాల్లో ప్రధానమైనది... ఉగ్రవాద ముప్పు తీవ్రంగా ఉన్న తరుణంలో రోడ్డు మార్గంలో వేల మంది సైనికులను పంపించడం సరికాదని, కనీసం ఐదు విమానాలను ఏర్పాటు చేయాలని సిఆర్‌పిఎఫ్ శ్రీనగర్ ఐ.జి కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చేసిన విజ్ఞప్తిని బుట్టదాఖలు చేయడం. ప్రాణాలకు ముప్పున్న వీర సైనికులకు విమానాలు కేటా యించకపోవడానికి కారణాలేమిటో ఇప్పటికైనా కేంద్రం సమాధానమివ్వాలి. భద్రతా దళాలు నిత్యం రహదారులను జల్లెడ పడతాయి. ప్రతి వాహనాన్నీ తనిఖీ చేస్తాయి. 2,547మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లతో కూడిన 78వాహనాల కాన్వారు తీవ్రవాద దాడి ముప్పు ఉన్న హై సెక్యూరిటీ జోన్‌లోకి ప్రవేశిస్తుండగా, ఓ పేలుడు పదార్థాల వాహనం కూడలి నుంచి దూసుకొచ్చి ఓ ఆర్మీ ట్రక్కును ఢీకొట్టింది. దాంతో 40మంది సైనికులు బలయ్యారు. 12 రోజుల పాటు వందల కిలోమీటర్లు, మన భద్రతా చర్యలన్నింటినీ దాటి 300 కిలోలకుపైగా పేలుడు పదార్థాలున్న వాహనం అక్కడికి ఎలా చేరుకోగలిగింది? ఇంత భారీ ఆర్మీ కాన్వారు కదులుతున్నప్పుడు ఉగ్రవాదులు వెనుక రోడ్లపై పేలుడు పదార్థాలతో ఎలా ప్రయాణించారు? సంఘటనకు ముందు రోజు వచ్చిన నివేదికతో సహా 11 ఇంటెలిజెన్స్ నివేదికలు ప్రత్యక్ష ఉగ్రవాద దాడికి అవకాశం ఉందని చెప్పినా బాధ్యులెవరూ ఎందుకు పట్టించుకోలేదు? సిఆర్‌పిఎఫ్ డిమాండ్ చేసినా విమానాలు ఎందుకివ్వలేదు. ఇంటలిజెన్స్ సెక్యూరిటీ లోపాన్ని ఆరా తీసిన గవర్నర్ నోరు ఎందుకు మూయించారు? మనదేశ భద్రతా ప్రయోజనాలు, రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతలకు అనుగుణంగా మోడీ ప్రభుత్వం ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. పుల్వామాలో ఏం జరిగింది? ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? ఈ ఘటనను నిరోధించవచ్చా? అనే అంశాలపై వాస్తవాలు తెలుసుకునే హక్కు ప్రతి భారతీయుడికీ ఉంది.

క్రైస్తవులపై మోడీ కపట ప్రేమ-కేరళలో బీజేపీ కుయుక్తులు

ఈస్టర్‌డే నాడు ప్రధాని నరేంద్ర మోడీ న్యూఢిల్లీలోని పవిత్ర హార్ట్ కేథడ్రల్ చర్చిని సందర్శించడం గుర్తించుకోదగ్గ పరిణామం. తొమ్మిదేండ్ల క్రితం ప్రధాని అయిన దగ్గర నుండి మోడీ చర్చిని సందర్శించడం ఇదే ప్రథమం. అదే రోజు అంటే ఈస్టర్ సండేనాడు బీజేపీ నేతలు కూడా వివిధ ప్రాంతాల్లో చర్చి నేతలను కలుసు కున్నారు, వారి ఇండ్లకు వెళ్ళి ఈస్టర్ శుభాకాంక్షలు తెలియచేశారు. క్రైస్తవుల పట్ల అకస్మాత్తుగా మారిన ఈ వైఖరి చాలామందిని విస్మయపరిచింది. అయితే ఈ చర్య తీసుకోవడానికి వెనుక గల కారణం, ఉద్దేశ్యాలను కూడా మోడీని సూచనప్రాయంగా తెలిపారు. మూడు ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద సంబరాలు జరుపుకుంటున్న మద్దతు దారులను, కార్యకర్తలను ఉద్దేశించి మోడీ మాట్లాడుతూ... క్రైస్తవులు ప్రాబల్యంగా ఉండే మేఘాలయ, నాగాలాండ్‌లో బీజేపీ ఎలా విజయం సాధించిందో వివరించారు. అంటే క్రైస్తవులకు కూడా బీజేపీ ఆమోదయోగ్యం అవుతోందనడానికి ఇదొక సంకేతమని చెప్పుకున్నారు. ఇక బీజేపీ తదుపరి గురి, లక్ష్యం కేరళనే అని ప్రకటించారు. అసలు మేఘాలయ, నాగాలాండ్‌లో క్రైస్తవుల మద్దతు ఉందని చెప్పు కోవడమంతా బూటకం. ఎందుకంటే, మేఘాలయ అసెంబ్లీలో 60సీట్లకుగాను బీజేపీ రెండు సీట్లే గెలుచుకోగలిగింది.

> 2014లో మోడీ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చినప్పటి నుండి, క్రైస్తవుల ఆరాధనా స్థలాలపై, క్రైస్తవ కమ్యూనిటీపై 5,82,774 దాడులు చోటు చేసుకున్నాయి. క్రైస్తవులపై హింస, వారి పట్ల శత్రు వైఖరి వంటి వాటికి మూలాలు ఆర్ఎస్ఎస్ సిద్ధాంతంలోనే ఉన్నాయి. ముస్లింలు, క్రైస్తవులు ఇరువురూ హిందూ సమాజానికి పరాయివారనేది ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం.పైగా ఆర్ఎస్ఎస్ సంఘ సంచాలక్ ఎం.ఎస్.గోల్వాల్కర్ మూడు అంతర్గత ముప్పులు (ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు) ఉన్నాయని పేర్కొన్నారు.

నాగాలాండ్‌లో పాలక సంకీర్ణంలో జూనియర్ భాగస్వామిగా ఉంది.

జనాభాలో ముస్లింలు, క్రైస్తవులు కలిపి 45శాతం ఉండే కేరళలో పెద్దగా విజయం సాధించకపోయినా నిలదొక్కుకునేందుకు బీజేపీ తీవ్రంగా యత్నిస్తోంది. ముస్లిం జనాభాలో పెద్దగా పురోగతి సాధించలేమని గ్రహించిన బీజేపీ క్రైస్తవుల్లో నైనా కొంత ప్రభావాన్ని చూపగలగాలని భావిస్తోంది. కేరళ జనాభాలో 18శాతం మంది ముస్లింలే ఉన్నారు. ఇందుకుగాను, రెండంచెల వ్యూహాన్ని ఆమోదించింది. క్రైస్తవ కమ్యూనిటీలో ముఖ్యంగా కేరళలో సైరో-మలబార్ చర్చిగా చిరపరిచితమైన కేథలిక్ చర్చిలో ముస్లిం వ్యతిరేక భావాలు రెచ్చగొట్టేందుకు యత్నించడం ఇందులో మొదటిది. ఇటీవల కాలంలో, కొంతమంది చర్చి నేతలు లవ్ జిహాద్ గురించి వ్యతిరేకంగా మాట్లాడారు. క్రిస్టియన్ ఫ్రంట్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేశారు. ఇది ముస్లిం వ్యతిరేక ప్రచారాన్ని నిర్వహిస్తూ, కొన్ని ఆర్ఎస్ఎస్ సంస్థలకు సహకరిస్తోంది. క్రైస్తవులను, ముస్లింలను విభజించడం ద్వారా లబ్ధి పొందాలని బీజేపీ-ఆర్ఎస్ఎస్ ఉబలాటపడుతున్నాయి. బీజేపీ- ఆర్ఎస్ఎస్ రాజకీయాలకు అనుగుణంగా లేని ఎవరినైనా బెదిరించి, భయపెట్టి లొంగదీసుకోవడమనేది మోడీ ప్రభుత్వం అనుసరించే, పలుసార్లు ప్రయత్నించి విజయం సాధించిన పద్ధతి. ఇది రెండో వ్యూహం. కేరళలో చర్చి ఆఫ్ సౌత్ ఇండియా మోడరేటర్ బిషప్ ధర్మరాజ్ వంటి చర్చిల్లో వివిధ స్థాయిల్లో ఉన్న నేతలు, కె.పి.యోహాన్, పాల్ దినకరన్ తదితర మతనేతలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తులు ప్రారంభమయ్యాయి.

కథలిక్ చర్చి అత్యున్నత నేత, కార్డినల్ జార్జి అలెన్ చెర్రీ, ఎర్నాకులం-అంగమలై ఆర్చిడియోస్ ఆర్చిబిషప్‌పై ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు జరుపుతోంది. ఆర్చిడియోస్‌కి చెందిన ఆస్తుల అమ్మకాల్లో అవకతవ కలకు పాల్పడ్డారంటూ ఆయనపై మనీ లాండరింగ్ కేసును ఈడీ దాఖలు చేసింది. కఠినమైన విదేశీ విరాళాల నియంత్రణా చట్టాన్ని (ఎఫ్‌సిఆర్ఎ) అస్త్రంగా చేసుకోవడం ద్వారా కూడా ఒత్తిడి తెస్తున్నారు. దీని ద్వారా చారిటబుల్, విద్యా సంబంధ కార్యకలాపాల కోసం చర్చిలు అందుకునే విదేశీ నిధులను కోత పెట్టాలని చూస్తున్నారు. ఇటువంటి పద్ధతుల ద్వారా వివిధ చర్చిల నేతలను మెతకపరిచిన తర్వాత, ఇప్పుడు బెదిరింపులతో పాటూ కల్లబొల్లి మాటలు కూడా చెబుతున్నారు. కేథడ్రల్ చర్చిని మోడీ సందర్శించడాన్ని, కేరళలో చర్చి నేతలను బీజేపీ నేతలు కలుసు కోవడాన్ని ఈ నేపథ్యం నుండే చూడాల్సి ఉంది. తడి గుడ్డతో గొంతుకోసే ఈ వైఖరి క్రైస్తవ కమ్యూనిటీలో తాము చొచ్చుకు పోవడానికి ఉపకరిస్తుందని బీజేపీ ఆశిస్తోంది. అయితే కేరళలో ఈ సందేహాస్పదమైన పాత్ర మిగిలిన భారతదేశంలో బీజేపీ పాలన కింద క్రైస్తవులు ఎదుర్కొంటున్న దానికి పూర్తి భిన్నంగా ఉంది. 2014లో మోడీ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చినప్పటి నుండి, క్రైస్తవుల ఆరాధనా స్థలాలపై, క్రైస్తవ కమ్యూనిటీపై 5,82,774 దాడులు చోటు చేసుకున్నాయి. క్రైస్తవులపై హింస, వారి పట్ల శత్రు వైఖరి వంటి వాటికి మూలాలు ఆర్ఎస్ఎస్ సిద్ధాంతంలోనే ఉన్నాయి. ముస్లింలు, క్రైస్తవులు ఇరువురూ హిందూ సమాజానికి పరాయివారనేది ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం.పైగా ఆర్ఎస్ఎస్ సంఘ సంచాలక్ ఎం.ఎస్.గోల్వాల్కర్ మూడు అంతర్గత ముప్పులు (ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు) ఉన్నాయని పేర్కొన్నారు.

భారతదేశంలో క్రైస్తవ జనాభా చాలా తక్కువ, దశాబ్దాలుగా ఈ జనాభా కూడా తగ్గుతూ వస్తోంది. 1971లో 2.53 శాతంగా ఉన్న క్రైస్తవులు, 1991కి వచ్చేసరికి 2.43 శాతానికి తగ్గారు. 2001లో 2.34శాతంగా ఉండగా, 2011లో గత జనాభా లెక్కల్లో 2.30శాతానికి పడిపోయింది. ఇంత తక్కువ సంఖ్యలో ఉన్న జనాభా కూడా దేశంలోని పలు ప్రాంతాల్లో ముట్టడికి గురవుతున్నారు. క్రైస్తవులపై దాడులు 2022లో విపరీతంగా పెరిగాయని యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం (యుసిఎఫ్) నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. 21 రాష్ట్రాల్లో క్రైస్తవులపై 598 హింసాత్మక కేసులు నమోదయ్యాయి. 2018లో హింసాత్మక సంఘటనలు 292 ఉండగా, 2019లో 328 కేసులు నమోదయ్యాయి. కోవిడ్ మహమ్మారి, లాక్‌డౌన్ కారణంగా 2020లో కేసులు తగ్గి 279గా నమోదయ్యాయి. తిరిగి 2021లో ఒక్కసారిగా కేసులు పెరిగి 505కి చేరుకున్నాయి. 2022 చివరి త్రైమాసికంలో చత్తీస్‌గఢ్‌లో క్రైస్తవ ఆది వాసీలపై విస్తృతంగా దాడులు జరిగాయి. ఆర్ఎస్ఎస్‌కి చెందిన వివిధ సంఘాలతో ఏర్పడిన జన్‌జాతి సురక్షా మంచ్ పేరుతో క్రైస్తవ వ్యతిరేక విషపూరిత ప్రచారం నిర్వహించబడింది. ఫలితంగా దక్షిణ చత్తీస్‌గఢ్‌లోని మూడు జిల్లాల్లో విచ్చలవిడిగా దాడులు, హింస చోటు చేసుకున్నాయి. ఈ హింస, తమపై వివిధ రూపాల్లో అమలవుతున్న సామాజిక బహిష్కరణల కారణంగా వేలాదిమంది క్రైస్తవులు తమ గ్రామాలను వదిలివెళ్ళాల్సి వచ్చింది. చత్తీస్‌గఢ్‌లోని క్రైస్తవ గిరిజనుల మీద జరిగిన దాడులపై ఆ ఏరియాల్లో పర్యటించిన సీపీఐ(ఎం) ప్రతినిధి



బృందం రూపొందించిన సమగ్ర నివేదిక ప్రచురితమైంది.


క్రైస్తవ ఆదివాసీలను ఎస్‌టి రిజర్వేషన్ జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని ఆదివాసీ సంఘాలు నిర్వహించిన ప్రచారం నేపథ్యంలోనే చత్తీస్‌గఢ్‌లో క్రైస్తవ గిరిజనులపై దాడులను చూడాల్సి ఉంది. గిరిజనుల్లో క్రైస్తవ మతానికి మారిన వారు రిజర్వేషన్‌కు అర్హులు కారని వారు వాదిస్తున్నారు. ఈ డిమాండ్ పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉన్నాయి. ఉదాహరణకు, ఈశాన్య ప్రాంతంలోని పలు గిరిజన కమ్యూనిటీలు క్రైస్తవులే, ఇప్పుడు ఆర్ఎస్ఎస్ చేస్తున్న ఈ డిమాండ్ వల్ల వారు ఎస్‌టీ హోదా కోల్పోతారు. బలవంతంగా మత మార్పిడులకు ప్రయత్నిస్తున్నారనేది క్రైస్తవులపై మరో రూపంలో జరుగుతున్న దాడి. కేరళకు పక్కనే గల కర్నాటకలో బీజేపీ ప్రభుత్వం "మత స్వేచ్ఛా హక్కు పరిరక్షణ చట్టం" పేరుతో నిరంకుశ మత మార్పిడి

> కేంద్రంలోని బీజేపీ పాలకుల నిరంతర ఒత్తిడి కారణంగా, కేరళలో కొంతమంది చర్చి నేతలు తలొగ్గారు, ఆర్చిబిషప్ జోసెఫ్, పాంప్లనీ ఆఫ్ ది తలస్సెరి ఆర్చిడియోసిస్ వంటి వారు రాజీ పడ్డారు. తనపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేయాలంటూ కార్డినల్ జార్జి అలెన్‌చెరీ సుప్రీంలో పెట్టుకున్న పిటిషన్ ఇటీవల తిరస్కరణకు గురైంది. జార్జి అలెన్‌చెరీ ఈస్టర్ సండే రోజున ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... మోడీ మంచి నేత అని వ్యాఖ్యానించారు. బీజేపీ పాలనలో క్రైస్తవులు అభద్రతగా లేరని సెలవిచ్చారు. కొంతమంది చర్చి నేతలు చేస్తున్న ఈ ప్రకటనలను మొత్తంగా చర్చి, క్రైస్తవ కమ్యూనిటీ వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలుగా చూడడం తప్పే కాగలదు.

చట్టాన్ని తీసుకు వచ్చింది. 2022 సెప్టెంబరులో దీన్ని ఆమోదించారు. ఈ చట్టంలో నిరంకుశ నిబంధనలు ఉన్నాయి. మత మార్పిడి జరిగిన వ్యక్తి కుటుంబానికి చెందని వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదులను ఆధారంగా చేసుకుని బలవంతంగా మత మార్పిడికి పాల్పడ్డారనే ఆరోపణలపై చర్చిల్లోని మతాధిపతులను అరెస్టు చేయవచ్చు. రాష్ట్రంలోని చర్చిల్లో వివిధ స్థాయిల్లోని వ్యక్తులు ఈ చట్టానికి వ్యతిరేకంగా సమైక్యంగా నిరసన తెలియచేశారు. వీటి పరిష్కారం కోసం కోర్టుకు కూడా వెళ్లారు.

కేంద్రంలోని బీజేపీ పాలకుల నిరంతర ఒత్తిడి కారణంగా, కేరళలో కొంతమంది చర్చి నేతలు తలొగ్గారు, ఆర్చిబిషప్ జోసెఫ్, పాంప్లనీ ఆఫ్ ది తలస్సెరి ఆర్చిడియోసిస్ వంటి వారు రాజీ పడ్డారు. తనపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేయాలంటూ కార్డినల్ జార్జి అలెన్‌చెరీ సుప్రీంలో పెట్టుకున్న పిటిషన్ ఇటీవల తిరస్కరణకు గురైంది. జార్జి అలెన్‌చెరీ ఈస్టర్ సండే రోజున ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... మోడీ మంచి నేత అని వ్యాఖ్యానించారు. బీజేపీ పాలనలో క్రైస్తవులు అభద్రతగా లేరని సెలవిచ్చారు. కొంతమంది చర్చి నేతలు చేస్తున్న ఈ ప్రకటనలను మొత్తంగా చర్చి, క్రైస్తవ కమ్యూనిటీ వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలుగా చూడడం తప్పే కాగలదు. కేథలిక్ చర్చిలో కొన్ని వర్గాలు పాంప్లనీ అభిప్రాయాలను తిప్పికొడుతున్నాయి. కేరళ లోని క్రైస్తవులు కేరళ సమాజంలో లోతుగా పాతుకు పోయిన లౌకిక కూర్పులో భాగంగానే ఉన్నారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్ క్రైస్తవ వ్యతిరేక స్వభావం వారికి బాగా తెలుసు. దేశవ్యాప్తంగా ఉన్న క్రైస్తవుల అనుభవాలు కూడా వారికి తెలుసు. బీజేపీ, హిందూత్వ శక్తుల ఈ ఎత్తుగడలను తిప్పి కొట్టడానికి అవసరమైన చర్యలను వామపక్ష ఉద్యమం, కేరళలోని వామపక్ష ప్రజాతంత్ర సంఘటన తీసుకుంటా యన్న నమ్మకం ఉంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)




'ఇంద్రవెల్లి' ఓ.. నెత్తుటి సాక్ష్యం

దేశ చరిత్రలో దారుణ మారణకాండ అది. మరో జలియన్ వాలాబాగ్ ఘటనగా చరిత్రకెక్కిన రక్తపుటేరు. జల్,జంగిల్,జమీన్ కోసం నినదించిన అడవి బిడ్డలపై సర్కార్ తుపాకీ ఎక్కుపెట్టిన ఘటనలో ఆదివాసులు పిట్టల్లా కాల్చి చంపబడిన ఘటనకు నెత్తుటి సాక్ష్యం. అదే ఇంద్రవెల్లి ఘటన. చరిత్రపుటల్లో నెత్తుటి గాయమైన ఇంద్రవెల్లి పోరాట ఘట్టానికి 42ఏండ్లు పూర్తవుతున్నా అడవి బిడ్డల బతుకులు మాత్రం మారలేదు. వారి ఆకాంక్షలూ నెరవేరలేదు. నాలుగు దశాబ్దాలుగా న్యాయం ఊసే లేదు. ఆదివాసుల హక్కులు రాజకీయ నాయకులకు ఎన్నికల ఎజెండాగానే మారాయి. గిరిజన ప్రాంతాల్లో ఆదివాసులు అసౌకర్యాలతో పోరాడుతున్న పరిస్థితి నేటికీ ఉంది.

ఆరోజు 1981 ఏప్రిల్ 20. ఆదివాసుల చట్టబద్ధమైన హక్కుల కోసం గిరిజన రైతు కూలీ సంఘం పేరిట ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. పోలీసులు అనుమతి ఇవ్వకపోయినా సభ ఏర్పాటు చేయడంతో ఉదయం నుంచి నాలువైపుల నుండి భారీగా ఆదివాసులు తరలివచ్చారు. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో సభా స్థలాన్ని ఖాళీ చేయాలని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. అయినా గిరిజనులు ర్యాలీగా సభ స్థలానికి బయలుదేరారు. ర్యాలీలో ముందున్న ఓ గిరిజన యువతితో పోలీసులు అసభ్యకరంగా ప్రవర్తించారు. దీంతో ఆ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. పరిస్థితి చేయి దాటిపోవడంతో పోలీసులు తూటాల వర్షం కురిపించారు. ప్రాణాలు కాపాడుకునేందుకు ఉద్యమకారులు, ఆదివాసులు పరుగులు తీశారు. ఈ ఘటనలో కేవలం 13మంది మాత్రమే చనిపోయినట్లు, 60మంది వరకు గాయపడినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ పోలీసుల భయంతో బయటికి రాలేక వైద్యమందక సుమారు 40మందికి పైగా ఆదివాసి గిరిజనులు చనిపోయినట్లు పౌరహక్కుల సంఘం తన నివేదికలో స్పష్టం చేసింది. కాల్పుల ఘటన తరువాత అప్పటి ముఖ్యమంత్రి అంజయ్య ఇంద్రవెల్లి మండలం పిట్ట బోంగారం గ్రామాన్ని సందర్శించి బాధితులను ఆదుకుంటామని హామీనిచ్చారు. ఆయన ప్రకటించిన పరిహారం నేటికీ అందలేదు. అలాగే కేంద్ర మంత్రి హోదాలో వచ్చిన జైరామ్ రమేష్ ఇంద్రవెల్లి స్థూపాన్ని స్మృతి వనంగా తీర్చిదిద్దుతామని, పర్యాటక కేంద్రంగా గుర్తిస్తామని ఇచ్చిన హామీ కలగానే మిగిలిపోయింది.

అలాగే గిరిజన గ్రామాలు అధికంగా ఉన్న ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం ఆదిలాబాద్,వరంగల్ జిల్లాల్లో గిరిజనులకు పోడు భూములకు పట్టాలిస్తామన్న ప్రభుత్వ హామీ ఇంతవరకు నెరవేరలేదు. ఏజెన్సీ ఏరియాగా గుర్తించబడిన ప్రాంతాలలో 1/70 చట్టం సంపూర్ణంగా అమలు కావడం లేదు. ఈ చట్టాన్ని కాపాడాల్సిన సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలు పట్టించుకోకపోవడంతో గిరిజన ప్రాంతాల్లో అక్రమార్కులు భూముల క్రయవిక్రయాలు జరుపుతూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. చాలా జిల్లాలోని పోడు గ్రామాల్లో అభివృద్ధి అంతంత మాత్రమే. నాడు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన పోరు గ్రామాలు నేటికీ అసౌకర్యాలతో సహవాసం చేస్తున్నాయి. సరైన రహదారులు, తాగునీరు లేక భూమిపై యాజమాన్య హక్కులు లేక మనుగడ కోసం నిత్యం పోరాటం కొనసాగిస్తున్నారు. ఆదివాసుల బతుకులు బాగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం తన వంతుగా ప్రయత్నాలు ప్రారంభించాలి. ఇంద్రవెల్లి ఘటనలో అసువులు బాసిన అమరుల ఆశయాల సాధన కోసం కృషి చేయాలి. అధికారికంగా వారి సంస్మరణ దినోత్సవం జరపాలి.

- అంకం నరేష్, 6301650324



నా వద్ద భాషలేదు

దేశం కోసం
ప్రాణ త్యాగం
వీరుల లక్షణం

పదవి కోసం
వీరులను
ఫణంగా పెట్టడం...
ఏమందాం..?

నా వద్ద భాషలేదు
ఎవరైనా చెప్తారా...
ప్లీజ్..

లోపల శత్రువుతో
లాలూచీ..?
బయటకు
సర్జికల్ స్ట్రైక్
రణభేరీ...?
అంతా అనుమానం...

తేలుకుట్టిన దొంగల్లా

నేతల మేనం
ఈ కాపట్యాన్ని
ఏమని పిలుద్దాం..?
నావద్ద భాషలేదు
ఎవరైనా చెప్తారా
ప్లీజ్..

"దేహంపై
గొంగళి పురుగులు
దేశంలో
పిశాచ గణాలు'
కలలు వంటి నిజాలు
కమ్ముతున్న వేళ
జవానులే శవాలా..?

ఈ 'ఆత్మనిర్భర్' ఆటను
ఎలా వర్ణిద్దాం..?
నా వద్ద భాషలేదు
ఎవరైనా చెప్తారా..
ప్లీజ్..

- శైలి

ప్రమాదాల నుంచి పాఠం నేర్వరా?



ఎస్. అజయ్‌కుమార్

మొన్న సికింద్రాబాద్ రూబీ హోటల్, నిన్న స్వప్నలోక్ కాంప్లెక్స్, నేడు కుషాయిగూడ టింబర్‌డిపో... ఇలా నగరాన్ని వరుస అగ్ని ప్రమాదాలు చుట్టుముడుతున్నా అధికారులు మాత్రం నిర్లక్ష్యం వీడటం లేదు. ఈ ఘటనల్లో అమాయకుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నా ప్రమాదాల నుంచి గుణపాఠం నేర్వడం లేదు. యథావిధిగా యాక్సిడెంట్స్ జరగడం, అధికారులు హడావిడి చేయడం... ఘటనా స్థలాన్ని నేతలు పర్యవేక్షించడం... కంటితుడుపు చర్యగా పరిహారం ప్రకటించడం... ఇదో తంతుగానే మారుతున్నది. అంతేతప్ప దీనికి బాధ్యులెవరు? అనే కోణంలో విచారణ మాత్రం సాగడం లేదు. అసలు అగ్ని ప్రమాదాలు ఎందుకు జరుగు తున్నాయి? ఫ్యాక్టరీల యజమానులు, బిల్డర్స్, ఫైర్‌సేఫ్టీ జాగ్రత్తలు తీసుకుంటున్నారా? ఇదో అంతుచిక్కని రహస్యంగానే ఉంది. మొన్నటివరకు కుక్కలు స్వైర విహారం చేస్తూ చిన్న పిల్లలను చంపితేగాని అధికారులు స్పందించలేదు. అయినప్పటికీ కుక్కల భయంతో చిన్నారులు, విద్యార్థులు, వృద్ధులు భయపడుతూనే ఉన్నారు. ఇప్పుడేమో అగ్ని ప్రమాదాలతో ఆందోళనలో ఉన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాలకులు తీసుకుంటున్న చర్యలేంటి? ప్రజలు ప్రశాంతంగా జీవించేలా నమ్మకం కలిగించేది ఎవరు? అసలు నగరంలో భద్రత ఉందా? లేదా! ఇలాంటి అనేక ప్రశ్నలు సామాన్యుల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

2022 సెప్టెంబర్ 13న సికింద్రాబాద్‌లోని ఎలక్ట్రిక్ స్కూటీ షోరూంలో అగ్ని ప్రమాదం జరగడంతోపై అంతస్తులో ఉన్న రూబీ హోటల్‌కు మంటలు వ్యాపించి ఎనిమిది మంది చనిపోయారు. దట్టమైన పొగ వారిని కమ్మేయడంతో ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే ఐదుగురు సజీవదహన మయ్యారు. మరో ఐదుగురు బిల్డింగ్‌పై నుంచి దూకేసి తీవ్ర గాయాలతో బయటపడ్డారు. మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందారు. ఈ ఘటన తర్వాత గానీ హోటల్, షోరూం నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోలేదని విచారణలో వెల్లడైంది. వారు నిబంధనలు పాటిస్తే ప్రాణనష్టం జరగకుండా ఉండేది. సెల్లార్‌లో షోరూంకు అనుమతివ్వడం దగ్గరినుంచి మొదలుపెడితే అన్నింట్లోనూ అధికారులు నిబంధనలు గాలికొదిలేశారు. అక్కడ ఎలక్ట్రిక్ స్కూటీల అసెంబుల్ చేసిన బ్యాటరీల్లో వినియోగించే లిథియం పేరుకుపోయి ఉంది. అధికారులు తనిఖీలు చేసిఉంటే గనుక ఇది బయటపడేది. అది చేయకపోవడంతో బ్యాటరీ పేలి షార్ట్‌సర్క్యూట్ అయింది. కార్బన్ మోనాక్సైడ్ విడుదలై మంటలు వ్యాపించడంతో 37 బైకులు కాలిపోయాయి. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా అనే ఆలోచన కూడా నిర్వాహకులు చేయలేదు. పై అంతస్తుల్లోకి వెళ్లడానికి, రావడానికి ఒకే దారి ఉంది. సెట్‌బ్యాక్ కూడా లేకపోవడంతో పొగకు ఊపిరాడక పాపం అమాయకులు మెట్లమీదనే ప్రాణాలొదిలారు.

ఇది జరిగి దాదాపు ఆరునెలలు గడిచాయి. అధికారులు అపార్ట్‌మెంట్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లను తనిఖీలు చేసి నిబంధనలు పాటిస్తున్నారా అని చూసి ఉంటే కొంతైనా ప్రమాదాలకు అడ్డుకట్టపడేది. కానీ వారి నిర్లక్ష్యం మరో ఆరుగురి ప్రాణాలను బలిగింది. ఈ ఏడాది మార్చి 17న సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్‌లో జరిగిన అగ్ని ప్రమాదం అత్యంత బాధాకరం. ఈ ఘటనలో ఆరుగురు మరణించారు. మొదట ఎనిమిదో అంతస్తులో మంటలు వ్యాపించి 5,6,7 అంతస్తుల్లోకి వచ్చాయి.ఆ సమయంలో 16మంది అందులో చిక్కుకున్నారు. కానీ ఐదో అంతస్తులో కాల్ సెంటర్‌లో పనిచేస్తున్న ఆరుగురిలో నలుగురు యువతులు, ఇద్దరు యువకులు సజీవ దహనమయ్యారు. వీరంతా 20 నుంచి 25 ఏండ్ల వయసువారే. ఎక్కడినుంచో వచ్చి చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా ఉండేవారు. కానీ అగ్ని ప్రమాదం వారిని బుగ్గి చేసింది. మొన్న తెల్లవారుజామున మూడున్నర గంటలకు కుషాయిగూడలో జరిగిన అగ్ని ప్రమాదంలో దంపతులతో సహా వారి ఐదేండ్ల కుమారుడు సజీవ దహనమయ్యారు. ఎక్కడో సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నుంచి



బతుకుదెరువు కోసం వచ్చిన కుటుంబం అగ్నికి ఆహుతైంది. ముందు టింబర్ డిపోలో జరిగిన అగ్ని ప్రమాదం తర్వాత పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌ను తాకింది. దట్టమైన పొగ మంటలు వ్యాపించడంతో రెండో అంతస్తులో ఉన్న కుటుంబం హాహాకారాలు చేస్తూ కిందకు వస్తుండగానే ఊపిరాడక మెట్లమీదే చనిపోయారు.

మరో ఘటనలో బోయగూడ గుజిరి గోదాంలో జరిగిన అగ్ని ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన పదకొండు మంది చనిపోయారు. వీరంతా రెక్కాడితే గానీ డొక్కాడని పేదలు. పొట్ట చేత పట్టుకుని పనికోసం వచ్చిన కూలీలు. వీరి బతుకులకు భద్రత లేదు. పనికోసం తీసుకొచ్చిన యజమానికి పట్టింపు లేదు. మరి వీరికోసం ఎదురు చూస్తున్న కుటుంబాలకు ఎవరు జవాబు చెప్పాలి? ఇలా నగరంలో జరుగుతున్న అనేక అగ్ని ప్రమాద ఘటనల్లో అనేకమంది అమాయకులు అసువులు బాస్తున్నారు. రేపు మరో అగ్ని ప్రమాదం జరగదని గ్యారంటీ లేదుకదా! నగరంలో జీవనం గాల్లో దీపమైతే ఎలా? ప్రజల రక్షణకు తీసుకుంటున్న చర్యలేవి? నిబంధనలు పాటించని యజ మానులకు నోటీసులు ఎందుకివ్వడం లేదు! ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలేవి? ప్రభుత్వం ఇంత ఉదాసీనంగా ఎందుకు వ్యవహరిస్తోంది. ఇలా అనేక ప్రశ్నల పరంపర ప్రజల్ని వేధిస్తున్నాయి. ఒకటి కాకపోతే మరొకటి, ఎక్కడ చూసినా అగ్ని ప్రమాదాలే! దీనికి తగిన కారణాలు వెతకాల్సిన అవసరం ఉన్నది. ప్రమాదాలు అరికట్టడానికి నూతన భద్రతా విధానాన్ని తీసుకు రావాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది.

కోటీ జనాభా ఉన్న మహానగరంలో ప్రజల రక్షణ ఇంత బలహీనంగా ఉంటే ఎలా? పేరుకే విశ్వనగరం కానీ ఇక్కడ ఉన్నదంతా లోపభూయిష్టం. ఎందుకంటే పది మంది కార్మికులు పనిచేసే పరిశ్రమలు, లేదా హోటల్, గోదాం ఏదైనా సరే! బలమైన రెగ్యులేటరీ వ్యవస్థ ఉండాలి. అనుకోని ప్రమాదం జరిగి ఎవరైనా చనిపోతే బీమా, రూ.50 లక్షల పరిహారంతో పాటు జీవనోపాధికి విద్యార్హతను బట్టి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కేటాయించాలి. ప్రమాద కారకులు తప్పించు కోకుండా కఠిన సెక్షన్‌లు విధించాలి. ప్రతి నెలా పరిశ్రమల్లో భద్రత, ప్రమాదాలు, కాలుష్య నివారణ అంశంపై విస్తృతంగా చర్చించి నివారణోపాయాలు వెతకాలి. కొత్తగా ఇండస్ట్రియల్ సేఫ్టీ పాలసీ తీసుకొచ్చి

> నగరంలో జరుగుతున్న అనేక అగ్ని ప్రమాద ఘటనల్లో అనేకమంది అమాయకులు అసువులు బాస్తున్నారు. రేపు మరో అగ్ని ప్రమాదం జరగదని గ్యారంటీ లేదుకదా! నగరంలో జీవనం గాల్లో దీపమైతే ఎలా? ప్రజల రక్షణకు తీసుకుంటున్న చర్యలేవి? నిబంధనలు పాటించని యజ మానులకు నోటీసులు ఎందుకివ్వడం లేదు! ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలేవి? ప్రభుత్వం ఇంత ఉదాసీనంగా ఎందుకు వ్యవహరిస్తోంది. ఇలా అనేక ప్రశ్నల పరంపర ప్రజల్ని వేధిస్తున్నాయి. ఒకటి కాకపోతే మరొకటి, ఎక్కడ చూసినా అగ్ని ప్రమాదాలే! దీనికి తగిన కారణాలు వెతకాల్సిన అవసరం ఉన్నది. ప్రమాదాలు అరికట్టడానికి నూతన భద్రతా విధానాన్ని తీసుకు రావాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది.

ప్రస్తుతమున్న రెగ్యులేటరీ వ్యవస్థలను పటిష్టం చేయాలి. వివిధ ప్రాంతాల్లోని పరిశ్రమలు, ఇండస్ట్రియల్ పార్కులు, గ్యాస్ గోదాంలను హైరిస్క్ జోన్‌లుగా గుర్తించాలి. వీటిపై అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ నిబంధనలు పాటించని వారి ఫ్యాక్టరీలను సీజ్ చేయాలి. సినిమాహాళ్లలో నైతే నిర్మాణలో పాలతో పాటు భద్రతా చర్యలు ఏమాత్రం కానరావడం లేదు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. నిర్మాణంలో ఉన్న భవనాలకు అన్ని సదుపాయాలు ఉంటేనే ప్లానింగ్ అధికారులు అనుమతులివ్వాలి. ఇలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటే అగ్ని ప్రమాదాలను కాస్తాయినా అరికట్టవచ్చు. లేదంటే అసలే వేసవికాలం, చిన్న అగ్గిరవ్వ తగిలితే చాలు విస్ఫోటనాలు సంభవించే అవకాశాలెక్కువ. ఇప్పటికైనా జరిగిన ప్రమాదాలనుంచి అధికారులు గుణపాఠాలు నేర్చుకుని ప్రజల జీవన భద్రతకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

మానవి
హైదరాబాద్
నవతెలంగాణ
5
గురువారం 20 ఏప్రిల్ 2023
www.navatelangana.com



అశుద్ధమంటూ ఎన్నేండ్లంటారు?

మనిషి మనుగడ ప్రారంభమై వేల ఏండ్లు గడుస్తుంది... అయినా ఆ పుట్టకకు కారణమవుతున్న రుతుస్రావం మాత్రం అశుద్ధంగానే పరిగణించబడుతుంది. ఆ సమయంలో ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాలలోని అమ్మాయిలు అంటరాని వారిగా బతుకుతున్నారు. ఆ వివక్షకు సజీవ సాక్షమే ఈ కథనం. ఉత్తరాఖండ్‌లోని ఉధమ్‌సింగ్ నగర్ జిల్లాలోని మహిళలు రుతుస్రావం, ప్రసవ సమయంలో అనుభవిస్తున్న వివక్ష, కష్టాలను మన కండ్లకు కట్టినట్టు చూపిస్తుంది. ఆ వివరాలేంటో మనమూ తెలుసుకుందాం...

గ్రామీణ భారతదేశంలోని కౌమారదశలో ఉన్న బాలికలు, యువతులపై PARI, కౌంటర్‌మీడియా ట్రస్ట్ కలిసి దేశవ్యాప్తంగా ఓ సర్వేను చేపట్టారు. ఆ ప్రాజెక్ట్‌లో భాగంగా పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (పీఎఫ్‌ఐ) సహకారంతో ఈ కథనం సేకరించబడింది. ఈ సర్వే ద్వారా ఇంకా అట్టడుగున ఉన్న ఎన్నో సమూహాలు పునరుత్పత్తి, లైంగిక ఆరోగ్యం, మహిళల హక్కుల పరిస్థితి, జీవన అనుభవాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

రెండు వేర్వేరు ప్రపంచాలు

పర్వత రాష్ట్రంగా పిలవబడే ఉత్తరాఖండ్‌లోని రాజ్‌పుత్ కమ్యూనిటీకి చెందిన ప్రియా 16 ఏండ్ల విద్యార్థిని. రుతుస్రావం సమయంలో తను అనుసరించాల్సిన కఠినమైన, నిర్దేశించిన నియమాల గురించి మాట్లాడుతూ "ఇది మాకు రెండు వేర్వేరు ప్రపంచాలలో జీవించడం లాంటిది. ఇంట్లో ఉన్నప్పుడు ఒంటరిగా ఉండాలి, అన్ని ఆచారాలు, ఆంక్షలను పాటించాలి. కానీ పాఠశాలలో మాత్రం స్త్రీలు పురుషులతో సమానమని బోధిస్తారు. అంటే నేను పాఠశాలలో ఏది నేర్చుకున్నా, అది నా ఇంటిలోని వాస్తవికతకు వ్యతిరేకం" అని ఆమె చెప్పింది.



కుటుంబాన్ని ఒప్పించలేకపోయాను

ఇంటర్ చదువుతున్న ప్రియా పాఠశాల తన గ్రామంలోని ఏడు కిలోమీటర్ల దూరంలో నానక్‌మట్ట పట్టణంలో ఉంది. ప్రతిరోజూ సైకిల్‌పై అక్కడికి వెళ్లి వస్తుంది. తెలివైన విద్యార్థిని అయిన ఆమె మొదట్లో ఈ అంశంపై తనకు తానుగా అవగాహన కల్పించుకోవడానికి ప్రయత్నించింది. "నేను దీని గురించి ఎన్నో పుస్తకాలు చదివాను, కానీ ఈ ఆచారాలకు అర్థం లేదని నా కుటుంబాన్ని ఒప్పించలేకపోయాను. 24 గంటలు వారితో జీవిస్తున్నాను. కానీ ఈ పరిమితుల గురించి వారికి అర్థం చేయించలేకపోతున్నాను" అంటుంది.

నా గదికే పరిమితం

ప్రియా ఇంటి పక్కనే ఉన్న మరొక రాజపుత్ర కుటుంబానికి చెందిన విధా రుతుస్రావంలో ఉన్నప్పుడు తన జీవన విధానాన్ని వివరిస్తూ "రాబోయే ఆరు రోజులు నేను నా గదికే పరిమితమై ఉంటాను. అమ్మ, నాన్నమ్మ నన్ను ఇంట్లో తిరగొద్దని చెప్పారు. నాకు కావాల్సినవి మా అమ్మ తెచ్చిపెడుతుంది" అని చెప్పింది. ఆమె గదిలో రెండు పడకలు, డ్రెస్సింగ్ టేబుల్, అల్మారా ఉన్నాయి. 15 ఏండ్ల విధా సాధారణ చెక్క మంచం మీద పడుకోలేదు. దాని వల్ల తనకు వెన్నునొప్పి వస్తుందని ఆమె చెప్పింది. కానీ ఆమె తన కుటుంబ మనశ్శాంతి" కోసం అలా చేస్తుంది.

ఎవరూ కాదనలేని ప్రజా జ్ఞానం

ఈ నిర్బంధించబడిన ఐసోలేషన్ సమయం లో విధా పాఠశాలకు వెళ్ళొచ్చు. అయితే సితార్ గంజ్ బ్లాక్‌లోని నాగలా గ్రామంలోని ఆమె ఇంటి లోని ఈ గదికి నేరుగా తిరిగి రావాలి. ఆమె తల్లి ఫోన్, అవసరమైన పుస్తకాలు మాత్రం ఆమెతో ఉంటాయి. ఒక స్త్రీ తన కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ, తన వస్తువులను వేరుగా ఉంచుకుంటుంది అంటే అది ఆమె రుతుస్రావం అని అందరికీ సంకేతం. రజస్వల అనేది ఎవరూ కాదనలేని ప్రజా జ్ఞానమని విధా ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. "అందరూ దీని గురించి తెలుసుకుంటారు, చర్చిస్తారు. రుతుక్రమంలో ఉన్న వ్యక్తి జంతువులను, పండ్ల చెట్లను తాకకూడదు, ఆహారం వండడానికి, వడ్డించడానికి, ఆలయం నుండి ప్రసాదాలను స్వీకరించడానికి కూడా అనుమతించబడదు" అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేస్తుంది.



దాని కోసమే నాలుగు ఆవులు

విధా తండ్రి సైన్యంలో ఉన్నారు. ఆమె తల్లి 13 మంది ఉన్న ఇంటిని చూసుకుంటుంది. ఇంత పెద్ద కుటుంబం ఉన్నా ఒంటరిగా ఉండటం ఆమెకు ఇబ్బందికరంగా ఉంది. దీని గురించి ఆమె తన అన్నదమ్ములకు చెప్పే ప్రయత్నం చేస్తే "ఇది ఒక అనారోగ్యం. అందుకే మీరు ఇంట్లో వారికి దూరంగా ఉంటున్నారు" అంటారు. ఎవరైనా ఆమెను తెలియకుండా తాకితే వారు కూడా అపవిత్రులుగా పరిగణించబడతారు. వారిపై కూడా గోమూత్రాన్ని పిచికారీ చేసి శుభ్రం చేస్తారు. ఆ ఆరు రోజులల్లో విధాతో సంబంధం ఉన్న ప్రతి దానిపై గోమూత్రాన్ని చల్లుతారు. వారి ఇంట్లో నాలుగు ఆవులు ఉండడంతో వాటి మూత్రం ఎప్పుడూ అందుబాటులో ఉంటుంది. సంఘం తర్వాత కొన్ని పద్ధతులను సడలించింది, అయితే స్వల్పంగా మాత్రమే. దాంతో 2022లో విధాకు పడుకోవడానికి ప్రత్యేక మంచం దొరికింది.

ఒక్కోసారి మర్చిపోయేవారు

అదే గ్రామానికి చెందిన 70 ఏండ్ల బీనా రుతుస్రావం అయినప్పుడు తాను పశువుల పాకలో ఎలా ఉండాల్సి వచ్చిందో వివరిస్తుంది. "మేము కూర్చోవడానికి నేలపై పైన్ ఆకులను వేసేవారు" అంటూ గుర్తుచేసుకుంది. మరొక పెద్ద వయసు మహిళ మాట్లాడుతూ "నాకు నూనెలోని రోటీలతో పాటు, చక్కెర లేని చాయ్ ఇచ్చేవారు. లేదంటే జంతువులకు పెట్టే ముతక ధాన్యంతో చేసిన రోటీలు పెట్టేవారు. కొన్ని సమయాల్లో అయితే మా గురించి మరచిపోయేవారు. దాంతో మేము ఆకలితో అలమటించే వాళ్ళము" అన్నారు.

సహజమైన ప్రక్రియ

29 ఏండ్ల యువకుడు తన భార్యతో కలిసి నానక్‌మట్ట పట్టణంలోని అద్దె గదిలో నివసిస్తున్నాడు. ఉత్తరాఖండ్‌లోని చంపావత్ జిల్లాకు చెందిన అతను పదేండ్ల నుండి ప్రైవేట్ పాఠశాలలో బోధించడం ప్రారంభించాడు. "రుతుస్రావం అనేది సహజమైన ప్రక్రియ అని మాకు ఎప్పుడూ చెప్పలేదు. చిన్నతనం నుండే మనం ఈ ఆంక్షలను పాటించడం మానేస్తే, మగవారు ఏ అమ్మాయికి లేదా స్త్రీకి రుతుక్రమం వచ్చినప్పుడు చిన్నచూపు చూడరు" అని ఆయన చెప్పారు.

కొనడం, పారవేయడం ఓ సవాల్

శానిటరీ ప్యాడ్‌లను కొనుగోలు చేయడం, పారవేయడం అక్కడ ఓ సవాలు. గ్రామంలోని దుకాణంలో ఒక్కోసారి అవి దొరుకుతాయి. కొన్ని సందర్భాల్లో దొరకవు. యువతులు వచ్చి దుకాణదారుడిని ప్యాడ్స్ కోసం అడిగితే వారు తమని వింతగా చూస్తున్నారని చెప్పారు. వాటిని కొన్న తర్వాత ఎవరి కంటికీ కనబడకుండా రహస్యంగా దాచి తీసుకువెళ్ళాలి. ఇక ఆ ప్యాడ్‌లను పారవేయడం 500 మీటర్ల దూరంలో ఉన్న కాలువ వరకు నడిచి వెళ్ళాలి. అది కూడా తాము అటుగా వెళ్ళడం ఎవరూ చూడకుండా జాగ్రత్త పడాలి.

ప్రసవం తర్వాత మరీ ఒంటరితనం

'అశుద్ధం' అనే ఆలోచన అప్పుడే పుట్టిన బిడ్డలపై కూడా ఉంటుంది. లతాకు యుక్తవయసులోనే పిల్లలు పుట్టారు. ఆమె అప్పటి సమయాన్ని బాగా గుర్తుంచుకుంటూ "రుతుక్రమం సమయంలో నాలుగు నుండి ఆరు రోజులు మాత్రమే ఒంటరిగా ఉండేవాళ్ళం. అయితే కొత్తగా తల్లి అయిన వారు 11 రోజుల పాటు ఇంటికి దూరంగా ఉండాలి. కొన్నిసార్లు ఇది 15 రోజులు కూడా పట్టొచ్చు. అంటే పిల్లల నామకరణ కార్యక్రమం పూర్తయ్యే వరకు కూడా ఉండవచ్చు. లత ప్రస్తుతం 15 ఏండ్ల అమ్మాయి, 12 ఏండ్ల అబ్బాయికి తల్లి. కొత్త తల్లి పడుకునే మంచాన్ని గుర్తించడానికి ఆవు పేడతో గీత గీసే వారిని గుర్తు చేసుకుంది.

అమ్మ అంటరానిదయింది

చాలా మంది స్త్రీలు, పురుషులు ఈ పద్ధతులు మత గ్రంథాలలో నిర్దేశించబడి ఉన్నాయని, వాటిని ప్రశ్నించ లేమని నమ్ముతారు. కొంతమంది మహిళలు ఇలా ఒంటరిగా ఉండడం తమకు ఇబ్బందిగా ఉందని, కానీ అలా వుండకపోతే దేవతలు అసంతృప్తి చెందుతారని అంటున్నారు. గ్రామంలో యువకుడైనా వినయ్ రుతుక్రమంలో ఉన్న స్త్రీలను చాలా అరుదుగా కలుసుకుంటానని చెప్పాడు. అతను పెద్దయ్యాక 'మమ్మీ అశుద్ హో గయా హై (మమ్మీ ఇప్పుడు అంటరానిదిగా మారింది)' అనే మాటలను ఇంట్లో వినేవాడినని చెప్పాడు.

అప్పడే పుట్టిన బిడ్డను కూడా...

అప్పుడే పుట్టిన బిడ్డ ఉన్న కుటుంబం చేతిలోంచి గ్లాసు నీళ్ళు కూడా ఊరిలో ఎవరూ స్వీకరించరు. మొత్తం కుటుంబం 'అపవిత్రమైనది'గా పరిగణించబడుతుంది. స్త్రీని లేదా నవజాత శిశువును తాకిన ఎవరైనా గోమూత్రాన్ని చల్లని తర్వాత శుద్ధి అవుతారు. సాధారణంగా పదకొండవ రోజున స్త్రీ, శిశువును స్నానం చేయించి గోమూత్రంతో కడుగుతారు.

ఆచారాలే ముఖ్యం...



గ్రామంలోని నరేందర్ అనే ఒక పెద్దాయనతో మాట్లాడితే "ఉత్తరాంచల్, ఉత్తరాఖండ్ పాత పేరు దేవతల నివాసం. కాబట్టి ఆచారాలు ఇక్కడ ముఖ్యమైనవి" అని చెప్పాడు. తమ కమ్యూనిటీలోని అమ్మాయిలు 9-10 ఏండ్ల వయసులో వారికి రుతుక్రమం రాకముందే పెండ్లి చేసేవారని ఆయన చెప్పారు. "ఆమెకు రుతుక్రమం ప్రారంభమైతే మనం కన్యాదానం ఎలా చేస్తాం?" అంటూ అతను ఒక అమ్మాయిని తన భర్తకు బహుమతిగా ఇచ్చే వైవాహిక ఆచారం గురించి మాట్లాడుతూ చెప్పాడు. "ఇప్పుడు ప్రభుత్వం వివాహ వయసును 21కి మార్చింది. అప్పటి నుండి ప్రభుత్వానికి, మాకు వేర్వేరు నియమాలు ఉన్నాయి" అంటున్నాడు.

గోమూత్రం చల్లితే చాలు

మహిళలను రుతుస్రావాన్ని 'అపవిత్రం' అని ప్రచారం చేస్తున్న ఈ దృక్పథం ఉధమ్ సింగ్ నగర్ జనాభాలో ప్రతిబింబిస్తుంది. అమ్మాయిల పట్ల చూపుతున్న వివక్ష స్పష్టంగా కనిపిస్తుంది. విధా మంచం కింద ఒక ప్లేటు, ఒక గిన్నె, స్టీల్ టంబ్లర్, చెంచా ఉంటాయి. ఈ సమయంలో తినడానికి ఆమె తప్పనిసరిగా అవే ఉపయోగించాలి. నాల్గవ రోజు ఈ పాత్రలను ఎండలో కడిగి ఆరబెట్టడానికి ఆమె త్వరగా మేల్కొంటుంది. "నేను కడిగి ఎండలో ఆరబెట్టిన ఆ గిన్నెలపై మా అమ్మ గోమూత్రాన్ని చల్లి వాటిని మళ్ళీ కడిగి వంటగదిలో ఉంచుతుంది. అలాగే ఆ రోజుల్లో ధరించడానికి మా అమ్మ నాకు రెండు జతల బట్టలు ఇస్తుంది. వాటిని ఉతికి ఇంటి వెనక భాగంలో దూరంగా ఆరబెట్టాలి. ఇతర బట్టలతో వాటిని కలపకూడదు" అంటూ ఆమె అనుసరిస్తున్న విధానాలను వివరిస్తుంది.

ప్రొఫెసర్ సాయిబాబా కేసును మరోసారి విచారించాలి

(మొదటిపేజీ తరువాయి)

దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సిటి రవి కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. మహారాష్ట్ర ప్రభుత్వం తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు, నిందితుల తరపున సీనియర్ న్యాయవాదులు ఆర్. బసంత్, నిత్య రామకృష్ణన్, న్యాయవాది షాదన్ ఫరాసత్ వాదనలు వినిపించారు.

కేసు పూర్వాపరాలు

మావోయిస్టులతో సంబంధాలున్నాయంటూ మహారాష్ట్ర పోలీసులు 2013లో ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా (52)పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 2014 మే 9న సాయిబాబాను ఢిల్లీలో అరెస్టు చేశారు. కోర్టు అతనిని జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. అప్పటికే ఈ వ్యవహారంలో మరో ఐదుగురు.. మహేశ్ టిర్కీ, హేమ్ కేశవదత్త మిశ్రా, ప్రశాంత్ రాహి, విజయ్ నాన్ టిర్కీ, పాండు పొరా నరోతే జైల్లో ఉన్నారు. మావోయిస్టులతో సంబంధాలతో పాటు దేశానికి వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నారంటూ చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) సెక్షన్ 45 (1), భారత శిక్షాస్మృతి (ఐపీసీ) కింద గడ్చిరోలి సెషన్స్ కోర్టు ఈ ఆరుగురిపైనా అభియోగాలు నమోదు చేసింది. ఆ తరువాత సాయిబాబాను ప్రాసిక్యూట్ చేసేందుకు శాంక్షనింగ్ అథారిటీ ఆమోదం తెలిపింది. 2015 అక్టోబరు 31న పోలీసులు అనుబంధ చార్జిషీటు దాఖలు చేశారు. విచారణ అనంతరం 2017 మార్చి 3న వారిని కోర్టు దోషులుగా ప్రకటించింది. సాయిబాబా సహా ఐదుగురికి జీవిత ఖైదు, ఒకరికి పదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ ఆరుగురూ అదే ఏడాది మార్చి 29న తమకు శిక్ష విధింపును ముంబయి హైకోర్టు నాగపూర్ బెంచ్ ముందు సవాల్ చేశారు. సాయిబాబాకు సెషన్స్ కోర్టు విధించిన జీవిత ఖైదు, జైలు శిక్షను హైకోర్టు కొట్టివేసింది. 2022 అక్టోబర్ 14 ముంబయి హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ ఇచ్చిన తీర్పులో ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. ఈ తీర్పును జాతీయ దర్యాప్తు సంస్థ, మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేస్తూ నాలుగు నెలల్లో మెరిట్స్ ఆధారంగా మళ్లీ సాయిబాబా కేసును విచారించాలని హైకోర్టును ఆదేశించింది. గతంలో నిర్దోషిగా ప్రకటించిన ధర్మాసనంతో కాకుండా మరో ధర్మాసనంతో విచారణ జరిపించాలని తన ఆదేశాల్లో పేర్కొంది.

అంతన్నారింతన్నారో...

(మొదటిపేజీ తరువాయి)

రమణారావు ఉన్నప్పుడు కూడా జరిగింది. అప్పట్లో ఎట్టకేలకు నీటి వ్యాపారాన్ని 'బిస్లరీ' కంపెనీకి అప్పగించారు. ఇప్పుడు సజ్జనార్ హయాంలోనూ అదే హడావిడి చేసి, చివరకు ఆ ప్రయత్నాలను తాత్కాలికంగా విరమించుకున్నట్టు తెలుస్తుంది. లాభాలు కురిపించే నీటి వ్యాపారంలోకి ప్రభుత్వరంగ సంస్థలు రాకుండా 'కార్పొరేట్' లాబీయింగ్ గట్టి ప్రయత్నాలే చేసిందని బస్టాండ్లలోని స్టాల్స్ వ్యాపారులు చెప్తున్నారు. రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సొంత జిల్లా ఉమ్మడి ఖమ్మంలోని బస్టాండ్లలో కూడా 'జీవా' కనిపించకుండా మాయం అయ్యింది. డిస్ట్రిబ్యూటర్లు ఇంకా ఖరారు కాలేదనీ, అందుకే నీళ్ల బాటిళ్లు బస్టాండ్లలోకి రాలేదని ఖమ్మం బస్టాండ్ క్యాంటిన్ నిర్వాహకులు 'నవతెలంగాణ'కు తెలిపారు. ఇక హైదరాబాద్‌లోని ఎమ్‌జీబీఎస్, జూబ్లీ బస్టాండ్లలో (జేబీఎస్) కార్పొరేట్ కంపెనీల నీళ్ల బాటిళ్లే కనిపిస్తున్నాయి. వాటితోపాటు ఆ పేర్లనే పోలినట్టుండే కిల్లీ, అక్వాఫైన్ అంటూ చిన్న అక్షరం తేడాతో రకరకాల బ్రాండ్ల లోకల్ నీళ్ల బాటిళ్ళను అమ్మేస్తున్నారు. ఈ లొల్లిని నియంత్రించేందుకే టీఎస్ఆర్టీసీ సొంత బ్రాండ్‌తో నీళ్లను తీసుకొస్తుందని ప్రచారం చేశారు.

స్పందించని అధికారులు

'జీవా' వాటర్ బాటిళ్లు మార్కెట్లోకి ఎందుకు రాలేదనే అంశాన్ని టీఎస్ఆర్టీసీలో సంబంధిత అధికారుల వద్ద ప్రస్తావిస్తే, దానిపై స్పందించేందుకు వారు నిరాకరించారు. కొందరు అధికారులకు ఫోన్ చేసి వివరణ కోరితే, బిజీగా ఉన్నామనీ, మళ్లీ చేయండనీ చెప్పుకొచ్చారు. వాట్సప్ ద్వారా మెసేజ్‌లు పెడితే 'బ్లూ'టిక్ వచ్చినా స్పందించలేదు. మర్మం ఏంటో?

బొగ్గు దందా.. మోడీ అండ

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. ఛత్తీస్‌గఢ్‌లో బొగ్గు మైనింగ్ విషయంలోనూ ఇలాగే వ్యవహరించింది. ప్రస్తుత గని దిగువన లక్షలాది టన్నుల బొగ్గు వెలికితీయకుండానే రాష్ట్రంలోని సుమారు 3వేల ఎకరాల అటవీ భూమిని క్లియర్ చేయడానికి మోడీ సర్కారు ఆమోదం తెలిపింది. రెండు ప్రభుత్వ సంస్థల నివేదికలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఈ నివేదికలను ఉటంకిస్తూ ఒక వార్త సంస్థ ఈ కథనాన్ని ప్రచురించింది.

ఈ కథనం ప్రకారం.. అదానీ గ్రూపు మైనింగ్ ప్రాంతాన్ని విస్తరించడానికి అనుమతులు లభించాయి. హస్దియో అరండ్ అటవీ ప్రాంతాన్ని అవసరమైన దాని కంటే వేగంగా తొలగించింది. హస్దియో అరండ్ మధ్య భారతదేశంలోని చివరి విడదీయని అటవీ ప్రకృతి దృశ్యాలలో ఒకటి. రెండు ప్రభుత్వ సంస్థలు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్, వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాలు మే 2019 మరియు ఫిబ్రవరి 2021 మధ్య ఉత్తర ఛత్తీస్‌గఢ్‌లోని హస్దియో అరండ్ బొగ్గు క్షేత్రంలో జీవవైవిధ్య అధ్యయనాన్ని నిర్వహించాయి. గని "ఓవర్‌బర్డెన్" లేదా బొగ్గు కోసం తొలగించబడిన మట్టిని ఊహించిన దానికంటే తక్కువ పరిమాణాన్ని అందించిందని అధ్యయనం పేర్కొన్నది. ఎందుకంటే గనిలో అత్యంత దిగువన ఉన్న సీమ్ త్రవ్వబడలేదని అధ్యయనం చూపించింది. అయినప్పటికీ.. అదానీ గ్రూప్ విస్తరించడానికి అనుమతించబడటం గమనార్హం.

వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా కూడా ఈ ప్రాంతంలో మైనింగ్‌తో కలిగే పర్యావరణ వ్యయాలను హైలైట్ చేసింది. "బ్లాక్ యొక్క ఇప్పటికే పనిచేస్తున్న గనిలో మాత్రమే మైనింగ్ ఆపరేషన్ అనుమతించబడవచ్చు" అని ఇది సిఫారసు చేసింది. ఫిబ్రవరి 2022లో గని విస్తరణను క్లియర్ చేస్తున్నప్పుడు పర్యావరణ ప్రభావాన్ని మోడీ ప్రభుత్వం విస్మరించింది. ఛత్తీస్‌గఢ్‌లోని ఆదివాసీ సమాజం నుంచి వచ్చిన తీవ్ర వ్యతిరేకతతో విస్తరణ ప్రణాళికకు ఎదురు దెబ్బ తగిలింది. రాష్ట్ర ప్రభుత్వం విస్తరణను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది.

అదానీ గ్రూప్ 2013 నుంచి రాజస్థాన్ రాష్ట్ర విద్యుత్ ఉత్పాదక సంస్థ, రాజస్థాన్ రాజ్య విద్యుత్ ఉత్పాదన్ నిగమ్ లిమిటెడ్ తరపున పర్సా ఈస్ట్, కాంటా బసన్ గని నుంచి బొగ్గును తవ్వి‌స్తున్నది. ప్రభుత్వ సంస్థలు మైనింగ్‌ను ప్రయివేటు సంస్థలకు అప్పగించడం సర్వసాధారణం. అయితే రాజస్థాన్, అదానీ గ్రూప్ మధ్య ఒప్పందం వివాదాస్పదంగా ఉన్నదని నివేదించబడింది. రాజస్థాన్ అదానీని మైనింగ్ కాంట్రాక్టర్‌గా మాత్రమే సైన్ అప్ చేయలేదు, కంపెనీతో జాయింట్ వెంచర్ ఒప్పందం కుదుర్చుకున్నది. దానికి 74 శాతం వాటాను కూడా ఇచ్చింది. ఈ ఒప్పందం 2007లో భారతీయ జనతా పార్టీ రాష్ట్రాన్ని పాలించిన నాటిది కావడం గమనించాల్సిన అంశం.

ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఏది ఏమైనప్పటికీ, ప్రాజెక్ట్ విస్తరణ కోసం రాజస్థాన్ బలంగా ముందుకు వచ్చింది. సెప్టెంబర్ 2020లో, రాజస్థాన్ రాజ్య విద్యుత్ ఉత్పాదన్ నిగమ్ లిమిటెడ్ కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. 762 హెక్టార్ల పార్సా ఈస్ట్ మరియు కాంటా బసన్ గనిలో మైనింగ్ కోసం క్లియర్ చేయబడిన బొగ్గు నిల్వలు దాదాపు అయిపోయాయని అందులో పేర్కొన్నది. "పవర్ స్టేషన్లకు స్థిరమైన బొగ్గు సరఫరాను నిర్ధారించడానికి, రాజస్థాన్ ప్రభుత్వం రెండో దశ ప్రాజెక్ట్ కోసం అవసరమైన అటవీ క్లియరెన్స్‌ను వేగవంతం చేయాలని పర్యావరణ మంత్రిత్వ శాఖను కోరింది. ఇది 1,137 హెక్టార్ల విస్తీర్ణంలో దాదాపు 2.5 లక్షల చెట్లను నరికివేయాల్సి ఉంటుంది. ఘట్‌బర్రా అటవీ గ్రామాన్ని పూర్తిగా తుడిచేస్తుంది"అని ప్రభుత్వం పేర్కొన్నది. దీంతో ఫిబ్రవరి 2022లో, అటవీ పరిరక్షణ చట్టం, 1980 ప్రకారం విస్తరణ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ తన ఆమోదాన్ని మంజూరు చేయగా, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం హస్దియో అరండ్ అటవీ సంరక్షణ కోసం నిరంతర ప్రజా ఉద్యమం నుంచి ఒత్తిడిని ఎదుర్కొంటూ తుది ఆమోదాన్ని నిలిపివేసింది.

జనాభాలో చైనాను అధిగమించి.. తొలిస్థానంలోకి భారత్..

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేసింది. భారత్‌లో అత్యధికంగా 142.86 కోట్ల జనాభా ఉన్నట్టు లెక్కకట్టింది. మనతో పోలిస్తే చైనాలో 29 లక్షల మంది తక్కువగా ఉన్నట్టు వెల్లడించింది. ప్రస్తుతం చైనా జనాభా 142.57కోట్లుగా అంచనా వేసింది. ఇక ప్రపంచంలో మూడోస్థానంలో ఉన్న అమెరికాలో 34కోట్ల మంది ఉన్నట్టు అంచనా వేసింది. ఫిబ్రవరి 2023 వరకు ఉన్న సమాచారాన్ని బట్టి ఈ అంచనాలు రూపొందించినట్టు తెలిపింది. ఐక్యరాజ్యసమితి జనాభా సమాచారాన్నిబట్టి జనాభా నిపుణులు భారత్ జనాభా ఈ ఏడాది పెరుగుతుందని అంచనా వేశారు. అయితే ప్రత్యేకించి ఏ నెలలో లేదా ఏ తేదీన చైనా జనాభాకంటే.. భారత్ జనాభా దాటుతుందనే విషయాన్ని జనాభా నిపుణులు పేర్కొనలేదు.

కాగా, 2011లో జనాభా గణన జరిగిందని, ఆ తర్వాత 2021లో జరగాల్సిన జనాభా గణన కరోనా కారణంగా ఆలస్యమైందని ఐక్యరాజ్యసమితి జనాభా అధికారులు తెలిపారు. ఇక ప్రపంచవ్యాప్తంగా ఆసియా దేశాలైన చైనా, భారత్ దేశాలే అత్యధిక జనాభాను కలిగి ఉన్నాయి. అయితే గతేడాది చైనా జనాభా గత ఆరు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా పడిపోయింది. ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసుకునే ప్రయత్నాల్లో భాగంగానే చైనా జనాభా తగ్గించుకుంటుందని నిపుణల అంచనా. 2011 నుంచి పరిశీలిస్తే భారతదేశ వార్షిక జనాభా సగటున సుమారు 1.2 శాతం పెరిగింది. భారత్‌లో జనాభా వేగంగా పెరుగడంపై సామాన్యుల్లో ఆందోళన కనిపిస్తోందని తాజా సర్వేలో తేలిందని యూఎన్ఎఫ్‌పీఏ భారత ప్రతినిధి ఆండ్రియా వొజ్‌నార్ తెలిపారు. అయితే, జనాభా పెరుగుదల అనేది ఆందోళన అంశంగా చూసే బదులు పురోగతి, అభివృద్ధి, వ్యక్తిగత హక్కులు, మరిన్ని అవకాశాలకు చిహ్నంగా చూడాలని ఆండ్రియా అభిప్రాయపడ్డారు.

కార్పొరేట్, మతతత్వ ఎజెండా దేశానికే ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులు అడిగిన ప్రశ్నలు, అదానీ-మోడీ మధ్య ఉన్న సంబంధంపై సమాధానమివ్వడంలో ప్రధాని విఫలమయ్యారని చెప్పారు. ఇటీవల యూపీలో పోలీసుల ముందే ఓ వ్యక్తిని హత్య చేశారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రజాస్వామిక హక్కులు కాలరాయబడుతున్నాయని, పోలీసు రాజ్యం నడుస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠ్యపుస్తకాల నుంచి గాంధీ, అబుల్‌కలాం ఆజాద్, నెహ్రూ వంటి స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను తొలగిస్తున్నారని అన్నారు. వారిని బీజేపీ గౌరవించడం లేదన్నారు. లౌకికత్వంపై దాడి చేస్తున్నదని విమర్శించారు. గవర్నర్ వ్యవస్థ ద్వారా ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిర పరిచేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని చెప్పారు. కేరళలో ప్రజలకు నాణ్యమైన విద్య అందించే విధానం అమల్లో ఉందన్నారు. డిజిటల్ విద్య పేదలకు అందుతున్నదని వివరించారు. విశ్వవిద్యాలయాల వరకు నాణ్యమైన విద్య అందించేందుకు కేరళ అసెంబ్లీ బిల్లులను పంపినా గవర్నర్ వాటిని ఆమోదించడం లేదన్నారు. తెలంగాణ, తమిళనాడులోనూ ఇదే పరిస్థితి ఉందని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇటీవల ఢిల్లీలో సమస్యల పరిష్కారం కోసం రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు ఉద్యమించారని గుర్తు చేశారు. మహారాష్ట్రలో రైతులు పెద్దపోరాటం చేస్తున్నారని అన్నారు. ప్రజా ఉద్యమాలకు సీపీఐ(ఎం) మద్దతుగా ఉంటుందన్నారు. వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఐక్యమై బీజేపీ విధానాలపై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

రాజకీయంగా స్నేహం... సమస్యలపై పోరాటం : తమ్మినేని

బీజేపీని వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్‌తో రాజకీయంగా స్నేహంగా ఉంటామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. అదే సమయంలో ఇచ్చిన హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ తప్పులను విమర్శిస్తాం, ఒప్పును సమర్థిస్తామని అన్నారు. బీజేపీ విధానాలు ప్రమాదకరమని, అందుకే కేసీఆర్‌ను సమర్థిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో బీజేపీ బలపడాలని చూస్తున్నదని చెప్పారు. ఇతర పార్టీల వారిని ప్రలోభాలకు గురిచేసి, లేదంటే బెదిరించి తమలో చేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నదని అన్నారు. ఢిల్లీలో కేజ్రీవాల్, మనీష్ సిసోడియాపై సీబీఐ దాడులు, ఇక్కడ కవితను ఈడీ విచారించడం అందులో భాగమేనని చెప్పారు. బీజేపీని అడ్డుకోవడమే తమ లక్ష్యమన్నారు. అందుకే బీఆర్ఎస్‌కు సానుకూలంగా ఉన్నామని చెప్పారు. భవిష్యత్తులో సీట్ల పొత్తు ఉండే అవకాశముందన్నారు. రాష్ట్రంలో 22 జిల్లాల్లో 50 వేల మంది గుడిసెలు వేసుకున్నారని అన్నారు. కోరుట్ల, పెద్దపల్లి, హన్మకొండ, వరంగల్, భూపాలపల్లి వంటి ప్రాంతాల్లో గుడిసె వాసులపై పోలీసులు దాడులు చేస్తున్నారని చెప్పారు. గుడిసెలు వేసే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తామని అన్నారు. అన్ని జిల్లాల్లో వచ్చేనెలలో సీపీఐ(ఎం) నాయకుల పర్యటనలుంటాయని, అవసరమైతే పొలిట్‌బ్యూరో సభ్యులు కూడా పాల్గొంటారని వివరించారు. ఆ గుడిసెలకు పట్టాలివ్వాల్సిన ప్రభుత్వం నిర్బంధం మోపుతున్నదని విమర్శించారు. 58 జీవో ప్రకారం పేదలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. జూన్‌లో ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యతోపాటు ఇతర సమస్యలపై కేంద్రీకరిస్తామని చెప్పారు. వీఆర్ఏలు రెండు నెలలు సమ్మె చేసి ప్రభుత్వ వాగ్దానంతో విరమించారని గుర్తు చేశారు. వారి సమస్యలను పరిష్కరిస్తామని, ఆ రెండునెలల వేతనం ఇస్తామన్నారని అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకులను ఏప్రిల్ ఒకటి నుంచి రెగ్యులరైజ్ చేస్తామన్నారని వివరించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామన్నారని చెప్పారు. ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులిస్తామన్నారని అన్నారు. దళితబంధు, డబుల్‌బెడ్రూం ఇండ్లు, ఆసరా పెన్షన్ల సమస్యలతోపాటు, డీఎస్సీ-98, 2008 వారికి ఉద్యోగాలివ్వాలని, ఆర్ఎంపీలకు శిక్షణనిస్తామన్నారని గుర్తు చేశారు. ఈ సమస్యలన్నింటినీ క్రోడీకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. జూన్‌లో సంతకాల సేకరణ, ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి, నిరసనలు చేపడతామని అన్నారు. చలో అసెంబ్లీ లేదా ప్రగతి భవన్ కార్యక్రమానికి ప్రజాసంఘాల పోరాట కమిటీ ఉద్యమ కార్యాచరణను రూపొందించిందని వివరించారు. ఆ పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని, తాము కూడా అందులో పాల్గొంటామని చెప్పారు. ప్రశ్నాపత్రాల లీకేజీతో 30 లక్షల మంది విద్యార్థులు, నిరుద్యోగులు షాక్‌కు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై సిట్, సీబీఐతో కాకుండా సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి ఊసేలేదన్నారు. వారంరోజుల్లో సీఎం కేసీఆర్‌ను కలిసి సమస్యలపై వివరిస్తామని అన్నారు. అఖిలపక్షం పేరుతో కొన్ని రాజకీయ పార్టీలు చేసే ఆందోళనల్లో తాము పాల్గొనబోమని విలేకర్లు అడిగిన ఓ ప్రశ్నకు తమ్మినేని సమాధానమిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించాలంటూ ఆయా పార్టీలు ప్రకటిస్తున్నాయని, తాము అలా కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. కొన్ని రాష్ట్రాల్లో ఉన్నట్టుగా బీజేపీని ఓడించే స్థాయిలో కాంగ్రెస్ లేదన్నారు. అయితే బీఆర్ఎస్‌తో సీట్ల గురించి ఇంకా చర్చ జరగలేదన్నారు. తమ బలానికి తగ్గట్టుగా సీట్లు కోరతామని చెప్పారు. తాము కోరుకున్నట్టుగా బీఆర్ఎస్ సీట్లు ఇవ్వకపోతే విడిగా పోటీ చేస్తామని అన్నారు.

స్ట్రాంగ్ రూమ్ తాళం పగలగొట్టండి

(మొదటిపేజీ తరువాయి)

హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అవన్నీ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి ఉన్నాయని రిటర్నింగ్ అధికారి ఆ సమయంలో చెప్పారు. దాని తాళాలు తెరిచి అడిగినవన్నీ ఇవ్వాలని ఆ తర్వాత కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో ఇటీవల ధర్మపురిలో స్ట్రాంగ్ రూమ్‌ను తెరిచేందుకు కలెక్టర్ ప్రయత్నించారు. మూడు గదుల్లో ఎన్నికల సామాగ్రి ఉండగా..ఒకగది తాళాలు తెరవలేకపోయారు. తాళం చెవి లేకపోవడంతో ఆ రూమ్‌ను తెరవలేకపోయామని కలెక్టర్ న్యాయస్థానానికి తెలిపారు. ఆ డాక్యుమెంట్లు కావాలంటే స్ట్రాంగ్ రూమ్ తాళం పగులగొట్టడమే ప్రత్యామ్నాయమని హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. స్ట్రాంగ్ రూమ్ తాళాలు పోయిన అంశంపై ముగ్గురు అధికారులతో విచారణ జరిపిస్తున్నామనీ, పూర్తిస్థాయి నివేదిక సమర్పిస్తామని ఎన్నికల అధికారులు ధర్మాసనానికి తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే తాళం చెవి మాయం చేశారనీ, అక్రమాలకు పాల్పడ్డారని లక్ష్మణ్ తరఫు న్యాయవాది వాదించారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు స్ట్రాంగ్ రూమ్ సీల్ పగలగొట్టేందుకు జగిత్యాల కలెక్టర్‌కు అనుమతించింది. అన్ని పార్టీల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్ తెరవాలని సూచించింది. రిటర్నింగ్ అధికారి కోరితే వాహనం, తగిన భద్రత ఇవ్వాలని ఆదేశించింది. అవసరమైతే వడ్రంగి, లాక్‌స్మిత్ సహకారం తీసుకునేందుకు కూడా అనుమతిచ్చింది.

నాణ్యమైన ఆహార పదార్థాలను అందిస్తేనే ప్రజాదరణ

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

నాణ్యమైన ఆహార పదార్థాలను అందిస్తేనే హెూటల్ మేనేజ్మెంట్ కు ప్రజాదరణ కలుగుతుందని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం నాదర్ గుల్ లో రాఘవేంద్ర టిఫిన్ సెంటర్‌ను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన రుచికరమైన ఆహార పదార్థాలను అందించినపుడే వినియోగదారుల సంఖ్య అధికంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెూటల్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల్లో సమస్యలు పరిష్కరించాలి

- కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తా

నవతెలంగాణ-ఎల్బీనగర్

చైతన్యపురి డివిజన్‌లోని ప్రభాత్ నగర్ , సత్యనారాయణ పురం కాలనీలలో స్థానిక కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తా ఆధ్వర్యంలో కాలనీ వెల్ఫేర్ సభ్యులు, కాలనీ వాసులతో పారిశుధ్య సమస్యలను చర్చించారు. అన్ని సమస్య లను 100 రోజుల్లో పరిష్కరించే విధంగా జీహెచ్ఎంసీ అధికారులను ఈ మేరకు ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కష్ణయ్య ,ఏఈ రవీందర్ రెడ్డి, ఏఈ పార్వతి , శానిటేషన్ అధికారి మహేందర్ రెడ్డి, ఇతర అధికారులు, పోలీస్ అధికారులు, కాలనీ వాసులు వెంకటేశ్వర్లు , బాలరెడ్డి, రమణారెడ్డి , జయశ్రీ , సుధాకర్ , విజయ్ , సతీష్ , బద్రీనాథ్, వెంకటేశ్వర్లు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్‌తో కలిసి మీర్‌పేట్‌లో పర్యటించిన మంత్రి



నవతెలంగాణ-మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్‌తో కలిసి మంత్రి మున్సిపల్ కార్పొరేషన్‌లోని చందన చెరువు, మంత్రాల చెరువు, పెద్ద చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మురికి నీటితో కలుషితం అవుతున్న చెరువులను.. కబ్జాకు గురికాకుండా అరికట్టి.. సుందరీకరణ చేస్తున్నట్టు తెలిపారు. చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్స్, చిన్నపిల్లల ప్లే పార్కులు, పెద్దలకు ఓపెన్ జిమ్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మాత్రల చెరువు, పెద్ద చెరువులలో త్వరలో పూడికతీత పనులు చేపడతామన్నారు.

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్ మాట్లాడుతూ.. వర్షాకాలం రాకముందే చెరువుల సుందరీకరణ పనులు, ఎస్ఎన్డీపీ నాలా పనులు పూర్తి చేయాలని, నాణ్యత లోపించకుండా వేగంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మేయర్ దుర్గాదీప్ లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్, డిఈ గోపీనాథ్, స్థానిక కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం శక్తితో ఎదగాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని శివసాయి నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన మహిళా పొదుపు సంఘాల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా మహిళలకు పెద్దపీట వేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. పావలా వడ్డీతో మహిళలకు రుణాలు మంజూరు చేసి చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధితో ఎదగాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ రుణాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. మహిళ శ్రేయస్సు కోసం పని చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని మహిళలు మర్చిపోవద్దని కోరారు. అనంతరం మహిళ సంఘాల ప్రతినిధులకు కోటి రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, కార్పొరేటర్ జిల్లెల అరుణ ప్రభాకర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



ద్విచక్ర వాహనం చోరీకి పాల్పడుతున్న బాలురు అరెస్ట్



నవతెలంగాణ-వనస్థలిపురం

చదువుకుని వృద్ధిలోకి రావలసిన నలుగురు మైనర్‌లు జల్సాల కు అలవాటు పడి ద్విచక్ర వాహనాలు చోరీలకు పాల్పడుతూ పోలీసులకు అడ్డంగా దొరికిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ జలంధర్ రెడ్డి పర్యవేక్షణలో డిటెక్టివ్ సిఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్‌కేడీ నగర్ మంగావత బాలకృష్ణ తన ఇంటి ముందు టీఎస్ 07 జే డబ్ల్యు 7837 నెంబర్ గల స్పెండర్ ప్లస్ పార్కు చేయగా గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు భాగంగా వనస్థలిపురం సుష్మా చౌరస్తాలో వాహ నాలు తనిఖీలు చేస్తుండగా ఆ స్ప్లెండర్ ప్లస్ పై బాలురు వెళుతుండగా పోలీసులు వారిని ఆపారు. వాహనానికి సంబంధించిన పత్రాలు చూపించమనడంతో పారిపోవడానికి ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ మేరకు వనస్థలిపురం కమలా నగర్,శ్రీ సాయి నగర్, ఎస్ ఎఫ్ కాలనీలలో మూడు వాహనాలు దొంగిలించినట్లు బాలురు ఒప్పుకున్నారు. ఆ వాహనాల తర్వాత అమ్ముదాం అన్న ఉద్దేశంతో ఇంటి దగ్గరే ఉంచినట్లు ఆ మైనర్లు పేర్కొన్నట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఆ మైనర్లపై కేసు నమోదు చేసి వారిని జువెనాల్ హెూమ్ కి తరలించి వారి వద్ద నుంచి మరో మూడు వాహనాలు టీఎస్ 16 ఈ ఎల్3448 నెంబర్ గల గ్లామర్, టీఎస్ 09 ఇవి 4412 నెంబర్ గల హెచ్ ఎఫ్ డీలక్స్ బైక్, టీఎస్ 08 ఈ ఎఫ్ 9592 నెంబర్ గల స్ప్లెండర్ ప్లస్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కార్పొరేట్ పాఠశాలలకు నోటీసులు



నవతెలంగాణ- సంతోష్‌నగర్

ఒక్క పూట బడులను నిర్వహించకుండా, ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న నారాయణ, భాష్యం స్కూళ్లకు మండల విద్యాశాఖ అధికారి కృష్ణయ్య ఆదేశాల మేరకు సీఆర్పీ రమేష్ నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మెట్టల చైతన్య యాదవ్, పి.శివకుమార్ మాట్లాడుతూ.. నిబంధనలను వ్యతిరేకంగా నడుపుతున్న దిల్‌సుఖ్‌నగర్ నారాయణ, భాష్యం కార్పొరేట్ స్కూళ్లను సీజ్ చేయాలని డిమాండ్ చేశా రు. అంతేకాకుండా అకడమిక్ సంవత్సరం ప్రారంభం కాక ముందే 9వ తరగతి విద్యార్థులకు పదో తరగతి సిలబస్ చెబుతూ విద్యార్థులను మనోవేదనకు గురి చేస్తున్నార న్నారు. స్పెషల్ క్లాసులు, పండుగల పేరు మీద పెద్దఎత్తున ఫీజులు వసూలు చేస్తున్నారని, ఇలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల విద్యాశాఖ అధికారి కృష్ణయ్యకు ఫిర్యాదు చేసిన వెంటనే వారు సీఆర్పీ రమేష్‌కి పంపించి దిల్‌సుఖ్‌నగర్ నారాయణ, భాష్యం స్కూళ్లకు నోటీసులు ఇచ్చారన్నారు. అయితే, ఇది పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ మొహమ్మద్, ఏఐఎస్ఎఫ్ నాయకులు కార్తీక్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాం

- ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్

వీధి కుక్కల నివారణ కోసం అధికారులు ప్రజల సహకారంతో అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి అన్నారు. బుధవారం చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్, వెటర్నరీ హై లెవెల్ కమిటీ మెంబర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ రాఘవేంద్ర నగర్ కాలనీలో కుక్కలకు, ఇతర జంతువులకు నీటి కోసం తొట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కార్పొరేటర్ మాట్లాడుతూ.. వేసవికాలంలో కుక్కలకు, ఇతర జంతువులకు తాగడానికి నీటి కోసం ఇబ్బంది పడకుండా ఉండటానికి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నీళ్ల తొట్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా వారి వారి ఇంటి ముందర జంతువుల కొరకు తొట్లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీల అధ్యక్ష కార్యదర్శులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పల్లె నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి కోకొండ జగన్, పంజ్ల కిషన్, రామానుజన్, అశోక్ చారి, అబ్బో భాయ్, మహమూద్, బాలు, బ్యాలెండర, శైనాజ్, రోసి రెడ్డి, రామకృష్ణ, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

'పారిశుధ్య సమస్యను పరిష్కరించాలి'



నవతెలంగాణ -ఎల్బీనగర్

సరూర్‌నగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో పారిశుధ్య సమస్య పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం నరసింహపురి కాలనీలో అధికారులు పర్యటిం చారు. ముఖ్యంగా కాలనిలో సాయి సంజీవిని హాస్పిటల్ దగ్గర డ్రయినేజీ పొంగి పొర్లుతుండడంతో బాగా ఇబ్బంది పడుతున్నామనికాలనీ వాసులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్య పరిస్కారం కోసం కొత్త లైన్ కావాలని మంత్రి సబితా ఇంద్రా రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి స్థానిక అధికారులతో మాట్లాడి అతి తొందరలో సమస్యను పరిష్కరించవలసిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ మాజీ యూత్ వింగ్ అధ్యక్షులు లోకసాని కొండల్ రెడ్డి , నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గౌని శ్రీనివాస్ గౌడ్, జీహెచ్ఎంసీ అధికారులు ఏఈ ప్రశాంతి, శివ, శంకర్, పోలీస్ డిపార్ట్మెంట్ నుంచి వెంకన్న, కాలనీ అధ్యక్షులు రాయుడు , ప్రధాన కార్యదర్శి లక్ష్మా రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గోవర్ధన్ రెడ్డి, ట్రెజరర్ మోహన చారి , జోషి ,నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

అరోరా డీమ్డ్ యూనివర్సిటీలో ఓరియంటేషన్ ప్రోగ్రామ్



నవతెలంగాణ-బోడుప్పల్

పర్వతాపూర్ అరోరా డీమ్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో నూతనంగా ప్రవేశాల పొందిన పీహెచ్‌డీ అభ్యర్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోరా విద్య సంస్థల సెక్రటరీ డాక్టర్ రమేష్ నిమ్మటూరి మాట్లా డుతూ.. పరిశోధనల ద్వారానే విద్యావ్యవస్థ బలపడుతుందని, అందువల్ల అరోరా యూనివర్సిటీలో ముందుగా పరిశోధన విద్యార్థులకు ప్రవేశం కల్పించామని చెప్పారు. భారతదేశంలో మొట్టమొదటిసారిగా టర్మ్ విధానాన్ని ప్రవేశపెట్టినట్టు వివరించారు. ఈ విధానం ద్వారా విద్యాసంవత్సరాన్ని నాలుగు భాగాలుగా విభజించి ఎప్పటికప్పుడూ విద్యార్థులు జ్ఞానాన్ని పరీక్షించడం ద్వారా సంవత్సరాంత పరీక్ష విధానాన్ని మార్చామని చెప్పారు. దీనివల్ల విద్యార్థులకు ఎంతో సులువుగా డిగ్రీ పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ నూతన విద్యా విధానం ద్వారా అభ్యర్థులకు పరిశోధనలో మాత్రమే కాక వివిధ రకాలైన సర్టిఫికేషన్ కోర్సుల్లో కూడా శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. అరోరా యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశాలు పొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అరోరా గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ప్రిన్సిపాల్స్, ప్రొఫెసర్ శ్రీకాంత్ జట్ల, డాక్టర్ మాధవి, డాక్టర్ శ్రీలత చేపూరి, ప్రొఫెసర్ చంద్రశేఖర్, డాక్టర్ మహేష్ ప్రభు, డాక్టర్ విశ్వనాథం బులుసు, డాక్టర్ రాకేశ్ సింగ్, ఇంగ్లీష్ ప్రొఫెసర్ డాక్టర్ పూనమ్ మినోచ పాల్గొన్నారు

విద్యార్థుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం

- నాగార్జున విద్యాసంస్థల వైస్ చైర్మెన్ గుమ్మకొండ రజనీ విట్టల్ రెడ్డి



నవతెలంగాణ - హస్తినాపురం

విద్యార్థులకు పాఠశాలల పట్ల మక్కువ పెంచే విధంగా నాగార్జున విద్యాసంస్థలు ఎన్నో రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నాగార్జున విద్యాసంస్థల వైస్ చైర్మెన్ గుమ్మకొండ రజనీ విట్టల్ రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ సాగర్ రోడ్డు సమీపంలోని సెంట్రల్ కాలనీలోని నాగార్జున మోడల్ స్కూల్‌లో బుధవారం మాంటిస్సోరి కాన్వొకేషన్ డే వేడుకల్లో వారు పాల్గొని ప్రసంగించారు. చిన్నారులు ఆకర్షణీయమైన దుస్తులలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయని విశాలమైన ఇండోర్, అవుట్ డోర్ ప్లేగ్రౌండ్‌లతో పాటు స్విమ్మింగ్ పూల్‌ను ఏర్పాటు చేసి చిన్నారుల మానసిక, శారీరక వికాసానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పిల్లల్లో గ్రహణశక్తిని పెంపొందించేందుకు ఆడియో విజువల్ క్లాసరూమ్‌లను ఏర్పాటు చేసి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని రజనీ విట్టల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ.పద్మావతి, మాంటిస్సోరి ఇన్‌చార్జి ఉషశ్రీ, ఉపాధ్యాయ బందం పాల్గొన్నారు.

ప్రజలకు సమస్య తలెత్తకుండా చూడాలి

- కార్పొరేటర్ శ్వేతా మధుకర్ రెడ్డి



నవతెలంగాణ-సంతోష్ నగర్

రంజాన్ మాసంలో ప్రజలకు సమస్య తలెత్తకుండా చూడాలని ఐ.ఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ శ్వేతా మధుకర్ రెడ్డి అన్నారు. బుధవారం సైదాబాద్ మండలం సింగరేణి కాలనీ పరిధిలోని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ పబ్లిక్ కాంటాక్ట్ సమావేశంలో డివిజన్ కార్పొరేటర్ శ్వేతా మధుకర్ రెడ్డి, అని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. స్థానికంగా సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక ప్రజలు పలు సమస్యలపై వివరించారు. నిత్యం డ్రైనేజీ మురుగు, దుర్గంధం వెదజల్లుతోందని, కాలనీలో చెత్త చెదారం పేరుకుపోతుందని చెప్పారు. బొంబాయి క్వార్టర్స్ బ్లాక్‌లో నీటి నిల్వ, డ్రైనేజీల్లో నీరు నిలిచిపోవడం ప్రధాన సమస్యగా ఉందని కార్పొరేటర్ శ్వేతా మధుకర్ రెడ్డి అధికారులకు వివరించారు. బస్తీ దవాఖాన భవనాన్ని మంజూరు చేయాలని ఇంజినీరింగ్ విభాగం ఏఈ అన్సారీ జీని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నరసింహ, రథమ్మ డిపిఓ, అన్సారీ ఎఇ ఇంజినీరింగ్, శివాజీ ఎస్ఎల్ లా అండ్ ఆర్డర్, బీజేపీ భాగ్యనగర్ జిల్లా వీపీ మధుకర్ రెడ్డి, మహమూద్, దశరథ్, దాస్, గోవింద్, బాలు, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

అల్తాఫ్‌నగర్‌లో నాలా పనులు వెంటనే చేపట్టాలి

- బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్

లింగొజిగూడ డివిజన్ అల్తాఫ్ నగర్‌లో అస్తవ్యాస్తంగా వున్న డ్రయినేజీ వ్యవస్థను బూత్ స్వశక్తీకరణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వర్ష కాలంలో ఇండ్లలోకి నీళ్లు వచ్చే పరిస్థితి ఉండేదని, ఇప్పటికీ ఈ పరిస్థితి మారలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి లింగోజిగూడ డివిజన్‌ను గొప్పగా అభివృద్ధి చేస్తానని చెప్పారు కానీ అభివద్ధి జరగలేదన్నారు. అల్తాఫ్ నగర్ డ్రయినేజీని పరిశీలిస్తే పరిస్థితి దారుణంగా ఉందన్నారు. నిధులు వధా చేస్తూ నాలా అభివృద్ధి పనులు మధ్యలోనే వదిలిపెట్టి ప్రజలను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఇబ్బందులకు గురిచేస్తు న్నారని మండిపడ్డారు. లింగోజిగూడ డివిజన్‌లో అల్తాఫ్ నగర్ ,సౌభాగ్య నగర్ కాలనీ, భాగ్యనగర్ కాలనీ, సాయి నగర్ కాలనీలలో మధ్యలోనే ఆగిపోయిన బాక్స్ లైన్ పనులను వారు పరిశీలించారు.రానున్న వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్లోబల్ హాస్పిటల్ నుండి అల్తాఫ్ నగర్ వరకు 2 మీటర్లు లేదా 3 మీటర్ల దయాతో 600 మీటర్ల బాక్స్ టైపు నాలా వేసి లెవెల్స్ కలవకపోవడంతో మిగిలిన 60 మీటర్ల డ్రయినేజీని మధ్యలోనే నిలిపి వేశారన్నారు 20 సంవత్సరాల పూర్వం ఇక్కడ డ్రయినేజీ నిర్మించారని.. 6 అడుగుల లోతు ఉన్న డ్రయినేజీలో ఐదు న్నర అడుగులు చెత్తతో నిండి పోయిందని పేర్కొన్నారు. షిల్ట్ తీయించలేని ఎమ్మెల్యే డ్రయినేజీ నిర్మాణం ఏ విధం గా చేపడతారు అని ప్రశ్నించారు. అల్తాఫ్ నగర్‌లో డ్రయి నేజీ నిర్మాణం కోసం కేటాయించిన నిధుల తో వెంటనే పనులు ప్రారంభించాలని సామ రంగా రెడ్డి డిమాండ్ చేశా రు. కాలనీ వాసులు కృష్ణా రెడ్డి , కిరణ్ యాదవ్, ఈశ్వర్ యాదవ్, భారత్ , నరసింహ , వైభవ్ డివిజన్ అధ్యక్షులు విజయ్ భాస్కర్, కృష్ణం రాజు, రాకేష్, గట్టు రవి, కృష్ణ గౌడ్, నాగరాజు, ప్రశాంతి, గణేష్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం

నవతెలంగాణ-బడంగ్‌పేట్

జల్‌పల్లి మున్సిపాల్టీ పరిధిలో ఉన్న పహడి షరీఫ్‌లోని ఈద్గా అభివృద్ధి కోసంమంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక శ్రద్ధతో డీఎంఎఫ్‌టీ నుంచి రూ.15 లక్షల నిధులు మంజూరు చేయించుట జరిగిందని మహేశ్వరం నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖైసర్ బాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో ముస్లిం,మైనార్టీల అభివద్ధి సంక్షేమ కోసం ఎంతో కషి చేస్తున్నారని తెలిపారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి జల్‌పల్లి మున్సిపల్ అభివద్ధికి ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కషి చేస్తున్నారని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేయటం పట్ల మంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

కాంగ్రెస్ పార్టీకి షాక్

- బీఆర్ఎస్ పార్టీలో చేరిన కార్పొరేటర్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్ బాలు నాయక్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల వల్లే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి అధికార పార్టీలో చేరినట్టు ఆయన చెప్పారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ కార్పొరేటర్ బాలు నాయక్ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసినట్టు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ మాజీ సర్పంచ్ బొర్రా జగన్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్జున్, మహేశ్వరం నియోజకవర్గం ఉపాధ్యక్షులు నిమ్మల నరేందర్ గౌడ్, కోఆప్షన్ సభ్యులు ఎస్కే ఖలీల్ పాషా, గుండోజి రఘునందన్ చారి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, బాలాపూర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్ రెడ్డి, బొర్రా మాధవరెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం మీడియా ఇన్‌చార్జ్ సాంబశివ, బాలాజీ నగర్ కాలనీ వాసులు రమేష్ పాల్గొన్నారు.

రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు బట్టల పంపిణీ



నవతెలంగాణ-ఘట్కేసర్

కొర్రెముల గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఓరుగంటి వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ముస్లిం సోదరీలకు రంజాన్ తోఫా చీరలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ముస్లింలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కవిత యాదవ్, ఉప సర్పంచ్ కందుల రాజ, ఎంపీటీసీ బొడ్డు వినోద, వార్డు సభ్యులు దయ్యాల ఆంజనేయులు, ఎరుకుల దుర్గ రాజు, గుమ్మడివిల్లి భాస్కర్, పర్నాటి బాబు, జువ్వ స్వామి, మాటూరి. సుస్మా గ్రామ నాయకులు కోళ్ల యాదగిరి, కట్ట నాగేష్, బొడ్డు నాగార్జున, ఉడుగుల. సత్యనారాయణ ,గ్రామ ప్రజా ప్రతినిధులు గ్రామ పంచాయతీ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి

- మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్



నవతెలంగాణ - సంతోష్‌నగర్

అన్ని రంగాల్లోనూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో అభివృద్ధి జరుగుతోందని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల బలాల అన్నారు. బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని చెప్పారు. స్థానిక సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులదేనని సూచించారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదరించి.. సంక్షేమ పథకాలు అందిస్తోందని, వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు.

బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యవర్గ సభ్యునిగా వాసు చౌదరి



నవతెలంగాణ -వనస్థలిపురం

బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యవర్గ సభ్యునిగా వనస్థలిపురం డివిజన్ నివాసి గణమనేను వాసు చౌదరి నియమితులయ్యారు. బుధవారం అర్బన్ జిల్లా అధ్యక్షులు సామా రంగారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ నియమంగానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు రంగారెడ్డికి, నియోజకవర్గ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్‌కి, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డికి, డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్‌కి వాసు ధన్యవాదాలు తెలిపారు.

శాంసంగ్ నియో క్యూ ఎల్ఈడీ టీవీ అడ్వాన్స్ బుకింగ్

నవతెలంగాణ-హైదరాబాద్

శాంసంగ్ ప్రీమియమ్ నియో క్యూ ఎల్ఎస్ఈడీ టీవీల 2023 లైన్-అప్, ఈ ఏడాది జనవరిలో సీఈఎస్ వద్ద ప్రారంభించబడింది. భారతదేశానికి రావడానికి అంతా సిద్ధంగా ఉంది. ఈ నెల 20 నుండి మే 03వరకు, వినియోగదారులు వారి నియో క్యూ ఎల్ఈడీ టీవీలను బుక్ చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని వినియోగదారులు అన్ని ఎలక్ట్రానిక్స్ దుకాణాల్లో, ఆన్ లైన్లోని శాంసంగ్. కమ్, అమెజాన్, ఫ్లిప్కార్ట్ తీసుకోవచ్చు. అంతే కాకుండా లాంచ్ ఆఫర్లను పొందేందుకు కూడా అర్హులవుతారు. వినియోగదారులు 50-ఇంచ్, 55-ఇంచ్ నియో క్యూఎల్ఈడీ టీవీల కోసం త్వరిత ఆర్డర్ ప్లేస్ చేస్తే రూ.5,000, రూ.10,000 తగ్గింపుని వారి చివరి కొనుగోలుపైన పొందవచ్చు. అదేవిధంగా, 8కే టీవీలతో సహా 65-అంగుళాల నియో క్యూ ఎల్ ఈడీ టీవీలను రూ.5,000కి బుక్ చేసుకోవచ్చు. టీవీ చివరి కొనుగోలుపై వినియోగదారులు రూ.15,000 తగ్గింపును పొందుతారని ఆ సంస్థ తెలిపింది.



బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేస్ 2లో శ్రీ రాజరాజేశ్వరి శక్తిపీఠం నవీన్ శర్మ అయ్య ఆధ్వర్యంలో మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించిన ఉజ్జయిని మహా కాలేశ్వరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం కార్యక్రమంలో కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొని మహాశివునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి పాలాభిషేకం చేశారు. సభ్యులు నరసింహారెడ్డి, రవీందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శివారెడ్డి, శర్మ రవి , దామోదర్ రెడ్డి, చండి సేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-వనస్థలిపురం

అవినీతి అక్రమాలను అడ్డుకున్నందుకే ఆరోపణలు



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్న చేస్తున్న అవినీతి, అక్రమ వసూళ్లను తామంతా అడ్డుకుంటున్నందుకే తమపై నిరాధారమైన ఆరోపణలు చేస్తు అసత్య ప్రచారాలు చేస్తున్నారని బీఆర్ఎస్ పెద్దఅంబర్‌పేట మున్సిపల్ అధ్యక్షుడు, కౌన్సిలర్ సిద్దంకి కృష్ణారెడ్డి, వడ్డేపల్లి విద్యావతి, పాశం అర్చన, రోహిణి రెడ్డి, చెవుల హరిశంకర్, పరుశరాం, కోటేశ్వరరావు ఆరోపించారు. బుధవారం పెద్ద అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారాన్ని అడ్డం పెట్టుకుని కొంతమంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నారంటూ చైర్‌పర్సన్ చెవుల స్వప్న చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ భూములను కబ్జా చేయాల్సిన అవసరం తనకు లేదని, తాను 59జీఓ కింద దరఖాస్తు చేసుకున్న భూములు వారసత్వంగా సంక్రమించినవేనని తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు. పదవి ని అడ్డం పెట్టుకొని చైర్ పర్సన్ అక్రమాలకు పాల్పడుతూ మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపించారు. 4వ వార్డులో స్మశానవాటికకు కేటాయించిన స్థలాన్ని తాను ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నానని పేర్కొనడం హాస్యాస్పదమని కౌన్సిలర్ విద్యావతి ఆవేదన వ్యక్తంచేశారు. పురపాలక సంఘం పరిధిలో చైర్‌పర్సన్ స్వప్న వైస్ చైర్ పర్సన్, కమిషనర్‌లు కలిసి అక్రమాలకు పాల్పడుతున్నారని, తాజాగా జరిగిన కౌన్సిల్ మీటింగ్‌లు రద్దు అయినప్పటికీ జిల్లా కలెక్టర్‌కు తప్పుడు సమాచారం ఇచ్చి తప్పుతోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. వైస్ చైర్‌పర్సన్ కనుసన్నల్లోనే చైర్‌పర్సన్ నడుచుకుంటున్నారని ఆరోపించారు. చైర్ పర్సన్ స్వప్న పురపాలక సంఘం అభివృద్ధి కృషి చేయకుండా స్వలాభం కోసం ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నారన్నారు. చైర్‌పర్సన్, వైస్ చైర్ పర్సన్‌లపై అవిశ్వాస నోటీసులు ఇచ్చినప్పటి నుంచి తమపై కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్ ఇటుకల మహేందర్‌రెడ్డి, నాయకులు వడ్డేపల్లి విజయేందర్‌రెడ్డి, పాశం దామోదర్, పాలడుగు నాగార్జున్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.


అక్షయ తృతీయకు ఫోన్ పే క్యాష్ బ్యాక్ ఆఫర్

నవతెలంగాణ-హైదరాబాద్

అక్షయ తృతీయ పండుగ సందర్భంగా ఫోన్ పే క్యాష్ బ్యాక్ ఆఫర్ ను ప్రకటించింది. 2023 ఏప్రిల్ 22న యాప్ ద్వారా కొనుగోలు చేసిన డిజిటల్ బంగారంపై తప్పనిసరి క్యాష్ బ్యాక్ పొందవచ్చని ఫోన్ పే తెలిపింది. యాప్ ద్వారా ఉచితంగా నిల్వ చేసుకునే సౌలభ్యం, తయారీ ఖర్చులు లేకుండా కస్టమర్లు అత్యంత నాణ్యమైన 24కే బంగారాన్ని కొనుగోలు చేయవచ్చు. కొనుగోలు చేసిన బంగారాన్ని కస్టమర్ తరపున భాగస్వామి ద్వారా బ్యాంక్ గ్రేడ్ లాకర్లలో నిల్వ చేయబడుతాయి. ఏప్రిల్ 22న 1 గ్రామ్ ,అంతకన్నా ఎక్కువ పరిమాణంలో బంగారం కొనుగోలు జరిపితే, 50 నుండి 500 రూపాయల వరకు తప్పనిసరి క్యాష్ బ్యాక్ పొందడానికి అర్హులు కాగలరు. తాము నిల్వ చేసిన బంగారాన్ని ఏ సమయంలో విక్రయించినా, 48 గంటల్లో దానికి సంబంధించిన డబ్బు వారి బ్యాంక్ ఖాతాలకు జమ అవుతుందని ఫోన్ పే పేర్కొంది.

భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి

- అష్టలక్ష్మి ఆలయ చైర్మెన్ చంద్రశేఖర్ గుప్త



నవతెలంగాణ-చైతన్యపురి

ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీ అష్టలక్ష్మీ దేవాలయం 27వ బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దేవాలయ ఫౌండర్ చైర్మెన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా అన్నారు. పోస్టర్లను ఆలయ చైర్మెన్ సోమ సురేష్, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరణ చేశారు. వారు మాట్లాడుతూ.. ఏప్రిల్ 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు 7 రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలి పారు. ఈ బ్రహ్మోత్సవాలకు హైదరాబాద్ నగరం నుండే కాకుండా తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున జనం వస్తా రని తెలిపారు. మధ్యాహ్నం, సాయంత్రం భోజన సదు పాయం, మజ్జిగ ప్యాకెట్లు, తాగునీటి సదుపాయం కల్పి స్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అంజయ్య, బ్రహ్మోత్సవాల కన్వీనర్ గౌరిశెట్టి అరుణ్, ధర్మాధికారి జై శంకర్ బాలగోపాల్, ఆలయ కమిటీ సభ్యులు చిలుక ఉపేందర్ రెడ్డి, రవీందర్, దాచేపల్లి శ్రీనివాస్, శ్రీధర్, శ్రీకాంత్ ఉమాపతి పాల్గొన్నారు.

'కంటి వెలుగును సద్వినియోగించుకోవాలి'



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

కంటి వెలుగు ను సద్వినియోగించుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్ పర్సన్ వసూపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ అన్నారు. కంటి వెలుగు రెండో విడతలో భాగంగా బుధవారం పురపాలక సంఘం పరిధిలోని 13వ వార్డులో వీఎస్ఎస్ హైూమ్స్ కాలనీలో ఏర్పాటు చేశారు . ఆమె మాట్లాడుతూ 135 మందికి పైగా కంటి పరీక్షలు చేయగా 35 మందికి కంటి అద్దాలు ఇవ్వడం జరిగిందన్నారు. 10 మందికి వివిధ రకాల ఆపరేషన్లు డాక్టర్లు సూచించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ నరేందర్ రెడ్డి, కౌన్సిలర్ వసుపతి రమేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ స్వామి నాయక్ , బీఆర్ఎస్ 13వ వార్డు అధ్యక్షుడు తిరుపతి శెట్టి, కాలనీ ప్రెసిడెంట్లు నాగేశ్వరరావు ,శ్రీనివాస్ శర్మ, అజ్మీరా శ్రీనివాస్, భూక్యా శ్రీనివాస్, నితిన్, రామకృష్ణ, విట్టల్, బలరాం ,సంజయ్ పాల్గొన్నారు.

'నాగారం మున్సిపాల్టీని ఉత్తమ మున్సిపాల్టీగా తీర్చిదిద్దుతా'



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

నాగారం మున్సిపాలిటీని ఉత్తమ మున్సిపాల్టీగా తీర్చిదిదుతానని మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు.బుధవారం నాగారం పురపాలక సంఘ కార్యాలయంలో మూడు సంవత్సరాల కాలంలో నాగారం పురపాలక సంఘం పరిధిలో జరిగిన వివిధ అభివద్ధి పనుల బ్రౌచర్ ను చైర్మెన్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి సహకారంతో మున్సిపాల్టీలో అభివద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. పెరుగుతున్న కాలనీల పరంగా అవసరం ఉన్న చోట అభివద్ధి పనులు చేయడం జరుగుతుందన్నారు. కమిషనర్ వాణి రెడ్డి , వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్, మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నిప్పుల కొలిమి ..!

- వేడిగాలులు,ఉక్కపోతతో జనం విలవిల
- నిప్పుల కుంపటిగా మారుతున్న మేడ్చల్ జిల్లా
- రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటూన్న వైద్య నిపుణులు
- ఉపశమనానికి ప్రత్యామ్న్యాయల వైపు జనం



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

భానుడు తన ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. భగభగ మండతూ జనాలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాడు వేడిగాలులు , ఉక్కపోతలతో జనాలు విలవిలాడుతున్నారు.రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం అల్లాడుతున్నారు. పగటిపూట రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం తొమ్మిది దాటిం దంటే ప్రజ లు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పాడుతోంది . జిల్లా లో రోజు రోజుకు ఉష్ణోగ్రత్త డిగ్రీలు పెరిగిపోతున్నాయి. ఎండల భయానికి ఉదయం, సాయం త్రం వేళ్లలోనే ప్రజలు తమ పనులను ముగించుకుంటున్నారు.

నిప్పుల కుంపటిలా మేడ్చల్ జిల్లా

మేడ్చల్ జిల్లా నిప్పుల కుంపటిలా మారుతున్నది.రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రత్తలు ఎండ వేడిమికి,వేడి గాలులకు ప్రజలు అవస్థలు ఎదుర్కోంటున్నారు.మేడ్చల్ జిల్లా పరిధిలో సగటు ఉష్ణోగ్రత్తలు 39 డిగ్రీలుగా నమెదవుతున్నట్టు అధికారుల రికార్డులు చెబుతున్నాయి.ఈ సంవత్సరంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండలు మండుతున్నాయి. మే నెలలో ఉండాల్సిన ఎండవేడిమి ఇప్పుడే కనిపిస్తోంది.రానున్న రోజుల్లో మరింత ఉష్ణోగ్రత్తలు పెరిగే పరిస్థితి ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పనులన్ని ఉదయం 10 గంటల లోపే

మండుతున్న ఎండలకు ప్రజలు తమ పనులను ఉదయం 10 గంటల లోపే చేసుకుంటున్నారు. కార్యాలయాలకు వెళ్లేవారు మాత్రం 9 గంటలలోపే చేరుకుంటున్నారు. ఉపాధి ,వ్యవసాయ ,అడ్డాకూలీలు తమ పనులను ఉదయం పది గంటల లోపే పూర్తి చేసుకుని నీడ పట్టుకు చేరుతున్నారు. మధ్యాహ్నం వాహనాలు రాకపోకలు నిలిచిపోతుండటంతో రోడ్లన్ని నిర్మానుష్యంగా మారు తున్నాయి. చేతి గోడగు లేకుండా మహిళలు ,వృద్దులు ,యువకులు బయటకు రావడం లేదు.ద్వీచక్ర వాహనదారులు హెల్మెట్‌లు ,టోపి లు ధరించి ప్రయాణం చేస్తున్నారు.ఎండలకు భయపడి ప్రజలు ఆర్టీసి బస్సుల్లో సైతం ప్రయాణం చేయడం లేదు.సాయంత్రం 5 దాటితే కానీ ప్రజలు వారి అవసరాల పనుల నిమిత్తం బయటకు రాలేని పరిస్థితి ఏర్పాడుతోంది.

ఉపాధి పనులపై ప్రభావం

పెరుగుతున్న ఎండల ప్రభావం వ్యవసాయ ,ఉపాధి పనులపై తీవ్రంగా పడుతోంది.ఏప్రిల్ ,మే నెలలో యాసంగి పంటలు చేతికో స్తాయి. ఈ సమయంలోనే వరి కోతలు ఉపందుకుం టున్నాయి.పెరుగుతున్న ఎండలు వరి కోతలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఎండల దెబ్బకు భయపడి కూలీలు వ్యవసాయ పనులకు రావడం లేదు. దీంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గాల వైపు ఆలోచిస్తూ యంత్రాలతో పనులు కానిస్తున్నారు.మరికొందరు కూలీలు తెల్లవారు జామున 5 గంటలకే వ్యవసాయ పనులు చేస్తూ ఉదయం 10 గంటల వరకు ఇండ్లకు చేరుతున్నారు.ఉపాధి పనులపైన తీవ్ర ప్రభావమే పడుతుంది.భానుడి ప్రతాపానికి ఉపాధి కూలీలు ఉదయం వేళల్లోనే పనులకు వెళ్తున్నారు.సూర్యుడి ప్రతాపానికి అన్ని వర్గాల జనాలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రత్యామ్నాయం వైపు జనం చూపు..

సూర్యుడు మండిపోతుండటంతో ప్రజలు విలవిల్లాడు తున్నారు. దీంతో ప్రజలు ఎండవేడి నుంచి ఉపశమనం పొందేం దుకు రకరకాల ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుం టున్నారు.ఫ్రీజ్ ,కూలర్ ,ఎసీల కోనుగోళ్లు మార్కెట్‌లో పెరిగిపో తున్నాయి.అత్యవసర సమయంలో బయటకు రావాల్సి వస్తేనే బయటకు వెళ్తున్నారు.వాహనాల పై వెళ్లే వారైన నడుచుకుంటూ వెళ్లేవారైనా స్కార్ఫ్‌లు, కర్చీఫ్‌లు కట్టుకుంటూ జాగ్రత్తలు తీసుకుం టున్నారు.వేడి గాలులు ,వడగాలులు తగలకుండా మోహలకు రుమాళ్లను చుట్టుకుని రక్షణ పోందుతున్నారు .మరోపక్క ప్రజలు చల్లని పానియాలపై ఆసక్తి కనబరిస్తూన్నారు.పండ్ల రసాలు ,మజ్జీగ ,కూల్‌డ్రింక్స్ తీసుకుంటూ ఎండ వేడిమి నుంచి ఉపశమనం పోందుతున్నారు.



నియోజకవర్గాల వారీగా అభివృద్ధి నివేదికలను రూపొందించాలి

- జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతిపై ఆయా నియోజక వర్గాల వారీగా ప్రగతి నివేదికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. బుధవారం శామీర్ పేటలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యనాయక్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సీపీఓ మోహన్ రావు, జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులతో ప్రగతి నివేదికల తయారీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2014-2015 సంవ త్సరం నుంచి 2022-2023 సంవత్సరం వరకు ఆయా ఆర్థిక సంవత్సరాలలో నియోజకవర్గాల వారీగా చేపట్టిన సంక్షేమ అభివద్ధి కార్యక్రమాలపై నివేదిక రూపొందిం చాలని, అదే విధంగా అప్పట్లో జరిగిన పనులు, ప్రస్తుతం జరిగిన పనులకు సంబంధిత శాఖల అధికారులు అభివృద్ధి పనుల ఫొటోలతో కూడిన నివేదికలో మేడ్చల్ నియోజ కవర్గానికి సంబంధించి ఈ నెల 25వ తేదీలోగా పూర్తిస్థా యిలో సమర్పించాలని తెలిపారు. జిల్లాలో ఆయా సంక్షేమ శాఖలు 2014 నుంచి 2022 వరకు వారు చేపట్టిన పనులకు సంబంధించి పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండా లని, నిర్ణీత గడువులోగా అన్ని ప్రగతి నివేదికలను సీపీవో కార్యాలయంలో అందించాలని సూచించారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాలు ఉన్నాయని, అందులో మేడ్చల్ నియోజక వర్గానికి సంబంధించి ఈ నెల 25వ తేదీన, మిగితా నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిన అభివద్ధి, ప్రగతి నివేదికలను ఈనెల 30వ తేదీలోగా సమర్పించాలని అధికా రులను కలెక్టర్ ఆదేశించారు. ఈ విషయంలో అప్పట్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను, ప్రస్తుతం ఉన్న వాటికి సంబంధించి స్పష్టమైన వివరాలు, అభివద్ధి, పురోగతి సంబంధిత ఫొటోలతో కూడిన ప్రదేశాలు, ప్రాజెక్టులు పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా అభివృద్ధి కోసం అధికారులు నిబద్ధతతో పనిచేయాలని సమిష్టి కృషితో జిల్లాను అన్ని రంగాలలో ముందుండే విధం గా కృషి చేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, పోలీస్ అధికారులు, మున్సిపల్ కమి షనర్లు, ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

25న సనత్‌నగర్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట

బీఆర్ఎస్ సనత్‌నగర్ నియోజకవర్గ ఆత్మీయ సమ్మే ళనం ఈ నెల 25వ తేదీన మహబూబ్ కాలేజీలోని ఎస్‌వీ ఐటీ ఆడిటోరియంలో జరుగుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం ఆదర్శనగర్ లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ లో గల తన కార్యాయలంలో నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్ లు, మాజీ కార్పొరేటర్ లు, డివిజన్ అద్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ లలో డివిజన్ స్థాయి ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతంగా నిర్వహించడం పట్ల ఆయా డివిజన్‌లకు చెందిన నాయకులను అభినందించారు. డివిజన్‌లలోని పధాన ప్రాంతాలలో పార్టీ జెండా దిమ్మెల నిర్మాణం చేపట్టేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనానికి అన్ని డివిజన్‌ల నుండి నాయకులు హాజరు కావాలని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో అభివద్ధి పనులు వందల కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టడం జరిగిందని, ఇంకా కొన్ని పనులు మంజూరైనాయని త్వరలోనే ఆ పనులు కూడా ప్రారంభం అవుతాయని చెప్పారు. ప్రజలలో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి అవస రమైన చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ దేవాలయాల కమిటీల నియామకం కోసం దేవాదాయ శాఖ నోటిఫికేషన్‌లు జారీ చేస్తుందని, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.కార్పొరేటర్‌లు కొలన్ లక్ష్మి, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్‌లు నామన శేషుకుమారి, అత్తిలి అరుణ గౌడ్, పార్టీ డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, గుర్రం పవన్ కుమారి గౌడ్, హన్మంతరావు,వెంకటేష్ రాజు, నాయకులు అశోక్ యాదవ్, నాగులు, జయరాజ్, ఖలీల్, సురేష్ గౌడ్, ప్రవీణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యం

- 24 నుంచి మేడ్చల్ జిల్లాలో ఇంటింటికి సీపీఐ పాదయాత్ర
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాల మల్లేష్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే సీపీఐ ముందున్న లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.బాల మల్లేష్ అన్నారు. ఈ నెల 24 నుంచి మే 5 వ తేదీ వరకు మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఇంటి, ఇంటికి సీపీఐ కార్యక్రమం నిర్వహిస్తూ "బీజేపీ హటావో దేశ్ కు బచావో" నినాదంతో ప్రజా పోరు యాత్రను నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. మంగళవారం యాప్రాల్ లో తోటపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన మల్కాజిగిరి, మేడ్చల్ నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు అమ్ముడు పోయి కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడి దారులకు ఊడిగం చేస్తున్నదని విమర్శించారు. మోడీ ప్రభుత్వం సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చి,ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నదని మండిపడ్డారు. మన దేశంలో వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టి రైతాంగ ఆత్మహ త్యలకు దారితీసిందని విమర్శించారు. దేశం మతోన్మాదం పెంచి పోషిస్తూ లౌకిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోం దన్నారు. మేడ్చల్ జిల్లా కార్యదర్శి డీజీ సాయిలు గౌడ్ మాట్లాడుతూ...ఏప్రిల్ 24 నుంచి 29 వరకు మేడ్చల్ నియోజకవర్గంలోనూ ,అదే విధంగా మల్కాజిగిరి నియోజక వర్గంలో ఏప్రిల్ 30 నుంచి మే 5 వరకు ఇంటింటికి సీపీఐ పాదయాత్రలు నిర్వహిస్తు న్నామని తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలనీ కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రొయ్యల కృష్ణమూర్తి, తోటపల్లి శంకర్, జె. లక్ష్మి, మల్కాజిగిరి మండల కార్యదర్శి టి. యాదయ్య గౌడ్, అల్వాల్ మండల కార్యదర్శి కె. సహ దేవ్, కాప్రా మండల కార్యదర్శి డి. యాదగిరి, చంద్రయ్య మహిళా నాయకురాలు ప్రమీల, మాధవి, రాజేశ్వరి, స్వరూప, సంతోషి, జంగయ్య, వెంకట రమణ, యాదగిరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యువతి వివాహానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-కాప్రా



కాప్రా డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడకి చెందిన లక్ష్మి- కుమార్ గౌడ్ దంపతుల కుమార్తె పరమేశ్వరి వివాహానికి బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేసి, పెండ్లికి అయ్యే ఫంక్షన్ హాల్ ఖర్చు కూడ తామే చెల్లిస్తామని ట్రస్ట్ ప్రతినిధి బైరి నవీన్ గౌడ్ ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థులు మెరిట్ సాధిస్తే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ముడికొండ కాశీనాథ్, కిరణ్ గౌడ్, దాసు గౌడ్ ,నాగరాజ్ ,మహేష్, పప్పు , కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వరనగర్ కాలనీలో డ్రయినేజీ లైన్ ఓవర్ ఫ్లో వల్ల వాటర్ పైకి పొంగుతూ కాలనీ రోడ్లపైకి వస్తుండడంతో కాలనీవా సుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ అధికారులతో కలిసి చర్యలు చేపట్టారు. అనంతరం సహాయక చర్యల్లో భాగంగా నిల్వ ఉన్న నీటిని క్లీనింగ్ వాహనం (ఎయిర్ టెక్) సివరేజ్ సిబ్బంది సహాయంతో మ్యాన్ హెూల్ లోకి పంపేందుకు చర్యలు చేపట్టారు. కాలనీ వాసులతో పాటు స్థానిక నాయకులు వీరభద్రమ్, శ్రీనివాస్, సివరేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా

"మనువాదాన్ని తిప్పికొడదాం.. రాజ్యాంగాన్ని రక్షించుకుందాం..!'

- స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో సమతా పక్షోత్సవాల్లో భాగంగా సదస్సు



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో సమతా పక్షోత్సవాలలో భాగంగా కాప్రా గాంధీ నగర్ కమ్యూనిటీ హాల్లో "మనువాదాన్ని తిప్పికొ డదాం.. భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందాం!" అంశంపై సదస్సు జరిగింది. సమాచార హక్కు నాయకులు గగన్ కుమార్ ఆహ్వానితులను వేదిక మీదకు ఆహ్వానించారు. సదస్సుకు కాప్రా గాంధీ నగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ప్రారంభ సూచికగా స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు రుక్కయ్య ముందుగా కాప్రా గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మహేష్ స్ఫూర్తి కలిగిస్తున్న నాయకులకు ఆహ్వానం పలికారు. సదస్సులో ముఖ్య వక్తలుగా ప్రసాద్ బాబు, సీహెచ్ నాగేశ్వరావు మాట్లాడారు. అలాగే గాంధీనగర్ యువజన సంఘం కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడారు. ముం దుగా అఖిలభారత ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మనువాదం భారతీయ సమాజాన్ని అతి హీనంగా రూపొందిం చిందన్నారు. దానికి వ్యతిరేకంగా అంబేద్కర్ తన వంతు కృషి చేస్తూ గట్టిగా పోరాడారని చెప్పారు. నేటి పాలకులు రాజ్యాంగానికి తూట్లు పొడిచి మనువాదాన్ని తిరిగి పున్ర ప్రతిష్టించడానికి ప్రయత్నిస్తున్నారని దానికి వ్యతిరేకంగా గట్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రముఖ సామాజిక ఉద్యమ నాయకులు ప్రసాద్ బాబు మాట్లాడుతూ మనువాదం భారతదేశానికి పట్టిన క్యాన్సర్ వంటిదన్నారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాలరాసే ప్రయత్నంగా ప్రభుత్వ రంగాన్ని నాశనం చేస్తున్నారని తెలిపారు. సామాజిక ఉద్యమ నాయకులు కోమటి రవి , ప్రముఖ విద్యావేత్త మల్లేశ్ , గగన్ కుమార్ స్ఫూర్తిగా బాధ్యులు గొడుగు యాదగిరిరావు మాట్లాడారు. రాష్ట్ర జానపద కళాకారుల సంఘం నాయకులు భాస్కర్ అభ్యుదయ గీతాలతో అలరించారు. గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్. యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అతిథులకు శాలువాలతో సత్కరించారు. గగన్ కుమార్ వందన సమర్పణతో సమావేశం ముగిసింది. శ్రీమన్నారాయణ, వెంకట్, నాగయ్య, పి.బి చారి, లోకాభిరామ్, ఎన్నిఆర్ డి వెంకటేష్,సోమయాచారి, రాజమల్లు, ప్రభాకర్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ సుడిగాలి పర్యటన

నవతెలంగాణ కంటోన్మెంట్



ప్రజల సమస్యలకు పరిష్కారం కోసం ఓల్డ్ బోయిన్‌పల్లి 119 డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ బస్తీలలో సుడిగాలి పాదయాత్ర చేస్తు న్నారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులను కలిసి వారితో ముఖాముఖి కార్యక్ర మాన్ని నిర్వహించి సమస్యలు పరిష్కారానికి ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశిస్తున్నారు. ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు ఆదేశాల మేరకు కార్పొరేటర్ మూడో రోజు బుధవారం ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు శాంతినికేతన్ కాలనీ, యాదిరెడ్డి కాలనీ, యాదవ్ బస్తి, కుమార్ బస్తి, విటల్ కాలనీ, పీబందావన్ కాలనీలలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆ కాలనీవాసులు సీసీ రోడ్లు, డ్రయినేజీ సమస్యలు, వాటర్ సప్లై, వీధి కుక్కల బెడద, సీసీ కెమెరాలు ఏర్పాటు లాంటి సమస్యలు తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, వాసుదేవరెడ్డి, మురళి, శ్రీనివాస్, బాబు, సత్యనారాయణ యాదవ్, శ్రీధర్ యాదవ్, ఉమక్క పీట్ల రాజు ముదిరాజ్, రమేష్ రెడ్డి, మహేందర్, నరసింహ, మీనా, వీరేష్, జీహెచ్ఎంసీ అధికారులు, ఏఈ అరవింద్ కుమార్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు కర్రే జంగయ్య , మన్నే ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీలలో కార్పొరేటర్ పర్యటన

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని గ్రీన్ ల్యాండ్స్, గంగా ఎవెన్యూ ,శ్రీ సాయి కాలనీలలో బుధవారం స్థానిక కార్పొరేటర్ జితేంద్ర నాథ్ జలమండలి, విద్యుత్ అధికారులతో కలిసి పర్యటించారు. పై కాలనీలకు విద్యుత్ కార్యాలయం మార్చడం, 150 ఎంఎం డయా పైప్ లైన్ ఏర్పాటు తదితర సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఈ సుచేందర్ నాథ్ ,డీజీఎం సాంబయ్య ఏడీఈ చారి,ఏఈ నరేష్ ,రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు , బీఆర్ఎస్ నాయకులు సురేందర్ రెడ్డి ,శ్రవణ్ ,వెంకటేష్, ఇషాక్ ,మన్మదరెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ నెంబర్ వన్

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి
- చీర్యాలలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్ గా ఉందని, 2024 సంవత్సరంలో మళ్ళీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం కీసర మండలం చిర్యాల గ్రామంలోని ఎంఎల్ఎస్ కన్వెన్ష న్‌లో బీఆర్ఎస్ కీసర మండల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్ పురం సుధాకర్ రెడ్డి అధ్యక్షత జరిగిన సమావేశంలో మంత్రి మల్లారెడ్డి మాట్లాడారు.స్వరాష్ట్రం సాధించిన నాటి నుండి అన్ని రంగాల్లో పురోగతి సాధించి ఆదర్శవంతమైన రాష్ట్రం గా తెలంగాణ రూపుదిద్దుకుందని అన్నారు. కేవలం మతా న్ని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయడమే బీజేపీ పనిగా పెట్టుకుందన్నారు. తెలంగాణలో అమలు చేసే పథకాలు దేశంలో ఎక్కడా లేవని, దమ్ముంటే బీజేపి పాలితరాష్ట్రాల్లో తెలంగాణ పథకాలు అమలు చేసి చూపించాలన్నారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసిన మోడీ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో బుద్ధి చెప్పాలన్నారు. ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి ఓర్వలేక ఈడీ, ఐటీ దాడులు చేస్తూ బీఆర్ఎస్ నేతలను ఇబ్బందులు పెట్టడమే లక్ష్యంగా కేంద్రం వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా రాబోయే రోజుల్లో పార్లమెంట్ సీట్లలో పోటీచేసి గులాబీ జెండా ఎగురవేస్తామని చెప్పారు. నియోజకవర్గంలో రాబో యే రోజుల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించడం జరుగు తుందని, అందుకు కార్యకర్తలు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందించే విధంగా కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. అభివద్ధి పనులను ప్రజలకు తెలియజేయాలన్నారు. అభివృద్ధి, సంక్షే మంలో దూసుకుపోతున్న మేడ్చల్ నియోజకవర్గంలో మూ డో సారి గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఉద్యమ కారులకు.. కష్టపడిన ప్రతీ కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీ తగిన గుర్తింపునిస్తుందని పేర్కొన్నారు. జిల్లాపరిషత్ చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి , బీఆర్ఎస్ మల్కాజ్గిరి పాం ర్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి రాజశేఖరరెడ్డి, పార్టీ రాష్ట్ర యువనాయకులు భద్ర రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మెన్ బెస్త వెంక టేష్,ఎంపీపీ ఇందిరా లక్ష్మి నారాయణ, వైస్ ఎంపీపీ సతి రెడ్డి ,మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వంగటి పర్వత్ రెడ్డి, చీర్యాల సర్పంచ్ ధర్మేందర్ ,మాజీ సర్పంచ్ పులాగుర్ల లావణ్య శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి రాము, శివాలింగల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అమెజాన్ గిఫ్ట్ ఏ బుక్ కాంపైన్ ప్రారంభం

నవతెలంగాణ-హైదరాబాద్

ప్రపంచ పుస్తక దినోత్సవం (ఏప్రిల్ 23) సందర్భంగా అమెజాన్.ఇన్ తమ ఏడాది పొడవునా నిర్వహించే గిఫ్ట్ ఏ బుక్ కాంపైన్ ను ప్రకటించింది. ఈసందర్భంగా అమెజాన్ ఇండియా కాంపైన్ వివరాలు ఆ సంస్థ మీడియా డైరెక్టర్ రాజర్షి గూయిన్ వివరించారు. పాఠకుల జాతిని రూపొందించడంలో సహాయపడటానికి తాము కట్టుబడ్డామన్నారు. పఠన అభిరుచి ఊహను అభివృద్ధి చేయడంలో, కుతూహలం పెంచడానికి, కొత్త ఆలోచనలు, కారక్టర్ రూపొందించడానికి సహాయపడుతుందన్నారు. పుస్తకాలు బహుమతులుగా ఎందుకు గొప్పవో తెలియచేయడానికి ఇవి కొన్ని కారణాలని తెలిపారు. అమెజాన్ లో తాము పుస్తకాలు గురించి అభిరుచిని కలిగి ఉన్నామన్నారు. భారతదేశం మరింత చదివేలా చేసే తమ కలను నిజం చేయడానికి తాము పబ్లిషర్స్, విక్రేతలు, రచయితలతో పని చేస్తున్నామన్నారు. బహుమతి గెలుచుకున్న రచయిత సుధా మూర్తి మాట్లాడుతూ...మీరు ఒక పుస్తకం కొంటే, మీరు ఒక విధంగా విజ్ఞానం కొంటున్నారని భావించాలన్నారు. పుస్తకాలు మీకు సౌకర్యం, విజ్ఞానం, ఒక రకమైన సరళతను ఇస్తాయన్నారు. మీకు సమయం ఉన్నప్పుడల్లా మీరు చదవవచ్చన్నారు. ఇది ఒక అద్భుతమైన బహుమతి అన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్ సామల హేమ

నవతెలంగాణ-ఓయూ

సీతాఫలమండిలోని సాల బస్తీలో జరుగుతున్న సిసి రోడ్డు పనులను బుధవారం కార్పొరేటర్ సామల హేమ పరిశీలించారు. అన ంతరం ఆమె మాట్లాడుతూ.. సిసి రోడ్డు పనులను రూ.10 లక్షలతో చేపట్టినట్టు తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిం చాలని అధికారులను సూచించారు. అనంతరం నామాలగుండులో వార్డ్ ఆఫీస్ పనులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని, పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.



మే 5 నుంచి సమ్మర్ కార్నివాల్

నవతెలంగాణ-బంజారాహిల్స్

వేసవిలో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు మే 5 నుంచి జూన్ 4 వరకు పిల్లలకు సమ్మర్ కార్నివాల్, సమ్మర్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్టు సిరి నేచురల్ వ్యాలీ రిసార్ట్ ప్రతినిధులు యాదగిరి తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను బాబురావు, వెంకటరమణతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్నివాల్‌లో పిల్లలకు, తల్లిదండ్రులకు వేసవి విడిదిగా ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాలు రూపొందించామన్నారు. స్విమ్మింగ్, హార్స్ రైడింగ్ వంటి ఆటల కోసం ప్రత్యేకంగా కోచ్‌లను ఏర్పాటు చేసినట్టు, ఉదయం పది గంటలకు ప్రారంభమై సాయంత్రం 8 వరకు ఉంటుందన్నారు. ప్రముఖ గాయకులు ఈ కార్నివాల్లో పాల్గొంటున్నట్టు తెలిపారు.



విద్వేషాలు రెచ్చగొట్టమే బీజేపీ లక్ష్యం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుకో వడమే బీజేపీ లక్ష్యం అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం క్రౌన్ ఫంక్షన్ హాల్‌లో అంబర్‌పేట నియో జకవర్గం పరిధిలోని బాగ్‌అంబర్ పేట డివిజన్ బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి మాట్లాడారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రం ఏర్ప డిన తర్వాతనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నా రు. అంబర్‌పేటలో 20 ఏండ్లలో జరగని అభివృద్ధి గడిచిన నాలు గేండ్లలో జరిగిందని తెలిపారు. అన్ని కులాలు, మతాలతో ప్రజల మధ్య విబేధాలు సృష్టించి రాజకీయ పబ్బం గడుపుకుంటున్న బీజేపీ గతంలో కిషన్ రెడ్డి ఎమ్మెల్యేగా ప్రస్తుతం కేంద్రమంత్రిగా నాలుగేండ్లలో సికింద్రాబాద్, అంబర్‌పేట నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. అభివృద్ధి పై చర్చకు వచ్చే దమ్ముందా అని సవాల్ విసిరారు. సీఎం కేసీఆర్ కంటే గొప్ప హిందువు ఎవరూ లేరన్నారు. యాదగిరిగుట్ట వంటి గొప్ప ఆలయ నిర్మాణం, ఆల యాల అభివృద్ధి, గొప్పగా పండుగలు నిర్వహించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం బాగ్‌అంబర్ పేట డివిజన్‌కి చెందిన పలువురు బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యులు కిషోర్ కుమార్ గౌడ్, బాగ్ అంబర్ పేట డివిజన్ అధ్యక్షులు చంద్రమోహన్, సీని యర్ నాయకులు డాక్టర్ సులోచన, మోర శ్రీరాములు ముదిరాజ్, అరుణ్ కుమార్ రెడ్డి, రవీందర్ రావు, నవీన్ యాదవ్, భాస్కర్ గౌడ్, కనివేట నర్సింగరావు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల్లేని హాస్టల్స్ మూసేయాలనడం తగదు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-అడిక్‌మెట్

ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ విద్యార్థులు లేని చోటల్లో హాస్టల్స్‌ను మూసివేయాలనడం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తగునా అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. బుధవారం విద్యానగర్ బీసీ భవన్‌లో బీసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసి నూతన సచివాలయానికి అంబేద్కర్ పేరును పెట్టి ముఖ్యమంత్రి కేసీఆర్ దళితుల పట్ల ప్రేమను చాటు కున్నారని తెలిపారు. కానీ అంబేద్కర్ వారసుల ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లను మూసివేయాలని ఆదేశించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. విద్యార్థులు లేని చోట్ల హాస్టల్స్ మూసి వేయడం మానుకుని పేద పిల్లలను చేర్చి చదివిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని సూచి ంచారు. తొమ్మిది నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్లకు మెస్‌చార్జీలు చెల్లించకపోవడంతో హాస్టల్ విద్యార్థులు అర్థాకలతో నకనకలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మేస్ చార్జీలను విడుదల చేయాలని కోరారు. హాస్టళ్లకు కరెంటు బిల్లులు పది నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయనీ, పరీక్షల సమయంలో కరెంట్ కట్ చేస్తే విద్యార్థులు ఎలా చదువుకుంటారు, పరీక్షలు ఎలా రాస్తారు అనీ, దీని ప్రభావం విద్యార్థుల పరీక్షల ఫలితాలపై పడుతుందన్నారు. రాష్ట్రంలోని 295 బీసీ కాలేజీ హాస్టల్స్, 321 బీసీ గురుకుల పాఠశాలలకు ఒక్కదానికి కూడా సొంత భవనాలు లేవనీ, వెంటనే సొంత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి హాస్టల్‌కు పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి మ్యాగ జైన్, వార్తా పత్రికలు మంజూరు చేయడానికి ప్రతినెలా రూ.2వేలు ఇవ్వాలన్నారు. అంబేద్కర్ వారసుల హాస్టల్స్ జోలికొస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో నిరుద్యోగ జేసీ చైర్మన్ నీలా వెంకటేష్, భూపేష్ సాగర్, సుధాకర్, అనంతయ్య, రాజేందర్, గుజ్జ కృష్ణ యాదవ్, వెంకట్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గౌలిగూడ ఫైర్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం చిరాగ్ అలీ లైన్‌లో గల కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బం దికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూళ్లలో ఫైర్ సేఫ్టీ పరిక రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వి ద్యార్థులు, ప్రజలు ఎవరు కూడా నిర్లక్ష్యం చేయవద్దని సూ చించారు. అగ్నిమాపక కేంద్రం ఫోన్ నెంబర్ 101 ఉంచు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల నివారణ కరపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్‌కే సునీల్, ఫైర్ మాన్లు ఎస్.సుశీల్‌కుమార్, లీడింగ్ ఫైర్ మాన్ ఎండి షబీర్‌అలీ, ఫైర్ మాన్‌లు క్రాంతి కుమా ర్, సురేష్, నిరీక్షణ రావు, డ్రైవర్ రహీముద్దీన్, డి.సాగర్ గౌడ్, టి.అనిల్ కుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'21న పల్లె నాగేశ్వర్ రావు అభినందన సభ'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పల్లె నాగేశ్వర్ రావు అభినందన సభను ఈ నెల 21వ తేదీన నగరంలో నిర్వహిస్తున్నట్టు కార్యక్రమ సమన్వయకర్త, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు చలకాని వెంకట్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని బాగ్ లింగంపల్లిలో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పొన్నం అశోక్ గౌడ్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని, జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి, జస్టిస్ బీమపాక నగేష్, జస్టిస్ పుల్లా కార్తిక్, రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్ బిఎస్.ప్రసాద్‌తో పాటు పలు రంగాల ప్రముఖులు, న్యాయ రంగ ప్రముఖులు హాజరు కానున్నారని తెలిపారు. దేశ చరిత్రలోనే మొట్ట మొదటి సారిగా హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం చారిత్రాత్మకమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నవతెలంగాణ-అడిక్‌మెట్



భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ ఆశలను ప్రజల్లోకి తీసుకెళ్లేం దుకు దళిత రత్న అవార్డు పొందిన ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ నాయకులు ఎమ్ ఎన్ శ్రీనివాసరావు సూచించారు. మహనీయుల జయంతి సందర్భంగా అవార్డు పొందిన అవార్డు గ్రహీతలకు బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం రాంనగర్‌లోని దావత్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ అభినంద న సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్ ఎన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్ర సచివాలయానికి అంబేద్కర్ పేరు నామకరణంతోపాటు 125 ఫీట్ల నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేసిన గొప్ప దళిత అభిమాని కేసీఆర్ అని పేర్కొన్నారు. దళితుల సంక్షేమం కోసం దళిత బంధు పథకం భూమిలేని వారికి ఇతర సంక్షేమ పథకాలు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నా రు. ప్రజలందరూ రాబోయే ఎన్నికల్లో కేసీఆర్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ కో-చైర్మన్ జంగ శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు దళితులందరూ రుణపడి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జి.శంకర్, లోకేష్, రవీందర్, బాబురావు, చిన్న బాబురావు, హరినాథ్, శ్రీకాంత్, రాజు, లక్ష్మీపతి, బీఆర్ఎస్ నాయకులు బుజ్జి వెంకటేశ్వర్లు, నాగులు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

'ఆర్మూరు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నుంచి ప్రాణహాని'

నవతెలంగాణ-బంజారాహిల్స్



ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి నుంచి తనకు ప్రాణ హాని ఉందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సామ దామోదర్ రెడ్డి అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సన్నిహి తులు, సతీమణి మహేశ్వరి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రమేష్‌తో కలిసి మాట్లాడారు. 2016లో కొంపల్లిలో తనకు భారీ కమర్షియల్ కాంప్లెక్స్ కట్టిస్తానని నమ్మించి శంకర్‌పల్లిలోని పలు సర్వే నెంబర్లు గల 113 ఎకరాల తన స్థలాన్ని మోసపూరితంగా అతని పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకున్నా డని ఆరోపించారు. దీంతోపాటు మరో 65 ఎకరాల స్థలాన్ని ప్రైవేటు గూండాలతో తన ఆధీనంలోకి తీసుకున్నా రని ఆరోపించారు. తన స్థలంలోకి ప్రవేశించకుండా ప్రవేట్ వ్యక్తులతో అడ్డు తగలడమే కాక మరోమారు వస్తే లారీలతో గుద్ది చంపేస్తానని బెదిరింపులకు పాల్పడుతున్న ట్టు తెలిపారు. అదే ప్రాంతంలోని తన తండ్రి పేరు పై ఉన్న ఫంక్షన్ హాల్‌ను సైతం కబ్జా చేశారని వాపోయారు. చివరకు ఆ ప్రాంతంలోని ఆలయాన్ని సైతం వదల్లేదన్నా రు. ఈ విషయంపై స్థానిక పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. దీంతో మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఎమ్మెల్సీ కవిత, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వంటి వారి వద్దకు వెళ్లి తనకు జరిగిన అన్యాయాన్ని విన్నవించగా జీవన్ రెడ్డికి వివాదాలు లేకుండా చూసుకోవాలని హెచ్చరించినా పద్ధతి మార్చుకోలేదని వివరించారు. సీఎం కేసీఆర్ తక్షణమే స్పందించి తనకు తన కుటుంబానికి న్యాయం చేయాలని వేడుకున్నారు.

రోబోతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం

నవతెలంగాణ-హైదరాబాద్



కేర్ హాస్పిటల్ గచ్చిబౌలిలో మొదటి సారిగా రోబో సహాయంతో మోకాలి మార్పి డి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించి నట్టు ఆస్పత్రి ఆర్థోపెడిక్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ, జాయింట్ రీప్లేస్‌మెంట్ జర్సన్ డాక్టర్ రత్నాకర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ఇక మీదట కేర్ ఆస్పత్రిలో మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలకు అధునాతన సాంకే తికతతో కూడిన జాన్సన్ అండ్ జాన్సన్ వారి వెలిస్ రోబో అందుబాటులో ఉంటుం దని తెలిపారు. "వేలిస్ రోబో"తో మోకాలి మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఖచ్చితమైన కొలతలతో మోకాలి ఎముకలను చెక్కడం వల్ల అత్యంత ఖచ్చితత్వంతో అమర్చవచ్చని పేర్కొన్నారు. అనంతరం నడిచేట పుడు తక్కువ నొప్పితోపాటు సహజమైన అనుభవం కలుగుతుందన్నారు. మారిన జీవనశైలి వల్ల ఆరోగ్యం పట్ల ప్రజల్లో అవగాహన లేక చిన్న వయసులోనే మోకాలి మార్పిడి శస్త్రచికిత్స అవసరం పెరుగుతుందన్నారు. అందువల్ల ఒకసారి మోకాలి మార్పిడి తర్వాత ఎలాంటి సమస్యలూ లేకుండా కనీసం 20 సంవత్సరాలు బాధితునికి రోజువారీ కార్యక్రమాలు, వ్యాయామాలు చేసుకోగలుగుతారని పేర్కొన్నారు.

30 నుంచి సారస్వతం వేసవి శిక్షణ మ్యూజికల్ తరగతులు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

బాస్ అనుబంధ సంస్థ సారస్వతం ఆధ్వర్యంలో ఈ నెల 30 తేదీ నుంచి ఉస్మానిగంజ్‌లోని సంస్థ కార్యాల యంలో సమ్మర్ క్యాంపు మ్యూజికల్ క్లాస్ శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయని బాస్ అధ్యక్షులు కె.రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, కోశాధికారి రాకేష్ తెలి పారు. బుధవారం సారస్వతం అధ్యక్షులు అనిల్ నాయర్ భిక్షపతి అంజనలతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మ్యూజికల్ క్లాసులో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుండి 9 గంటల వరకు నిష్ణాతులైన ఉపాధ్యాయులతో కీబోర్డ్, డ్రీమ్, కాంగ్ తబలా శిక్షణ నేర్పబడుతుందన్నారు. విద్యార్థులు ఫోన్ నెం బర్ 9396601234. 9133061000 లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. వేసవి శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు బాస్ సర్టిఫికెట్లను అందజేస్తుందన్నారు

కలుషిత మంచి నీటి సరఫరా సమస్యను పరిష్కరిస్తాం



నవతెలంగాణ-అడిక్‌మెట్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్‌లో కలుషిత మంచినీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలి పారు. డివిజన్‌లోని పురుషోత్తమ అపార్ట్మెంట్ ఎదురుగా ఉన్న డెబోరా కాలనీవాసుల కలుషిత మంచినీటి సరఫరా సమస్య తీవ్రంగా ఉందని ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో కలిసి డేబో రా కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ కలుషిత మంచి నీటి సరఫరా ఎక్కడి నుంచి ఏర్పడు తుంది అన్న దాన్ని పరిశీలించి వెంటనే సమస్యను పునరా వృత్తం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకో వాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. వెంటనే కలుషిత నీటికి బదులుగా మంచి నీటి ట్యాంకర్ ద్వారా నీటి సరఫరాను ఏర్పాటు చేశారు. డివిజన్‌లో ఎక్కడా కలు షిత నీటి సరఫరా సమస్య ఏర్పడినా, వెంటనే అధి కారులు అప్రమత్తమై సమస్యను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ముత్యాలు, కృష్ణ ప్రసాద్, స్థానికులు జాంగిర్ పాష, మున్నా భాయ్, అర్షద్ పాష, ఇంతియాజ్, మహిళలు పాల్గొన్నారు.

కాలేయ ఆరోగ్యంపై అవగాహన

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



కాలేయ ఆరోగ్యంపై సమాజా నికి అవగాహన కల్పించడంలో భాగంగా ప్రపంచ కాలేయ దినో త్సవం-2023 సందర్భంగా అపోలో హాస్పిటల్స్ జూబ్లీహిల్స్ వారు 'బీ లివర్ వైజ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాలేయం పట్ల జాగ్రత్త, ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం, క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకునేలా ప్రజల్లో అవగాహన పెంచడానికి 'బీ లివర్ వైజ్' ప్రచారాన్ని ప్రారంభించారు. అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి, అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ & హెపటా లజీలో భాగమైన కన్సల్టెంట్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ & ట్రాన్స్‌ప్లాంట్ హెపటా లజిస్ట్, డాక్టర్ కె.ఎస్. సోమ శేఖర్‌రావు, కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రోఎం టరాలజిస్ట్ & హెపటాలజిస్ట్ డాక్టర్ డి.కె.రఘు, కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ & హెపటాలజిస్ట్ డాక్టర్ జి.శరత్ చంద్ర ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అపోలో హాస్పిటల్స్ సమగ్రంగా సంగ్రహ పరిచిన ప్రత్యేక బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ బుక్‌లెట్‌లో కాలేయ వ్యాధులను నివా రించడానికి హెచ్చరిక సంకేతాలు, జాగ్రత్తలు పొందుపరిచారు. ఈ సంద ర్భంగా డాక్టర్ సంగీతారెడ్డి మాట్లాడుతూ.. కాలేయ వ్యాధులు పెరుగుతు న్నాయని, దీనిని తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కాలేయ వ్యాధులను నివారించడానికి అత్యుత్తమమైన మార్గం.. క్రమం తప్ప కుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం, ప్రివెంటివ్ హెల్త్ కేర్ ద్వారా వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి, తద్వారా సమాజంలో వ్యాధి భారాన్ని తగ్గించడంలో సహాయపడుతుందన్నారు. ఆరోగ్యవంతమైన భారతదేశాన్ని సాధించడంలో ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా కాలేయ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. 1983లో డాక్టర్ ప్రతాప్ రెడ్డి చెన్నైలో మొదటి ఆస్పత్రిని ప్రారంభించినప్పుడు అపోలో ఆరోగ్య సంరక్షణలో విప్లవాత్మక మార్పు లు తెచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ 'బీ లివర్ వైజ్' అనే ప్రత్యేకమైన లివర్ స్క్రీనింగ్ ప్యాకేజీని రూ.999 ధరతో ప్రారంభించింది. హెచ్‌బిఎస్ఏజీ, హెచ్‌సివి, లివర్ ఫంక్షన్ పరీక్షలు, ఫైబ్రో స్కాన్, గ్యాస్ట్రో కన్సల్టేషన్ వంటి కీలకమైన వైద్య పరీక్షలు ఈ ప్యాకేజీలో భాగంగా ఉన్నాయి.

మంచినీరు ఎక్కువ సమయం విడుదల చేయాలి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో స్థానికుల ధర్నా

నవతెలంగాణ-జూబ్లిహిల్స్



బోరబండ డివిజన్‌లోని బాబా సైలనినగర్ బస్తీలో మంచినీటి కొరత తీవ్రంగా ఉందని, ఎక్కువ సమయం నీరు విడుదల చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మహిళలు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు టి.సాయి శేషగిరిరావు మాట్లాడుతూ.. మంచినీళ్ల వదిలే సమయం పెంచాలని, మూడు రోజులకు ఒకసారి నీరు విడుదల చేస్తూ గంట మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఎండాకాలం కాబట్టి బస్తీ ప్రజల అవసరాలుకు సరి పోవటం లేదని, ఎక్కువ సమయం నీరు విడుదల చేయా లని డిమాండ్ చేశారు. వారం రోజుల కిందట ఎస్సార్ నగర్ జీఎంకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చా మని, వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ సానుకూలంగా స్పం దించి ఆదేశాలు జారీ చేసినప్పటికీ అమలు కావడం లేద న్నారు. బస్తీల్లో మాత్రం ఎస్సీఆర్ హిల్స్ సెక్షన్ వాటర్ బోర్డ్ అధికారులు పాత విధానమే, అంటే గంటసేపు మాత్రమే మంచినీళ్ల వదులుతున్నారని తెలిపారు. అసలే రంజాన్ పండుగ సమయమని, నీటి అవసరం ఎక్కువగా ఉంటుం దని, అధికారులు వెంటనే స్పందించి నీటి విడుదల సమ యం పెంచాలని కోరారు. లేదంటే ఎస్సార్ నగర్ వాటర్ బోర్డు ఆఫీస్ వద్ద బస్తీల మహిళలతో కలిసి పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, చంద్రకళ, సునీత, సుగుణమ్మ, గుండమ్మ, సరిత, అన్నపూర్ణ, నశ్రీన్ బేగం, విక్రా బేగం, నదియా బేగం, గ్లోరీ బాయ్, బుడిగ సుమతి, సికిందర్, అబ్రహం, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

7వ గార్డెన్ ఫెస్టివల్‌లో జీహెచ్ఎంసీకి 19 అవార్డులు

నవతెలంగాణ-సిటీబ్యూరో



హైదరాబాద్‌లో నిర్వహించిన 7వ గార్డెన్ ఫెస్టివల్, మొదటి అర్బన్ ఫార్మింగ్ ఫెస్టివల్-2023లో జీహెచ్ ఎంసీకి 19 అవార్డులు వరించాయని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. బల్దియాకు 19 అవార్డులు రావడం సంతోషకరమనీ, ఈ అవార్డులు వచ్చేందుకు ప్రజలు, అధికారులు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి ఫెస్టివల్స్‌ను జీహెచ్ఎంసీ పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. వినూత్న పద్ధ తిలో నగరంలో ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అంది ంచేందుకు జీహెచ్ఎంసీ కృషి చేస్తుందని మేయర్ తెలిపారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించిన 7వ గార్డెన్ ఫెస్టివల్‌లో జీహెచ్ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీ గార్డెన్ నిర్వహణలో ఎల్బీనగర్ జోన్‌కు 14 అవార్డులు, కూకట్‌పల్లి జోన్‌కు 3 అవార్డులు, ఖైరతాబాద్ జోన్‌కి రెండు అవార్డులు లభించాయని తెలిపారు. ఈ సందర్భంగా నగర మేయర్ సంబంధిత మేనేజర్లకు మొదటి బహుమతి గోల్డెన్ గార్డెన్ అవార్డు, ద్వితీయ బహుమతి సిల్వర్ గార్డెన్ అవార్డులను అందజేశారు. గార్డెన్‌ల అభివృద్ధి ద్వారా నగరంలో సేదతీరడాని కి ఆహ్లాదంగా ఉంటుందని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూబీడీ అడిషనల్ కమిషనర్ కృష్ణ, ఖైరతాబాద్ జోన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎల్బీనగర్ జోన్ డిప్యూటీ డైరెక్టర్ రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దాసోజు శ్రవణ్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-అంబర్‌పేట

బీఆర్ఎస్ నగర ఇన్‌చార్జి దాసోజు శ్రావణ్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన కాచిగూడకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ధాత్రిక్ నాగేందర్ బాబ్జి, మన్నే శ్రీనివాస్ యాదవ్, బబ్లు సింగ్, ఆటో తదితర నాయకులు పాల్గొన్నారు.

గురుకుల నియామకాల్లో అన్యాయం



- పురుషులకు న్యాయం చేయాలని ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నా

నవతెలంగాణ-ఓయూ

గురుకుల ఉద్యోగాల్లో 90 శాతం ఉద్యోగాలు మహిళలకే కేటాయించడం వల్ల పురుష అభ్యర్థులకి తీవ్ర అన్యాయం జరుగుతుందని ఓయూ పీహెచ్‌డీ విద్యార్థి కంభంపాటి సత్యనారాయణ ప్రజాపతి అన్నారు. గురుకుల స్కూల్స్, కాలేజీల్లో నియామకాల్లో పురుషులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం నలుమూలల నుండి అభ్యర్థులు పాల్గొన్నారు. జేయల్ డీఎల్ పోస్టుల్లో 2876లో 2301 పూర్తిగా మహిళలకి కేటాయించిన కూడా 575 పోస్టుల్లో మళ్ళీ మహిళలకి అవకాశం ఉంద న్నారు. ఇందులోనే కాదు టీజీటీ పీజీటీ లైబ్రేరియన్ పోస్టుల్లో కూడా ఇదే తంతు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికల స్కూల్స్, కాలేజీల్లో మహి ళలకి మాత్రమే కేటాయించినట్టు.. బాలుర స్కూల్స్, కాలే జీల్లో పురుషులకే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గర్ల్స్ హాస్టల్స్‌లో మహిళలను, బాయ్స్ హాస్టల్‌లలో పురుషులతో భర్తీ చేస్తున్నారన్నారు. అదే తరహాలో గురుకుల టీచర్స్ నియామకాల్లో పాటించి పురుషులకు న్యాయం చేయాలని కోరారు. రెండ్రోజుల్లో తమ డిమా ండ్లను పరిగణనలోకి తీసుకుని గురుకుల బోర్డు మార్పులు చేయకుంటే పెద్దఎత్తున ఉద్యమం చేపట్టి కోర్టు ద్వారా మా హక్కులు సాధించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో భూమేష్, మల్లేష్, శంకర్, వేణు, సైదులు, నరసింహ, శివ, సుమన్, సతీష్, అఖిల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షూస్ పంపిణీ



నవతెలంగాణ-ఓయూ

వెంకట్ రెడ్డి నగర్‌లోని ఛాంపియన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పిల్లలకు ఫెవికాల్ కంపెనీ వారి స్కూల్ షూస్ పంపిణీ చేశారు. హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీష్, ఫెవికాల్ ప్రతినిధులు అజయ్ ఠాగూర్, ఫిరోజ్ పిల్లలకు షూలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు చెల్లోజు ఎలాచారి మాట్లాడుతూ.. ఫెవికాల్ కంపెనీ మాకు ఇంత మంచి అవకాశం ఇచ్చినందుకు కంపెనీకి రుణపడి ఉంటామన్నారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలు ఫెవికాల్ కంపెనీ మరిన్ని చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు గడ్డం సాయికిరణ్, మహదేవపట్ల లక్ష్మణ్ శర్మ, సుధాకర్, ఫెవికాల్ క్లబ్ సభ్యులు పడకంటి శేఖర్ చారిశేఖర్, పలాస కనకాచారి, రాఘవులు, అనంతరాజు శ్రీనివాస్ చారి, కృష్ణ, మారోజు శంకర్, సరేష్, కాసోజు చంద్రమోహన్, ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, గోపాల్, అందోజు ప్రవీణ్ పాల్గొన్నారు.

దూద్ బౌలి శాఖ సభ్యుడు సయ్యద్ ఇబ్రహీం అలీ హఠాత్ మరణం దిగ్భ్రాంతికరం : సీపీఐ(ఎం) సౌత్ జిల్లా కమిటీ

నవతెలంగాణ-ధూల్‌పేట్

పాతబస్తీ బహదూర్ పుర జోన్ దూద్ బౌలి శాఖ సభ్యుడు సయ్యద్ ఇబ్రహీం అలీ హఠాత్ మరణం దిగ్భ్రాంతికరమని సీపీఐ(ఎం) రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డిజి నరసింహారావు, సౌత్ జిల్లా కమిటీ కార్యదర్శి ఎండి అబ్బాస్ అన్నారు. ఆయన మరణ వార్త విన్న పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు రోల్. కోటయ్య, ఎం మీనా, నగర కమిటీ సభ్యులు అబ్దుల్ సత్తార్, కిషన్, యెష్ణ, సభ్యులు. అబ్దుల్ ఖాదర్ తదితరులతో కలిసి వారు ఆయన నివాసానికి చేరుకుని భౌతికాయానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సయ్యద్ ఇబ్రహీం అలీ మరణం పార్టీకి, ముఖ్యంగా పాతబస్తీలో తీరని లోటని అన్నారు. ప్రజా సమస్యలపై స్థానికంగా ఆయన చేసిన పోరాటాలు గుర్తు చేశారు. కుటుంబాన్ని పరామర్శించారు.

తిరుపతికి ఎలక్ట్రిక్ వాహనాలు, ఆర్ఓ ప్లాంట్లు విరాళం

నవతెలంగాణ-సిటీబ్యూరో



కరూర్ వైశ్యా బ్యాంక్, ఐదు ఎలక్ట్రిక్ వాహనాలు, మూడు ఆర్ఓ ప్లాంట్లని తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కి విరాళమిచ్చింది. ఈ ప్రాజెక్ట్ మొత్తం ఖరీదు రూ.70.73 లక్షలు. తన సీఎస్ఆర్ చొరవలైన పర్యావరణ భరణీయత, సురక్షిత మంచి నీరు కింద బ్యాంక్ వీటికి నిధులు సమకూర్చింది. బ్యాంక్ తాలూకు పర్యావరణ, సామాజిక, పరిపాలన (ఇఎస్జి) కింద పర్యావరణ భరణీయత, పర్యావరణ సంబంధ లక్ష్యాలని ఈ విరాళం భర్తీ చేస్తుంది. బ్యాంక్ ఛైర్పర్సన్ డా.మీనా హేమచంద్ర, ఎండీ అండ్ సీఈఓ బి.రమేష్ బాబు ఈ వాహనాలలు, ఆర్ఓ ప్లాంట్లని సదా భార్గవి, జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, టీటీడీ, డా.బి.వెంగమ్మ డైరెక్టర్, వైస్ చాన్సలర్, ఎస్విఐఎంఎస్‌లకి అందజేశారు.

కష్టపడుతున్న ప్రతి కార్యకర్తనూ పార్టీ గుర్తిస్తుంది

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద

నవతెలంగాణ-దుండిగల్



పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తనూ అధిష్టానం గుర్తిస్తుందని ఎమ్మెల్యే కేపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఏఎంఆర్ గార్డెన్స్‌లో మున్సిపాలిటీ ఛైర్మెన్ సన్న శ్రీశైలం యాదవ్ అధ్యక్షతన జరిగిన కొంపల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో బుధవారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ కోసం నిత్యం పని చేస్తున్నారని, కార్యకర్తలే పార్టీకి శ్రీరామ రక్ష అని, కష్టపడిన ప్రతి కార్యకర్తనూ పార్టీ తప్పక గుర్తిస్తుందని అన్నారు. ఎన్నికల వేళ మాయమాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టేందుకు విపక్షాలు కూడగట్టుకుని వస్తాయని, వాటికి సరైన బుద్ధి చెప్పేలా కార్యకర్తలు సమాయత్తం కావాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, నాయకులపై విపక్షాలు చేసే ఆరోపణలను వెనువెంటనే తిప్పి కొట్టేలా కార్యకర్తలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మెన్ గంగయ్య నాయక్, మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ సన్న కవిత శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు బూర్గుబావి హనుమంత రావు, పాక్స్ ఛైర్మెన్ నరేందర్ రాజు, సంపత్ మాధవ రెడ్డి, కస్తూరి బాల్ రాజ్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడులను అరికట్టాలి

నవతెలంగాణ-కూకట్‌పల్లి



న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని చర్యలు చేపట్టాలని కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి కోరారు. రాజేంద్రనగర్ కోర్టు సీనియర్ న్యాయవాది రవికాంత్‌పై దాడికి నిరసనగా, బుధవారం కూకట్‌పల్లి కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు కాంప్లెక్స్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదులపై రోజు రోజుకూ దాడులు పెరిగిపోతున్నాయని, న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మల్లేష్, జాయింట్ సెక్రటరీ హరి శంకర్ రెడ్డి, కోశాధికారి డేవిడ్ రాజు, లైబ్రరీ సెక్రటరీ హర్షవర్ధన్ రెడ్డి, స్పోర్ట్స్ సెక్రటరీ మధు సుధన్, మహిళా సెక్రటరీ శ్రీలత, ఎక్జిక్యూటివ్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రానికి కుర్చీలు బహుకరణ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం హెచ్ఎల్ కాలనీ పరిధిలో హెచ్ఎల్ నార్త్ కాలనీ జనరల్ సెక్రెటరీ చెరుకూరి సుబ్బారాయుడు "లలిత భక్తమండలి" చలివేంద్రానికి 25 కుర్చీలను స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమంలో దాతలు రావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవాబ్ భాయ్, మురళీకృష్ణ, నవీన్, మహేందర్ రెడ్డి, మధు, శ్రీకాంత్, రాజు, హెచ్ ఏ ఎల్ కాలనీవాసులు ఆంజనేయులు, వీరయ్య, సత్యనారాయణ మూర్తి, ప్రమీల, లలిత, గాయత్రీ దేవి, జయలక్ష్మి, తుమరాజమ్మ పాల్గొన్నారు.

కొండల్‌రావుకు తెలుగు జాతీయ సాహిత్య పురస్కారం

నవతెలంగాణ-మేడ్చల్



తెలుగు భాషాభివృద్ధి, సాహిత్య వికాసానికి గుండవరం కొండల్‌రావు చేస్తున్న సేవలకుగాను జాతీయ సాహిత్య పురస్కారం వరించింది. తెలుగు సాహిత్య జాతీయ వేదిక, ఏస్‌వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన పటాన్‌చెరులోని జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో జాతీయ సాహిత్య పురస్కారం అందజేయనున్నట్టుగా నిర్వాహకులు బుధవారం తెలిపారు. గుండవరం కొండల్‌రావు పంపిన కవితను సంకలనానికి ఎంపికచేయటం జరిగిందని తెలిపారు. వీరికి ఘన సత్కారంతోపాటు ఉగాది షడ్రుచుల కవన సంకలనం అందజేస్తామని తెలిపారు. ఎంపిక చేసిన 116 కవులు - వేదికపై కవితా గానం చేస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏస్‌వి ఫౌండేషన్ అధ్యక్షుడు పిఆర్ఎస్ఎస్ఎన్ మూర్తి, ప్రధాన కార్యదర్శి యం.నారాయణరావు కోరారు.

టీవీఆర్ మోడల్ హై స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అపురూప కాలనీలోని టీవీఆర్ మోడల్ హై స్కూల్ లో బుధవారం యూకేజీ విద్యార్థిని విద్యార్థులు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం మేనేజింగ్ డైరెక్టర్ టి వంశీ కష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భాషా పితామహులు హిందీ పండిత్ విశ్వనాథ్ తివారి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులు బుడిబుడి అడుగులతో సంస్కృతిక ప్రదర్శనలు చేసి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అలరించారు. చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. చిన్నారుల తల్లిదండ్రులు మాట్లాడుతూ చిన్నారుల పట్ల యజమాన్యం వహించే శ్రద్ధ టీచర్లు బోధించే విద్యా విధానం చాలా గొప్పగా ఉందని మారుతున్న తరానికి అదునూతన విద్య బోధన అందిస్తున్న యజమాన్యాన్ని కొనియాడారు. చాలామంది పేరెంట్స్ మాట్లాడుతూ పాఠశాలలోని డిస్నేస్ ప్లే మెథడ్ ఎడ్యుకేషన్ యూకేజీ విద్యార్థుల మనసుకు హత్తుకునేలా ఉన్నాయని అభినందించారు. మేనేజింగ్ డైరెక్టర్ టి వంశీకష్ణ రెడ్డి మాట్లాడుతూ... తల్లిదండ్రులుగా మాకు మీ ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటే ఇంతకు పదిరెట్లు మెరుగైన విద్యను నూతన విద్య విధానంతో మా టీచర్లు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి హాజరై సహకరించిన పేరెంట్స్ కి అందరికీ కతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా చక్కటి ప్రతిభను కనబరిచిన యూకేజీ విద్యార్థులను అభినందించారు. అందుకు సహకరించిన పాఠశాల కీర్తిని పెంచిన టీచర్స్ అందరిని అభినందించారు.

కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన శంభీపూర్ క్రిష్ణ

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మునిసిపాలిటీ మల్లంపెట్ 23వ వార్డులోని బస్తి దవాఖానలో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని, కంటి వెలుగు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మాదాస్ వెంకటేష్, నాయకులు ఎంబరి ఆంజనేయులు, శామీర్‌పేట హనుమంత్ రావు, మాజీ ఉప సర్పంచ్‌లు అమర్ నాథ్, రాఘవేందర్ గౌడ్, బీఆర్అస్ పార్టీ మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ శామీర్ పేట రంగయ్య, మాజీ వార్డు సభ్యులు విజయ్ కుమార్, బాలకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-మేడ్చల్



డీఆర్టీయూ ఆటో యూనియన్ నాయకుడు, ఆటో డ్రైవర్ యాంజల్ శంకర్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. తోటి ఆటో డ్రైవర్లు మృతుడి కుటుంబ సభ్యులకు తమవంతుగా రూ.10 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు జి.మహేష్, కె.శంకర్, కె.కృష్ణ, ఎస్.కాలేశ్వర్, పి.సాయి, జి.రమేష్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ బాలానగర్ 120వ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రసన్న కుమార్ నియమితులయ్యారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు బాలానగర్ డివిజన్ ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై పోరాడుతూ.. మరోవైపు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ప్రసన్నకుమార్ అన్నారు. టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు నందికంటి శ్రీధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గం నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నవతెలంగాణ-బాలానగర్

ప్రజల సహకారంతోనే సమస్యలు పరిష్కారం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



ప్రజల సహకారంతోనే సమస్యలు శాశ్వతంగా పరిష్కరించడం జరుగుతుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ పరిధిలో కమిటీ హాల్ వెనుక ప్రాంతంలో గతంలో మంజీరా నీటి పైపులైను ఒకే లైన్‌తో రెండు వీధులకు సరఫరా జరిగేది. దాంతో ఇబ్బందులు వస్తున్నట్టు బస్తీ వాసులతోకలిసి తంగా లక్ష్మారెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే మంచినీటి పైప్ లైన్ సామర్థ్యం పెంచాలని జలమండలి అధికారులను ఆదేశించారు. దీంతో సదరు పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేశారు. ఈ క్రమంలో బుధవారం ఎమ్మెల్యేను, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ తంగా లక్ష్మారెడ్డిని ఆయన నివాసం వద్ద శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డేగల కష్ణమూర్తి, బీసు వెంకటేశం గౌడ్, గడ్డం రమేష్, సిహెచ్.రమేష్, బాలరాజ్, వినోద్, కవిత, అనురాధ, సుశీల పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన యునైటెడ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోసిప్ సభ్యులు



నవతెలంగాణ-దుండిగల్

కుతుబుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డిని బాచుపల్లి యునైటెడ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ సభ్యులు బుధవారం కలిశారు. గ్రేవ్ యార్డ్, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోరకు స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. మేయర్ సానుకూలంగా స్పందించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ అబ్రహం, వైస్ ప్రెసిడెంట్ రవి రాజు, ట్రెజరర్ పుచ్చకాయల యెహోషువ, జాయింట్ సెక్రటరీ జేమ్స్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవరాజు, ఎన్ఎంసి బీఆర్ఎస్ బిసి సెల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కూకట్‌పల్లి డివిజన్ ప్రెసిడెంట్‌గా మేకల రమేష్

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కాంగ్రెస్ కూకట్‌పల్లి డివిజన్ ప్రెసిడెంట్‌గా మేకల రమేష్‌ను డీసీసీ ప్రెసిడెంట్ నందికంటి శ్రీధర్ ప్రకటించారు. ఈ కమిటీలో కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడిగా మేకల రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోవింద్ గౌడ్‌ను నియమించారు. ఈ సందర్భంగా మేకల రమేష్ మాట్లాడుతూ.. డివిజన్ అధ్యక్షుడిగా రెండోసారి నియమించినందుకు పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి, డీసీసీ ప్రెసిడెంట్ నందికంటి శ్రీధర్, టీపీసీసీ డిలిగేట్ గొట్టి ముక్కల వెంగల్ రావు, సత్యం శ్రీరంగంకు ధన్యవాదాలు తెలిపారు.

క్యాన్సర్ బాధితుడికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



క్యాన్సర్ బాధితునికి ఎమ్మెల్యే కేపి వివేకానంద ఆర్థిక సహాయం చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బాపునగర్ వికాస్ సెక్షన్ నివాసి ఎల్. వీరభద్రరావు గొంతు క్యాన్సర్‌తో ఇబ్బంది పడుతున్నారు. ప్రయివేట్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలకు బుధవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ రూ.25 వేలు సహాయన్ని కేఎం గౌరీష్ ద్వారా అందజేయించారు. ఎంఎన్‌జె క్యాన్సర్ ఆస్పత్రిలో వైద్యం అందించాలని సూపరింటెండెంట్‌కు సిఫారసు చేశారు.

ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డు అందుకున్న మల్లికార్జున్

నవతెలంగాణ-మేడ్చల్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జిసిఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏసీబీ అధికారి రాందాస్ చేతుల మీదుగా మేడ్చల్ జిల్లా ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డును బుధవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ చెందిన మల్లికార్జున్ ముదిరాజ్‌కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బెస్ట్ సోషల్ అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరెన్నో సామాజిక కార్యక్రమాలు చేస్తూ, పేద ప్రజలకు తనవంతు సహాయం అందిస్తూ వారికి అండగా ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు యువకులు మల్లికార్జున్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

'లా తెలుసుకోండి-మీకు మీరే లాయర్ అవ్వండి'

- న్యాయ సేవకుడు సయ్యద్ జుల్ఫికర్ అలీ
- లా అండ్ ఆర్డర్‌పై అవగాహన కార్యక్రమాలు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



ప్రతి ఒక్కరూ "లా" తెలుసుకోవాలని మీకు మీరే లాయర్‌గా అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ అడ్వకేట్ సయ్యద్ జుల్ఫికర్ అలీ అన్నారు. ఆయన బుధవారం 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ.. ఎవరి కోసం వారే బతికితే కిక్కే ముంది, ఒకసారి సమాజం కోసం తాపత్రయపడి చూడు, జీవితంలోని సంతృప్తి ఏంటో తెలుస్తుంది అన్నారు. హైకోర్టు అడ్వకేట్ సయ్యద్ జుల్ఫికర్ అలీ నిత్యం సమాజం కోసం పరితపిస్తుంటారు. తన వృత్తి సామాన్యుడి న్యాయం కోసం, ప్రవృత్తి పరుల సేవ కోసం అంటారు. ఎక్కడ అన్యాయం జరిగినా, ఎక్కడ సామాన్యుడి హక్కులకు భంగం వాటిల్లినా చివరంటూ పోరాడే గొంతుక సయ్యద్ జుల్ ఫికర్ అలీ. అన్యాయం జరిగాక, న్యాయం కోసం పోరాడటం కాదు, అసలు ఈ న్యాయ వ్యవస్థపై ప్రతి సామాన్యుడికి సంపూర్ణమైన అవగాహన ఉండాలనేది ఈ లాయర్ చెబుతారు. దీని కోసమే ప్రత్యేకంగా చట్టాలు, వాటి పనితీరు, న్యాయ వ్యవస్థ, హక్కులపై అవగాహన కల్పించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. విద్యార్థులు, యువకులు, కార్మికులు, ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన వారికి అవగాహన కల్పిస్తున్నారు.

న్యాయం కోసం అన్నీ తానై..

తన ప్రయాణం మొదలు పెట్టినప్పుడే జీవితంలోని ఎగుడుదిగుడులను ఎదుర్కొన్న అలీ.. అలాంటి పరిస్థితి ఎవరికి ఎదురైనా నేనున్నానని ముందుంటారు. కొందరికి న్యాయపరమైన సహాయం, మరికొందరికి మాట సహాయం, ఇంకొందరికి ఆర్థిక సహాయం అందిస్తున్నారు. హైదరాబాద్ వేదికగా ఎవరికి ఏ అవసరమైనా ఆసరాగా నిలుస్తున్నారు. ఈ లక్ష్యం కోసం హైకోర్టు వేదికగా తాను పోరాటం చేసిన కేసులు ఎన్నో ఉన్నాయి. స్కూల్స్, కాలేజీలు, స్లమ్స్‌లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రస్తుత శ్రమ దోపిడీ ప్రపంచంలో అందరికీ లీగల్ అవేర్నెస్ అవసరమని అలీ మనోగతం. దీని కోసం తానే ప్రజా ప్రతినిధిగా మారి మరిన్ని సేవలు అందిస్తున్నారు. నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ, ఆస్పత్రుల్లో అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేస్తున్నారు. ఆఫ్ ద పీపుల్, బై ద పీపుల్, ఫర్ ద పీపుల్ అనేది కాగితాలకే పరిమితం కాకూడదు, సామాన్యునికి ఆయుధంలా ఉండాలంటారు అలీ. తన ప్రయాణంలో అడ్వకేట్‌గా ఎంత గుర్తింపు పొందారో అదే స్థాయిలో సోషల్ యాక్టివిస్టుగా, హ్యూమనిస్టుగా ఖ్యాతి గడించారు. ప్రజలకు లా అండ్ ఆర్డర్ పైన విశేషమైన అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ, సాఫ్ట్‌వేర్, యువకుల కోసం సైబర్ క్రైమ్, సైబర్ మోసాల పైన ప్రత్యేక సేషన్లను ఏర్పాటు చేశారు. ఎవరైనా బాధితులు కేసులతో ఇబ్బంది పడుతున్న వారు హైకోర్ట్ అడ్వకేట్ జుల్ఫికర్ అలీ సెల్ నెం.8919221171కు ఉదయం తొమ్మిది గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఫోన్ చేసి సంప్రదించగలరని చెప్పారు. శ్రీనగర్ కాలనీలోని తన ఆఫీసుకు వచ్చి స్వయంగా కలవచ్చని, కోర్టులలో కేసులు ఉన్న వారి పక్షాన ఉచితంగా సర్వీసులు అందించబడతాయని తెలిపారు.

బస్తీల్లో కార్పొరేటర్ విజయారెడ్డి పర్యటన

నవతెలంగాణ-బంజారాహిల్స్



ఖైరతాబాద్ నియోజకవర్గంలో డివిజన్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి బుధవారం పంజాగుట్ట ద్వారకపురి కాలనీలో పర్యటించారు. ప్రజలతో మమేకమవుతూ బస్తీలో తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

సిరాజ్ సాయం చేయవూ..!

- జట్టు సమాచారం కోరిన వ్యక్తిపై పేసర్ ఫిర్యాదు
- చర్యలు తీసుకున్న ఏసీయూ, ఏపీ పోలీసులు

న్యూఢిల్లీ : భారత జట్టు అంతర్గత సమాచారం అందించాలంటూ ఓ వ్యక్తి నుంచి వాట్సాప్ సందేశం అందుకున్న భారత పేసర్, హైదరాబాదీ మహ్మద్ సిరాజ్.. ఆ విషయాన్ని ఎటువంటి ఆలస్యం చేయకుండా బీసీసీఐ అవినీతి నిరోధక విభాగానికి తెలియజేశాడు. 2022 ఐసీసీ టీ20 ప్రపంచకప్ అనంతరం భారత జట్టు నేరుగా న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లింది. అక్కడ కివీస్‌తో టీ20 సిరీస్ ఆడింది. ఈ సందర్భంగా నేపియర్ మ్యాచ్‌కు ముందు, భారత జట్టు అంతర్గత సమాచారం అందించి, బెట్టింగ్‌లో కోల్పోయిన డబ్బు తిరిగి సంపాదించేందుకు సహాయం చేయాలంటూ మహ్మద్ సిరాజ్‌కు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి వాట్సాప్ చేశాడు. ఆ వ్యక్తి వాట్సాప్ చాట్‌ను స్కీన్ షాట్లు తీసిన మహ్మద్ సిరాజ్ నేరుగా ఏసీయూకు పంపించాడు. ఏసీయూ అధికారులు సంబంధిత సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్ పోలీసులతో పంచుకోగా.. సంబంధిత వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు.

'భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనలో ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. టీ20 ప్రపంచకప్ అనంతరం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో మహ్మద్ సిరాజ్ దీనిపై ఫిర్యాదు చేశాడు. ఇది జరిగి ఆరు నెలలు గడుస్తోంది. ఫిక్సింగ్ సంబంధిత అంశాలపై ఏసీయూ అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తారు. అనుమానాస్పదంగా ఉండటంతో సిరాజ్ ఆ విషయాన్ని ఏసీయూ తెలిపాడు. పర్యటనల సందర్భంగా ఇటువంటి విషయాలపై ముందే తెలియజేస్తాం. బెట్టింగ్‌లో డబ్బులు కోల్పోయిన వ్యక్తి సిరాజ్‌ను జట్టు సమాచారం కోసం సంప్రదించినట్టు దర్యాప్తులో తేలింది. అతడికి బుకీలతో ఎటువంటి సంబంధాలు లేవని పోలీసులు నిర్ధారించారు' అని బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం అధికారి ఒకరు తెలిపారు. ఐపీఎల్ 2023 సందర్భంగా రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ జట్టు సమాచారం కోసం మహ్మద్ సిరాజ్‌ను ఓ వ్యక్తి సంప్రదించినట్టు కొన్ని మీడియా సంస్థలు వార్తలు ప్రచురించగా.. వాటిని ఏసీయూ అధికారి కొట్టిపారేశారు.



ప్రతి గ్రామానికో స్పోర్ట్స్ కిట్

- వార్షిక క్రీడా క్యాలెండర్ రూపకల్పన
- జిలా క్రీడాధికారులతో సమీక్షలో క్రీడామంత్రి



నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామానికి ఓ స్పోర్ట్స్ కిట్‌ను అందించేందుకు క్రీడామంత్రిత్వ శాఖ, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) సిద్ధమవుతున్నాయి. ప్రతి గ్రామంలో ఇప్పటికే క్రీడా ప్రాంగణాల ఏర్పాటు కావటంతో స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ ప్రణాళికలు రచిస్తున్నారు. హైదరాబాద్‌లోని టూరిజం భవన్‌లో బుధవారం జరిగిన జిల్లా క్రీడాధికారుల సమీక్షా సమావేశంలో క్రీడా మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్, ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాలు ఈ మేరకు ప్రకటించారు. రానున్న 15-20 రోజుల్లో ముఖ్యమంత్రి కెసిఆర్ హైదరాబాద్‌లో ఒలింపిక్ అథ్లెట్లకు స్పోర్ట్స్ కిట్లను అందజేసి బృహత్తర కార్యక్రమం ప్రారంభించనుండగా.. అదేరోజు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తారని మంత్రి వెల్లడించారు. తెలంగాణను క్రీడా రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు వార్షిక స్పోర్ట్స్ క్యాలెండర్ రూపకల్పన చేయాలని, క్షేత్రస్థాయి నుంచే సీఎం కప్ పోటీల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో యువజన, క్రీడాకాధికారులుగా సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లను మాత్రమే నియమించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ సహా జిల్లా కేంద్రాల్లోని స్టేడియాలను సమ్మర్ క్యాంప్‌ల కోసం సిద్ధం చేయాలని సూచించారు. ఇక శాట్స్ ఆధ్వర్యంలో సొంతంగా యూట్యూబ్ చానల్, మ్యాగజిన్, వెబ్‌సైట్ ఏర్పాటుకు సైతం తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

సింధు సారథ్యంలో..!

సుధీర్మన్ కప్‌కు భారత జట్టు ఎంపిక

న్యూఢిల్లీ : పతకమే లక్ష్యంగా సుధీర్మన్ కప్‌కు భారత జట్టును ఎంపిక చేశారు. భారత పురుషుల జట్టు గతసారి థామస్ కప్ విజయంతో చరిత్ర సృష్టించగా.. ఈ సారి మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్స్ విభాగంలో మెడల్ సాధించాలని భారత్ ఉవ్విళ్లూరుతోంది. ఇటీవల భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) రూపొందించిన నూతన నియామవళి సహా అంతర్జాతీయ, దేశవాళీ టోర్నీల ఫలితాలను విశ్లేషించి పతకం తీసుకురాగల సత్తా ఉన్న జట్టును సెలక్టర్లు ఎంపిక చేశారు. రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత పి.వి సింధు, వరల్డ్ నం.9 హెచ్.ఎస్ ప్రణయ్‌లు ఈ సారి భారత జట్టును ముందుండి నడిపించనున్నారు. యువ సంచలనం లక్ష్యసేన్ రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపిక కావటం గమనార్హం. మే 14-21 వరకు చైనా వేదికగా సుధీర్మన్ కప్ పోటీలు జరుగనున్నాయి.

భారత జట్టు : హెచ్.ఎస్ ప్రణయ్, కిదాంబి శ్రీకాంత్ (మెన్స్ సింగిల్స్). పి.వి సింధు, అనుపమ ఉపాధ్యాయ (ఉమెన్స్ సింగిల్స్). సాత్విక్‌సాయిరాజ్ రాంకీరెడ్డి-చిరాగ్ శెట్టి, ఎంఆర్ అర్జున్-ధ్రువ్ కపిల (మెన్స్ డబుల్స్). గాయత్రి గోపీచంద్- ట్రెసా జాలీ, అశ్విని పొన్నప్ప-టానిశ క్రాస్టో (ఉమెన్స్ డబుల్స్), టానిశ క్రాస్టో/సాయిప్రతీక్ (మిక్స్‌డ్ డబుల్స్).



టిమ్ కుక్‌తో షట్లర్ల ముచ్చట : యాపిల్ సీఈవో టిమ్ కుక్‌తో భారత షట్లర్లు యాపిల్ స్మార్ట్‌వాచ్ గురించి ముచ్చటించారు. స్మార్ట్‌వాచ్ షట్లర్లకు ఏ విధంగా ఉపయోగపడుతుందో కుక్‌కు వివరించారు. సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్‌తో కలిసి రాకెట్ పట్టిన టిమ్ కుక్ స్మాష్‌లు సైతం సంధించాడు. పుల్లెల గోపీచంద్, పారుపల్లి కశ్యప్, చిరాగ్ శెట్టిలతో సైతం టిమ్ కుక్ మాటామంతీ కలిపాడు.

లక్నోదే అగ్రస్థానం

- రాజస్థాన్‌పై రాహుల్‌సేన గెలుపు
- స్వల్ప ఛేదనలో రాయల్స్ చతికిల

బట్లర్, యశస్వి పోరాటం వృథా

స్వల్ప స్కోర్ల థ్రిల్లర్‌లో లక్నో సూపర్‌జెయింట్స్ ఘన విజయం సాధించింది. పేసర్ అవేశ్ ఖాన్ (3/25) రాణించటంతో 154 పరుగుల స్కోరును కాపాడుకుంది. సీజన్లో ఐదో విజయం నమోదు చేసి పాయింట్ల పట్టికలో అగ్రస్థానం సొంతం చేసుకుంది. జోశ్ బట్లర్ (40), యశస్వి జైస్వాల్ (44) రాణించినా.. ఛేదనలో రాజస్థాన్ రాయల్స్‌కు పరాజయం తప్పలేదు.



నవతెలంగాణ-జైపూర్

లక్నో సూపర్‌జెయింట్స్ సూపర్ విక్టరీ సాధించింది. అగ్రజట్టు రాజస్థాన్ రాయల్స్‌పై 154 పరుగులను స్కోరు కాపాడుకుంది. పేసర్ అవేశ్ ఖాన్ (3/25) నిప్పులు చెరగగా..నవీన్ ఉల్ హక్, మార్కస్ స్టోయినిస్ (2/28) రాణించారు. 155 పరుగుల ఛేదనలో రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లకు 144 పరుగులే చేసింది. 10 పరుగుల తేడాతో లక్నో సూపర్‌జెయింట్స్ ఘన విజయం సాధించింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (44, 35 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు), జోశ్ బట్లర్ (40, 41 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 87 పరుగులు జోడించటంతో రాజస్థాన్ రాయల్స్ విజయం లాంఛనమే అనిపించింది. మార్కస్ స్టోయినిస్ ఓపెనర్లను అవుట్ చేయగా.. అవేశ్ ఖాన్ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ల కథ ముగించాడు. సంజు శాంసన్ (2) రనౌట్ మ్యాచ్‌ను మలుపు తిప్పింది. దేవదత్ పడిక్కల్ (26), రియాన్ పరాగ్ (15 నాటౌట్) పోరాటం రాయల్స్‌కు విజయాన్ని అందించలేకపోయింది. ఫామ్‌లో ఉన్న బ్యాటర్ షిమ్రోన్ హెట్‌మయర్ (2) నిరాశపరిచాడు. ఓపెనర్లు మినహా ఇతర బ్యాటర్లు వైఫల్యం చెందటంతో రాజస్థాన్ రాయల్స్ పరాజయం పాలైంది. తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 154 పరుగులు చేసింది. ఓపెనర్ కైల్ మేయర్స్ (51, 42 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు) అర్ధ సెంచరీ సాధించాడు. కెప్టెన్ కెఎల్ రాహుల్ (39, 32 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), నికోలస్ పూరన్ (29, 20 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అటు లక్నో సూపర్‌జెయింట్స్, ఇటు రాజస్థాన్ రాయల్స్ తరఫున ఓపెనర్లు మంచి ఆరంభాలను అందించారు. కానీ పరుగుల వేట కష్టమైన పిచ్‌పై మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు అంచనాలను అందుకోలేదు. ఈ విషయంలో రాయల్స్‌పై లక్నో పైచేయి సాధించి మ్యాచ్‌తో పాటు అగ్రస్థానం కైవసం చేసుకుంది.

మెరిసిన మేయర్స్ : టాస్ నెగ్గిన రాజస్థాన్ రాయల్స్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. వరుస విజయాల జోరుమీదున్న లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఓపెనర్లు శుభారంభమే అందించారు. కానీ టీ20 క్రికెట్‌కు తగిన ధనాధన్ మంత్ర ఇవ్వటంలో విఫలమయ్యారు. తొలి పది ఓవర్లలో ఒక్క వికెట్ చేజార్చుకోని లక్నో సూపర్‌జెయింట్స్.. ఎదురుదాడి చేసేందుకు ఆలోచన చేసింది. ఓపెనర్లు కెఎల్ రాహుల్ (39), కైల్ మేయర్స్ (51) పోటీపడి నెమ్మదిగా ఆడారు. పవర్‌ప్లే అనంతరం 37/0తో ఉన్న లక్నో సూపర్‌జెయింట్స్.. 50 పరుగుల మార్క్‌ను 7.4 ఓవర్లలో,100 పరుగుల మార్క్‌ను 13.3 ఓవర్లలో అందుకుంది. కైల్ మేయర్స్ సహజశైలికి భిన్నంగా ఆడాడు. కొత్త బంతితో ట్రెంట్ బౌల్ట్, సందీప్ శర్మ నిప్పులు చెరిగారు. బౌండరీలకు ఎటువంటి అవకాశం ఇవ్వలేదు. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లు బాదిన మేయర్స్ 40 బంతుల్లో అర్ధ శతకం సాధించాడు. కెఎల్ రాహుల్, మేయర్స్ వరుస ఓవర్లలో డగౌట్‌కు చేరుకోగా..చివరి ఓవర్లలో మార్కస్ స్టోయినిస్ (21, 16 బంతుల్లో 2 ఫోర్లు), నికోలస్ పూరన్ (29, 20 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) లక్నోకు మెరుగైన స్కోరు అందించారు. ఆయూశ్ బదానీని బౌల్ట్ అవుట్ చేయగా.. మేయర్స్, దీపక్ హుడా (2)ను అశ్విన్ సాగనంపాడు. కృనాల్ పాండ్య (4 నాటౌట్), యుధ్‌వీర్ (1 నాటౌట్) అజేయంగా నిలిచారు. మణికట్టు స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ (0/41) ధారాళంగా పరుగులు సమర్పించుకున్నాడు.

స్కోరు వివరాలు :

లక్నో సూపర్‌జెయింట్స్ : 154/7 (కైల్ మేయర్స్ 51, కెఎల్ రాహుల్ 39, నికోలస్ పూరన్ 29, అశ్విన్ 2/23)

రాజస్థాన్ రాయల్స్ : 144/6 (యశస్వి జైస్వాల్ 44, జోశ్ బట్లర్ 40, అవేశ్ ఖాన్ 3/25, మార్కస్ స్టోయినిస్ 2/28)

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ X బెంగళూర్
వేదిక :మొహాలి,సమయం: మ:3.30

కోల్‌కత X ఢిల్లీ
వేదిక : న్యూఢిల్లీ, సమయం : రా: 7.30

స్టార్‌స్పోర్ట్స్,జియో సినిమాలో ప్రసారం

డెవిడ్ వార్నర్‌కు చోటు

డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఆస్ట్రేలియా టెస్టు జట్టు

మెల్‌బోర్న్ : పరుగుల వేటలో నిలకడ కోల్పోయిన ఆస్ట్రేలియా డ్యాషింగ్ ఓపెనర్ డెవిడ్ వార్నర్ కీలక ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో తలపడే ఆస్ట్రేలియా జట్టులో చోటు సాధించాడు. జూన్ 7 నుంచి ది ఓవల్ మైదానం వేదికగా భారత్, ఆస్ట్రేలియాలు 2023 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో పోటీపడనున్నాయి. పేసర్ పాట్ కమిన్స్ సారథ్యంలో 17 మందితో కూడిన జట్టును సెలక్టర్లు ఎంపిక చేశారు. యాషెస్ సిరీస్‌కు 17 మంది బృందం ఖరారు కాగా.. ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్‌కు మాత్రం 15 మందిని మాత్రమే ఎంపిక చేయాలి.

ఆస్ట్రేలియా టెస్టు జట్టు : ఖవాజ, వార్నర్, మాథ్యూ రెన్షా, మార్నస్ లబుషేన్, స్టీవ్ స్మిత్ (వైస్ కెప్టెన్), ట్రావిశ్ హెడ్, అలెక్స్ కేరీ, జోశ్ ఇంగ్లీశ్, మిచెల్ మార్ష్, కామెరూన్ గ్రీన్, పాట్ కమిన్స్ (కెప్టెన్), స్టార్క్, హాజిల్‌వుడ్, స్కాట్ బొలాండ్, లయాన్, టాడ్ మర్ఫీ.

ప్రయాణంలో 16 బ్యాట్లు మాయం!

ఢిల్లీ క్యాపిటల్స్‌కు అనూహ్య పరిస్థితి



న్యూఢిల్లీ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)16లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఏదీ కలిసి రావటం లేదు. ఆడిన ఐదు మ్యాచుల్లోనూ పరాజయాలు చవిచూసిన డెవిడ్ వార్నర్‌సేన..ఎయిర్‌పోర్ట్ లాజిస్టిక్స్‌లో 16 బ్యాట్లు, ప్యాడ్లు సహా ఇతర వస్తువులు పోగొట్టుకుంది. ఇటీవల ఏప్రిల్ 15న రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడింది. బెంగళూర్ నుంచి న్యూఢిల్లీకి తిరుగు పయనమైన సమయంలో కిట్ బ్యాగుల నుంచి కొన్ని వస్తువులు మాయమైనట్టు ఆటగాళ్లు గుర్తించారు. ఎయిర్‌పోర్ట్ నుంచి క్రికెట్ కిట్లు నేరుగా క్రికెటర్లు బస చేస్తున్న హోటల్‌కు చేరుకున్నాయి. అక్కడ కిట్ బ్యాగులను చెక్ చేసుకున్న క్రికెటర్లు బ్యాట్లు, ప్యాడ్లు, గ్లోవ్స్ మాయమైనట్టు గుర్తించారు. దీంతో ఈ విషయంపై విమానాశ్రయంలోని పోలీసులు, లాజిస్టికల్ డిపార్ట్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బ్యాట్లు, ప్యాడ్లు మాయమైన ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు. డెవిడ్ వార్నర్, మిచెల్ మార్ష్, ఫిల్ సాల్ట్‌లు మూడేసి బ్యాట్లు పోగొట్టుకోగా.. యశ్ ధుల్ ఐదు బ్యాట్లు కోల్పోయాడు. 'బెంగళూర్ నుంచి తిరిగొచ్చిన అనంతరం కిట్ బ్యాగ్లు చూసుకున్న ఆటగాళ్లు అవాక్కయ్యారు. ప్రతి ఒక్క క్రికెటర్ బ్యాగ్‌లో ఏదో ఒకటి తస్కరించారు. ఇటువంటి సంఘటన జరగటం ఇదే ప్రథమం. దీనిపై లాజిస్టిల్ విభాగం, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాం. విచారణ జరుగుతోందని' ఢిల్లీ క్యాపిటల్స్ అధికారి ఒకరు తెలిపారు.

నవచిత్రం

అదే.. విరూపాక్ష ప్రత్యేకత



సాయి ధరమ్ తేజ్

సాయిధరమ్ తేజ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మిస్టిక్ థ్రిల్లర్ 'విరూపాక్ష'. సంయుక్తమీనన్ కథానాయిక. కార్తీక్ దండు దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై బాపినీడు బి.సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అగ్ర దర్శకుడు సుకుమార్ ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే అందించారు. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈనెల 21న ప్రపంచవ్యాప్తంగా ఈ మూవీ రిలీజ్ అవుతుంది. ఈ సందర్భంగా బుధవారం మీడియాతో హీరో సాయిధరమ్ తేజ్ ముచ్చటించారు. ఆ విశేషాల సమాహారం మీ కోసం ప్రత్యేకం..

'80, 90వ దశకంలో ఈ కథ ఉంటుంది. వరుసగా జరిగే మిస్టరీ డెత్‌లు ఏంటి?, ఊరి మీద చేతబడి చేయించారా?, చేస్తే ఎవరు చేసి ఉంటారు? అనే దాని చుట్టూ జరిగే కథే 'విరూపాక్ష'. అయితే ఇలాంటి సినిమాలకు ప్రత్యేక ప్రేక్షక వర్గం ఉంటుంది. కానీ ఈ కథ అందరికీ బాగా కనెక్ట్ అవుతుంది. అదే ఈ సినిమా ప్రత్యేకత. ఇందులో పాటలకు ఎక్కువ స్కోప్ ఉండదు. 'షెర్లాక్ హోమ్స్' టైపులో ఉంటుంది. ప్రతీ పదిహేను నిమిషాలకు ఏదో ఒక కొత్త క్యారెక్టర్ వస్తుంది. పాటలతో బోర్ కొట్టించాలని మేం అనుకోలేదు.

యాక్సిడెంట్ తరువాత చిరంజీవి గారు ఓ కొటేషన్ పంపించారు. 'ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి.. ఎప్పుడూ వదులుకోవద్దురా ఓరిమి' అంటూ సిరివెన్నెల గారు రాసిన పాటలోని లైన్స్‌ను పంపించారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో అనుక్షణం ముందుకు సాగుతున్నాను.

ప్రమాదం జరిగిన తరువాత మళ్లీ నేను సినిమాలు చేస్తానా? లేదా? అని అంతా అనుకున్నారు. కానీ మా అమ్మ నాకు 36 ఏళ్ల వయసులో మళ్లీ మాటలు నేర్పించింది. ఎంతో సహనంతో నాకు సపోర్ట్‌గా నిలిచింది. అందుకే ఈ లైఫ్‌లో మనం ఏది చేసినా కూడా అమ్మానాన్నలు, గురువు కోసం చేయాలి.

సుకుమార్ రైటింగ్స్ అంటే ప్రేమ కథలుంటాయి. ఈ సినిమాలోనూ అండర్ లైన్‌గా లవ్‌స్టోరీ, ఎమోషన్స్ ఉంటాయి. సినిమా చూశాకా ప్రేక్షకులకే అర్థం అవుతంది. అయితే ఆ ప్రేమకథ గురించి నేను ఇప్పుడేం చెప్పలేను. ఇది టిపికల్ జోనర్ సుకుమార్ స్క్రీన్ ప్లే సినిమాకు అద్భుతంగా సెట్ అయింది.

దర్శకుడు కార్తీక్ 2019లో నాకు కథ చెప్పాడు. హరీష్ శంకర్, అనిల్ రావిపూడి, మారుతి తరువాత అంత బాగా నాకు నెరేట్ చేశాడు. అప్పుడు కథపై నాకు ఎంతో నమ్మకం కలిగింది. సినిమాను తను అద్భుతంగా తీస్తాడని అనిపించింది. సుకుమార్ ఇచ్చిన స్క్రీన్ ప్లేకి కార్తీక్ అత్యద్భుతంగా డైరెక్ట్ చేశాడు.

నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్, బాపీ ఇండస్ట్రీలోకి రాక ముందు నుంచి నాకు తెలుసు. ప్రసాద్‌గారు ఎప్పుడూ నవ్వుతూ ఉంటారు. ఆయనలో నాకు అదే ఇష్టం. 'ఆర్ఆర్ఆర్' సినిమా తరువాత ప్రపంచం అంతా కూడా మన వైపు చూస్తోంది. ఇప్పుడు మనం తెలుగు సినిమా సత్తాను వరల్డ్ వైడ్‌గా చాటుతున్నాం.



ప్రభాస్

అరుదైన గౌరవం

ప్రభాస్ నటిస్తున్న 'ఆదిపురుష్' అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. సృజనాత్మక, వినోదానికి పర్యాయపదంగా నిలిచిన ట్రిబెకా ఫిలిం ఫెస్టివల్‌లో జూన్ 13న ఈ సినిమా వరల్డ్ ప్రీమియర్ కానుంది. విజువల్ ఫీస్ట్‌గా రాబోతున్న ఈ చిత్రం త్రీడీ ఫార్మాట్‌లో 'మిడ్‌నైట్ ఆఫరింగ్'గా ఫెస్టివల్‌లో వీక్షకులను అలరించనుంది. జూన్ 16న ఇండియాతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. విడుదలకు మూడు రోజుల ముందే ఈ సినిమా వరల్డ్ ప్రీమియర్‌లో ప్రదర్శితం కావడం పట్ల చిత్ర బృందం సంతోషం వ్యక్తం చేసింది. దీని గురించి దర్శకుడు ఓం రౌత్ మాట్లాడుతూ, 'ఆదిపురుష్ సినిమా కాదు, ఇది ఒక ఎమోషన్, సెంటిమెంట్. ఇది భారతదేశ స్ఫూర్తితో ప్రతిధ్వనించే కథ. ట్రిబెకా ఫెస్టివల్‌లోని ఈ ప్రీమియర్ నిజంగా నాతో పాటు మొత్తం బృందానికి సంతోషకరమైన మూమెంట్. ఎందుకంటే మన సంస్కృతిలో బాగా పాతుకుపోయిన కథను ప్రపంచ వేదికపై ప్రదర్శించబోతున్నారు. ప్రపంచ ప్రీమియర్‌లో ప్రేక్షకుల స్పందన చూసి మేము నిజంగా థ్రిల్‌గా ఫీల్ అవుతాం' అని చెప్పారు.

ఏజెంట్ ఇచ్చిన ధైర్యమిది - అఖిల్

అఖిల్ అక్కినేని, సురేందర్ రెడ్డి కాంబినేషన్ 'ఏజెంట్'తో మునుపెన్నడూ లేని అనుభూతిని అందించడానికి ఈనెల 28న ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు.

ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్ అనిల్ సుంకర నిర్మించిన ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ కాకినాడలో గ్రాండ్‌గా జరిగింది. ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల్ కృష్ణ ట్రైలర్‌ని లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ,"ఏజెంట్' రెండేళ్ళ జర్నీ. ఈ జర్నీలో మానసికంగా చాలా మారాను. నాకు సినిమా, అభిమానులు అంటే ఎంత పిచ్చో ఇంకా అర్థమైంది. సాక్షి వైద్య ఈ సినిమాలో సర్‌ప్రైజ్ ప్యాకేజ్. హిపాప్ తమిళా ప్రాణం పెట్టి మ్యూజిక్ చేశారు. బీజీఎం చాలా వైల్డ్‌గా ఉంటుంది. అనిల్ సుంకర నా బ్యాక్ బోన్. అభిమానుల కోసం ఇంత పెద్ద సినిమా చేద్దాం.. అందరికీ పిచ్చెక్కిపోవాలని అన్నారు. అదే మాట మీద నిలబడ్డారు. ఈ సినిమా క్రెడిట్ అంతా దర్శకుడు సురేందర్ రెడ్డికే ఇస్తాను. ఈ రోజు ఇంత నమ్మకంగా మాట్లడుతున్నానంటే 'ఏజెంట్' ఇచ్చిన ధైర్యం' అని అన్నారు. 'ఈనెల 28 ప్రేక్షకులు, అభిమానులకు ఒక పండగ, ఉత్సవం. యాక్షన్ స్పై జోనర్ ఇది. ఇలాంటి సినిమాలు చాలా వచ్చాయి కానీ ఈ సినిమా చాలా ప్రత్యేకం. ఆరు దేశాల్లో డిఫరెంట్ లోకేషన్స్‌లో మంచి యాక్షన్ కొరియోగ్రాఫర్స్, స్టంట్స్‌తో చేసిన చిత్రమిది' అని నిర్మాత అనిల్ సుంకర చెప్పారు. నాయిక సాక్షి వైద్య మాట్లాడుతూ, 'ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని అనుకుంటున్నాను. వైల్డ్ రైడ్‌కి రెడీ అవ్వండి' అని తెలిపారు.



అఖిల్, సాక్షి వైద్య

ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్

'గూఢచారి, రావణాసుర' వంటి అద్భుతమైన సినిమాలను నిర్మించిన అభిషేక్ పిక్చర్స్ తాజాగా 'ప్రేమ విమానం' పేరుతో ఓ వెబ్ ఫిల్మ్‌ను నిర్మించింది. అభిషేక్ పిక్చర్స్, జీ5 సంయుక్తంగా తెరకెక్కించిన ఈ వెబ్ ఫిల్మ్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. నిర్మాత అభిషేక్ నామా బర్త్ డే సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనను అనౌన్స్ చేశారు.

ఫస్ట్ లుక్ పోస్టర్‌లో అన్ని ప్రధాన పాత్రధారులను పరిచయం చేశారు. ఇద్దరు పిల్లలు (దేవాన్ష్ నామా, అనిరుధ్ నామా), హీరో, హీరోయిన్లు (సంగీత్ శోభన్, శాన్వీ మేఘన), వెన్నెల కిషోర్, అనసూయ భరద్వాజ్ ఇలా అందరూ కూడా ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. ఎలాగైనా సరే విమానం ఎక్కాలని ప్రయత్నించే ఇద్దరు పిల్లలు, అర్జెంట్‌గా ఫ్లైట్ ఎక్కి తమ కొత్త జీవితాన్ని ప్రారంభించాలని ప్రేమ జంట ఇలా అందరినీ ఒకే చోటకు చేర్చుతుంది కథ. ఇక వీరి ప్రయాణంలో వచ్చే మలుపులు, సంతోషాలు, బాధలు, నవ్వులు ఇలా అన్నీ కూడా ప్రేక్షకులను మెప్పించేలా ఉంటాయి. ఉన్నతమైన ప్రొడక్షన్ విలువలతో తెరకెక్కిన ఈ సినిమా కచ్చితంగా ఫీల్ గుడ్ ఎంటర్టైనర్‌గా ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటుంది. ఈ వెబ్ ఫిల్మ్‌కి సంతోష్ కటా దర్శకత్వం వహించగా, అనూప్ రూబెన్స్ సంగీతాన్ని అందించారు. జగదీష్ చీకటి కెమెరామెన్‌గా పని చేశారు. ఈ చిత్రానికి సమర్పణ : దేవాన్ష్ నామా, ఎడిటర్ : అమర్ రెడ్డి.



'ప్రేమ విమానం' చిత్ర ఫస్ట్‌లుక్

చదువు విలువ తెలిపే సినిమా

మనిషి చైతన్యానికే కాదు సమాజ చైతన్యానికి, అభివృద్ధికి విద్య ఎంతగానో దోహదం చేస్తుంది. అలాంటి విద్య ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ, 'అభిలాష' సినిమాను నిర్మించామని మేకర్స్ తెలిపారు.

అమర్ దీప్ హీరోగా, అశ్విని రెడ్డి హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాకు శివప్రసాద్ చలువాది దర్శకుడు. శ్రీ హరిహర ధీర మూవీమేకర్స్ పతాకంపై సి.హెచ్. శిరీష నిర్మించిన ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ప్రసాద్ ల్యాబ్‌లో జరిగింది. ట్రైలర్‌ను ముఖ్య అతిథిగా విచ్చేసిన నటుడు పృథ్వీ విడుదల చేశారు. సీడీని చిత్ర బృందంతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

దర్శకుడు శివప్రసాద్ చలువాది మాట్లాడుతూ, "వల్గారిటీకి తావులేకుండా నవరసాల్లోని అన్ని అంశాలను మేళవించి ఈ సినిమాను తీశాం. విద్యకు ఉన్న ప్రాధాన్యాన్ని సందేశాత్మకంగా ఇందులో చూపించాం. 1983లో వచ్చిన చిరంజీవి 'అభిలాష' చిత్రానికి, ఈ సినిమాకు కథాపరంగా ఎలాంటి సంబంధం లేదు. ఆ చిత్రంలో ఉరి రద్దు చేయాలని చూపిస్తే, ఇందులో చదువు వద్దన్న విలన్‌ను ఎలా ఎదుర్కోవడం జరిగిందనే అంశాన్ని చూపించాం' అని చెప్పారు.

'పాత్రలకు సరిపోయే మంచి ఆర్టిస్టులను ఎంపిక చేసుకుని మరీ ఈ చిత్రాన్ని తీశాం. ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది' అని నిర్మాత సి.హెచ్. శిరీష అన్నారు.



అశ్విని రెడ్డి, అమర్ దీప్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangana Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

మహబూబ్‌నగర్‌లో మే 6న ఐటీ టవర్ ప్రారంభం

- హాజరుకానున్న మంత్రి కేటీఆర్ : ఘనంగా ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాలు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మహబూబ్ నగర్‌లోని దివిటీపల్లీలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఐటీ టవర్‌ను మే 6న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారని, ఐటీ టవర్ ప్రారంభానికి ఘనంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాలు జారీచేశారు. హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఐటీ టవర్ ప్రారంభోత్సవం పై టీఎస్ఐఐసీ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బెంగుళూరు హైవే నుంచి ఐటీ టవర్‌కు 100అడుగుల నూతన కనెక్టింగ్ రోడ్డుకు అనుసంధానంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా పెద్ద ముఖద్వారాన్ని నిర్మించాలని టీఎస్ఐఐసీ అధికారులను ఆదేశించారు. ఐటి టవర్ నుంచి మహబూబ్‌నగ ర్ పట్టణానికి కనెక్టింగ్ రోడ్లను నిర్మించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. టవర్ నుంచి మహబూబ్‌నగర్ పట్టణానికి అధునాతన రోడ్లను నిర్మించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ డి.రవి, డిప్యూటీ జోనల్ మేనేజర్ శ్యాంసుందర్‌రెడ్డి, ప్రముఖ కన్సల్టెంట్ రాజ్‌కుమార్, నిర్మాణ సంస్థ గుత్తేదారులు నరసింహ, రాజశేఖర్‌రెడ్డి, అమరరాజా సంస్థ ప్రతినిధులు మసూద్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో రాజ్యాంగ వ్యతిరేక పాలన : తరుణ్‌చుగ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో రాజ్యాంగ వ్యతిరేక పాలన నడుస్తున్నదని బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ అన్నారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్ సర్కార్ ఆటలాడుతున్నదని విమర్శించారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్‌లీక్ ఘటనలో ప్రభుత్వ పెద్దల ప్రమేయముందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. నవంబర్‌లో కేసీఆర్ రిటైర్మెంట్ కాబోతున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి యాత్ర ఎవరి కోసం చేస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. అబద్ధాలు చెప్పడంలో సీఎం కేసీఆర్‌ను మించినోళ్లు లేరన్నారు. టీఎస్‌పీఎస్‌సీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలనీ, కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన అభ్యర్థులకు లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. తెలంగాణ యాసలో మాట్లాడాను తప్ప తానెప్పుడూ బూతులు మాట్లడలేదనీ, భాషలో తనకు కేసీఆరే గురువని అన్నారు. ఏప్రిల్ 23న అమిత్ షా పార్లమెంట్ ప్రవాస్‌లో భాగంగా చేవెళ్లకు వస్తున్నారనీ, ఆరోజు అక్కడ బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. ఈ ప్రెస్‌మీట్ సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయండి

- 28 నుంచి సమ్మె నివారణకు చర్యలు చేపట్టాలి : సీఎం కేసీఆర్‌కు కూనంనేని లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్) ప్రొబేషన్ కాలం ఈనెల 11వ తేదీ నాటికి పూర్తయ్యిందని, వారిని రెగ్యులరైజ్ చేసి న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు బుధవారం ఆయన లేఖ రాశారు. జేపీఎస్‌లుగా 2018, ఆగస్టులో నియామకమయ్యారని తెలిపారు. గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఎంతో ముందుచూపుతో పంచాయతీ కార్యదర్శుల వ్యవస్థను ఏర్పాటు చేసి నియమించడం పట్ల సంతోషించామని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు, కాంట్రాక్టు పంచాయతీ కార్యదర్శులు మొత్తం 9,350 మంది ఉన్నారని వివరించారు. వారి నియామకం వల్ల గ్రామాల అభివృద్ధికి దోహదకారి అయ్యిందని తెలిపారు. తద్వారా గ్రామపంచాయతీలలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, హరితహారం, గ్రీన్‌పార్కుల ద్వారా పచ్చదనం, వైకుంఠధామాలు వంటి అనేక కార్యక్రమాలను చేపట్టారని పేర్కొన్నారు. దీంతో దేశంలోనే తెలంగాణ గ్రామపంచాయతీ వ్యవస్థ అనేక అవార్డులను సొంత చేసుకున్నాయని వివరించారు. దీనివెనుక ప్రభుత్వ మార్గదర్శకత్వంతోపాటు పంచాయతీ కార్యదర్శుల కృషి కూడా ఉందని తెలిపారు. ప్రొబేషన్ కాలం పూర్తయితే, రెగ్యులర్‌గా తీసుకోవడం జరుగుతున్నదని నోటిఫికేషన్‌లో వివరించారని గుర్తు చేశారు. ఆ తర్వాత ప్రొబేషన్ కాలాన్ని మరో ఏడాదికి పెంచారని పేర్కొన్నారు. అది కూడా ఈనెల 11వ తేదీన పూర్తయ్యిందని తెలిపారు.

స్థానిక భాషల్లో పరీక్షలు రాయడానికి విద్యార్థులను అనుమతించండి

- యూనివర్సిటీలకు యూజీసీ ఉత్తర్వులు

న్యూఢిల్లీ : ఇంగ్లిష్ మీడియం కోర్సుల్లో అయినా సరే విద్యార్థులు కోరుకుంటే స్థానిక భాషల్లో పరీక్షలు రాయడానికి వారిని అనుమతించాలని విశ్వవిద్యాలయాలకు యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఉత్తర్వులు జారీ చేసింది. యుజిసి ఛైర్మన్ జగదీష్ కుమార్ బుధవారం వెల్లడించారు. పాఠ్య పుస్తకాలను రూపొందించడంలోనూ, మాతృభాష/స్థానిక భాషల్లో బోధన-అభ్యాస ప్రక్రియకు మద్దతు ఇవ్వడంలో విశ్వవిద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని యూజీసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. మాతృభాష/స్థానిక భాషల్లో పాఠ్య పుస్తకాలను రూపొందించడం, ఇతర భాషల నుంచి ప్రామాణిక పుస్తకాలను అనువదించడంతో సహా బోధనల్లో వాటి వినియోగాన్ని ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు అవసరం' అని యుజిసి తన ఉత్తర్వుల్లో పేర్కొంది. కాబట్టి, మీ విశ్వ విద్యాలయంలో విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో కోర్సులు అందించినప్పటికీ, పరీక్షల్లో స్థానిక భాషల్లో సమాధానాలు రాయడానికి అనుమతించాలని, స్థానిక భాషల్లో అనువాదాన్ని ప్రోత్సహించాలని, విశ్వ విద్యాలయాల ప్రక్రియలో బోధన-అభ్యాసంలో స్థానిక భాషను ఉపయోగించాలని యూజీసీ విజ్ఞప్తి చేసింది.


అతిక్ హత్యకేసులో నిర్లక్ష్యం..

- నలుగురు పోలీసులపై వేటు

ప్రయాగ్‌రాజ్: ఉత్తరప్రదేశ్‌లో పోలీసుల సమక్షంలోనే గ్యాంగ్‌స్టర్, మాజీ ఎంపి అతిక్ అహ్మద్, అతని సోదరుడు అష్రాఫ్‌ను ముగ్గురు వ్యక్తులు కాల్చిచంపిన విషయం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటన చోటుచేసుకోకుండా నిరోధించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొంటూ నలుగురు పోలీసులపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది.షాహగంజ్ పోలీస్ సీనియర్ అధికారి అశ్వని కుమార్ సింగ్‌తోపాటు ఓ ఇన్‌స్పెక్టర్, మరో ముగ్గురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేసుకు సంబంధించి పోలీసులను ప్రశ్నించిన ప్రత్యేక దర్యాప్తు బృందం విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు గుర్తించింది. ఈ పోలీసులు షాహగంజ్ పోలీస్ స్టేషన్లోనే విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే హత్య జరిగిన మెడికల్ కాలేజీ ప్రాంతం ఈ పోలీస్ స్టేషన్ పరిధిలోకే వస్తుంది.

దళారుల చేతిలో ధరలు

మొక్క జొన్న ధరలు పతనం



- మార్కెట్‌లో రూ. 2200 నుంచి రూ.1800లకు తగ్గుదల
- వ్యాపారులు సిండికేట్‌గా మారిన వైనం
- కానరాని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

పంట ఏదైనా రైతుల చెంతకు రాగానే ధరలు పతనం కావడం పరిపాటిగా మారింది. మొన్నటి వరకు పత్తి, మిర్చిలో సిండికేట్‌గా మారిన వ్యాపారులు.. ఇప్పుడు మొక్కల కొనుగోలులో రైతులను నిండా ముంచుతున్నారు. వారం రోజుల కిందట మొక్కజొన్న క్వింటాకు రూ.2200 ధర ఉండగా ఇప్పుడు రూ.1800లకు చేరింది. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు పెరగకుండా చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మొక్కజొన్న కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడం వల్ల మార్కెట్‌లో వ్యాపారులదే ఇష్టారాజ్యం అయింది. ధరలు పెరగకుండా వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి కొనుగోళ్లను నిలిపేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో మొక్కజొన్నను కొనుగోలు చేయడం లేదనే ప్రచారం చేస్తున్నారు. దాంతో చేసేది లేక రైతులు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. గతేడాది మొక్కజొన్న క్వింటాకు రూ. 2500కు కొనుగోలు చేశారు. ఇప్పుడు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.1960 ఖరారు చేసింది. అయితే ఇంకా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాలేదు. దాంతో రూ.1800కే వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయకపోవడంతో మధ్య దళారుల చేతిలో రైతులు నష్టపోతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 2.50 లక్షల ఎకరాలకు పైగానే మొక్కజొన్న సాగు చేశారు. ఈసారి యాసంగిలో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగుపై దృష్టి సారించారు. తాడూరు మండల పరిధిలోనే సుమారు 18,000 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. తెల్కపల్లి మండలం తాళ్లపల్లి గ్రామంలో 150 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఖరీఫ్‌లో పత్తి పంట పూర్తిగా దెబ్బతినడంతో ఈసారి పంటను అధికంగా సాగు చేశారు.

కౌలు రైతుల పరిస్థితి దయనీయం

మొక్క జొన్న సాగులో కౌలు రైతులే కీలకంగా ఉన్నారు. ఒక్కో ఎకరాకు రూ.పది వేలు చెల్లించి లీజుకు తీసుకున్నారు. ఎకరా పెట్టుబడి రూ.25 వేలకు దాటింది. లీజుతో కలుపుకొని మొత్తం రూ. 35వేలు అయ్యింది. 25 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు మొక్కజొన్న దిగుబడి 25 శాతం తగ్గడంతో కౌలు రైతులు లబోదిబోమంటున్నారు. కాగా, పంట పూర్తిగా చేతికి వచ్చి కల్లాల్లో ఉన్నా నేటికీకొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పెట్టుబడి అయినా..రావడం లేదు

నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశాను. కౌలుతో కలుపుకొని సుమారు రూ.1.60లక్షలు పెట్టుబడి అయింది. గతేదాది రూ.2500 అమ్మగా, ఈసారి రూ.1800కు పడిపోయింది. పెట్టుబడి అయినా వచ్చే పరిస్థితి లేదు.

- బాలస్వామి, తాళ్లపల్లి, తెలకపల్లి మండలం, నాగర్‌కర్నూల్

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పత్తి వేసి ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులు రబీలో మొక్కజొన్న సాగు చేశారు. ఈసారి ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువగా ఉంది. గతేదాది రూ. 2500లు ఉన్నది. ఈసారి 1800లకు పడిపోయింది. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం స్పందించి మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి.

- శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి, నాగర్‌కర్నూల్

తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఫ్రెండ్లీ పోలీసింగ్, శాంతి భద్రతలే లక్ష్యం : హోం మంత్రి మహమూద్ అలీ



నవతెలంగాణ-చేవెళ్ల

తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గ పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను డీజీపీ అంజనీకుమార్, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్ సొసైటీ ఛైర్మెన్ కోలేటి దామోదర్, జెడ్పీ ఛైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీ సురభివాణీదేవి, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్రతో కలిసి హోంమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ, శాంతి భద్రతలే లక్ష్యంగా రాష్ట్ర పోలీస్ వ్యవస్థ పని చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో పోలీసులు.. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని తెలిపారు. మహిళల భద్రతే లక్ష్యంగా షీ టీం ఏర్పాటు చేయడం వల్ల క్రైమ్ రేటు పూర్తిగా పడిపోయిందన్నారు. అలవెన్స్ కింద పోలీస్ స్టేషన్లకు డబ్బులు ఇస్తున్నట్టు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించడంలో పోలీస్‌వ్యవస్థ విజయవంతమైందని చెప్పారు. సైబరాబాద్ పరిధిలోని మొయినాబాద్, శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ల పునరుద్ధరణతో పాటు, పోలీస్ క్వార్టర్స్, కొత్త ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు నిర్మించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య కోరడంతో హోం మంత్రి ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

అనంతరం ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సర్కార్ అంటే దిశా నిర్దేశం, కమిట్‌మెంట్ ఉన్న ప్రభుత్వం అని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక రియల్ ఎస్టేట్, ఫార్మా సహా అన్ని రంగాల్లో రాష్ట్రం నెంబర్‌వన్‌గా ఉందనీ, అందులో పోలీస్ డిపార్ట్‌మెంట్ పాత్ర అత్యంత కీలకమన్నారు. ఎనిమిదేండ్ల పాలనలో హైదరాబాద్‌లో ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించడంలో రాష్ట్ర పోలీసులు విజయవంతమయ్యారని చెప్పారు. హైదరాబాద్‌లో పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏడు లక్షల సీసీ, టీవీ కెమెరాలు ఉన్నాయనీ, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిలబడిన ఒక్క సింగిల్ టిప్‌తో సిటీలో ఉన్న ప్రతి బస్తీ, గల్లీలో ఏం జరుగుతుందో తెలుసుకోవచ్చన్నారు. సామాన్యుడు కూడా పోలీసు వ్యవస్థను నిర్మాణాత్మకంగా, సమర్థవంతంగా వినియోగించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని అమలు చేస్తుందన్నారు. పర్ఫామెన్స్ ఇండెక్స్‌తో పోలీసుల పని తీరును లెక్కిస్తూ, మెరుగైన సేవలందించిన వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీపీ మల్గారి విజయలక్ష్మి రమణారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు మాలతీ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, మార్కెట్ కమిటీ ఛైర్మెన్ రంగారెడ్డి, వైస్ ఛైర్మెన్ నర్సింలు, ఆయా గ్రామాల సర్పంచులు భీమయ్య, కేసారం శ్రీనివాస్ యాదవ్, శైలజ అగిరెడ్డి, మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు సత్యనారాయణ చారి, నరేందర్ చారి, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకోవాలి

- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు,అన్నప్రాసన



నవ తెలంగాణ-రాయపోల్

గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకోవాలని అనాజీపూర్ గ్రామ సర్పంచ్ ఎనుముల శోభారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డెబోరా రాణి సూచించారు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం అనాజీపూర్ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణీ మహిళలందరికీ సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి పుట్టిన బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడంలో మొహమాట పడుతున్నారన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఎంతో శ్రేయస్కరమని తెలిపారు. బిడ్డకు పుట్టిన వెంటనే పట్టిన తల్లి పాలు మొదటి టీకాలుగా పని చేస్తాయన్నారు. శిశు మరణాలు తగ్గించాలంటే తప్పనిసరిగా పిల్లలకు తల్లిపాలు అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీమన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్, అంగన్వాడీ టీచర్లు పద్మ, మంజుల, సరస్వతి, రాధ, ఉపాధ్యాయులు, ఆయమ్మలు తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- ధాన్యానికి గిట్టుబాటు ధర ఇచ్చి కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి :సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

నవతెలంగాణ- కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. తమ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 353 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉండగా కేవలం 2 మాత్రమే ప్రారంభించి చేతులు దులుపుకున్నారని అన్నారు. ఒక గింజ ధాన్యం కూడా కొనుగోలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారులి. 15 రోజుల క్రితం నుండే వరి కోతలు మొదలయ్యాయని, వడ్లను ఎక్కడ నిల్వ చేసుకోవాలో రైతులు అయోమయంలో ఉన్నారని తెలిపారు.

పారదర్శకంగా హజ్‌యాత్రికుల ఎంపిక

- ఆక్రమణలో సౌదీలోని నిజాం సత్రం
- రంజాన్ తర్వాత చర్యలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హజ్ యాత్రీకులు, ఖాదీమ్‌ల ఎంపికను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు హజ్ కమిటీ ఛైర్మెన్ మహ్మద్ సలీం తెలిపారు. బుధవారంనాడిక్కడి హజ్ భవన్‌లో సౌదీకి వెళ్లే ఖాదీమ్‌ల ఎంపిక కోసం డ్రా నిర్వహించారు. దీనికోసం 165 దరఖాస్తులు రాగా, దానిలో 111 మంది అర్హత సాధించారనీ, వారిలో డ్రా పద్ధతిలో 15 మందిని, వెయిటింగ్ లిస్ట్ కింద మరో ఐదుగురిని ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ ఏడాది హజ్ యాత్రకు 5,278 మంది ఎంపిక అయ్యారనీ, వారికి తగిన శిక్షణ ఇచ్చి జూన్ 6వ తేదీ ప్రత్యేక చార్టెడ్ విమానాల ద్వారా సౌదీకి పంపుతామని వివరించారు. సౌదీలోని నిజాం సర్కార్ నిర్మించిన సత్రం కొందరి కబ్జాలో ఉన్నదనీ, దాన్ని విడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఈ మేరకు తానే స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాసానన్నారు. రంజాన్ తర్వాత సౌదీ ఎంబసీతో పాటు అక్కడి పోలీస్‌శాఖకు కూడా లిఖితపూర్వక ఫిర్యాదు చేస్తామని చెప్పారు. సమావేశంలో హజ్ కమిటీ సీఈఓ షఫియుల్లా తదితరులు పాల్గొన్నారు.

సంబంధిత అధికారులతో చర్చించాలి

-అర్జీల సమితిని ప్రారంభించిన గుత్తా సుఖేందర్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర శాసనమండలి సమావేశాల సందర్భంగా సభ్యులు అర్జీల రూపంలో ఇచ్చే సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి ప్రజలకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని శాసనమండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. బుధవారం తెలంగాణ శాసన మండలి ప్రాంగణంలోని కమిటీ హాలులో శాసన మండలి అర్జీల సమితిని ఆయన ప్రారంభించారు. సమావేశాల సందర్భంగా అనేక రకాల సమస్యలు ప్రస్తావనకు వస్తుంటాయని ఆయన తెలిపారు. ప్రభుత్వ దృష్టికి రాని సమస్యలను సభ్యులు అర్జీల రూపంలో మండలికి సమర్పిస్తారని చెప్పారు. సమితికి ఉన్న ప్రాధాన్యత రీత్యా సభ్యులు క్రమం తప్పకుండా సమావేశాలకు హాజరు కావాలని సూచించారు.

అనంతరం గుత్తా ప్రివిలేజ్ కమిటీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ్యులకు విశేష అధికారాలు, హక్కులు రాజ్యాంగంలోని ఆర్టికల్ 194 ప్రకారం ఇవ్వబడ్డాయని తెలిపారు. వాటికి భంగం కలిగితే పరిశీలించి చర్యలు తీసుకునేందుకు విశేషాధికారుల కమిటీకి సర్వాధికారాలు ఉంటాయని స్పష్టం చేశారు. తన దృష్టికి వచ్చిన వాటిని కమిటీకి రెఫర్ చేస్తాననీ, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తమ గౌరవానికి, హక్కులకు భంగం కలిగిందని భావించిన సభ్యులు తప్పనిసరిగా కమిటీ ముందుకు వచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. శాసన మండలి అర్జీల కమిటీ, ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్‌గా నియమితులైన డిప్యూటీ ఛైర్మెన్ బండ ప్రకాష్ , ఆ కమిటీల సభ్యులకు ఈ సందర్భంగా ఛైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ ఛైర్మెన్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, ఫరూక్ హుస్సేన్ , సిరికొండ మధుసూదన చారి , శేరి శుభాష్ రెడ్డి,యాదవ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, తెలంగాణ లెజిస్లేచర్ సెక్రెటరీ డాక్టర్ నరసింహా చార్యులు, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు.. భగ్గు..

నిప్పుల కొలిమిగా సింగరేణి ఓసీ

- ఉక్కిరిబిక్కిరి అవుతున్న కార్మికులు
- 300మీ. లోతు ఓసీల్లో 50 డిగ్రీల ఉష్ణోగ్రతలు
- పని ప్రదేశాల్లో షెల్టర్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ నిల్
- ప్రాథమిక వైద్యం.. కనీసం మంచినీరు కరువు
- పట్టింపులేని సింగరేణి యాజమాన్యం



నవతెలంగాణ-ఇల్లందు

రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఉష్ణోగ్రతలు ఉంటాయన్న సంగతి తెలిసిందే. దానికి సుమారు నెల రోజుల సమయం ఉన్నప్పటికీ దాన్ని తలపించేలా నేడు ఎండలు భగభగమంటూ కుతకుతలాడుతున్నాయి. ముఖ్యంగా సింగరేణి ఓసీ ప్రాంతాల్లో ఎండలో బయటకు పోతే ఒళ్ళంతా మంట పుడుతోంది. 10 రోజుల నుంచి ఎండలు అదరగొడుతున్నాయి. ప్రజలు బయటకు రావడానికే భయపడుతున్నారు. సింగరేణి ఓసీల్లో పనిచేసే కార్మికుల ఉక్కపోత కష్టాలు అంతాఇంతకాదు. కొత్తగూడెం, మణుగూరు, సత్తుపల్లి, ఇల్లందు, టేకులపల్లి ఓసీలు నిప్పుల కొలిమిలా మారాయి. బయట ఉష్ణోగ్రతలు 42, 43 డిగ్రీలు ఉంటే.. సుమారు 300 మీటర్ల లోతులో ఉండే ఓసీల్లో 50 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటుతున్నట్టు తెలుస్తోంది. ఎండ వేడిని తట్టుకోలేక కార్మికులు అవస్థలు పడుతున్నారు. విధులకు హాజరు కావడానికి భయపడుతున్నారు.

ఇల్లందు ఓసీలో డంపర్స్, షేవల్స్, డ్రిల్స్, గ్రడ్డర్స్, ఎస్‌కార్ట్స్, వర్కర్స్, వెహికిల్స్ నడిపే డ్రైవర్స్, ఇతర సిబ్బంది కలిపి ఉమ్మడి జిల్లాలో 5000 మంది వరకు ఉన్నారు. అధికారులు ఓసీలోకి వెళ్ళే బొలెరో వాహనాలకు ఏసీలు ఉంటున్నాయి. కార్మికులు వెళ్లడానికి మాత్రం మామూలు వాహనాలు మాత్రమే యాజమాన్యం కేటాయిస్తోందని సమాచారం. కార్మికులు ఓసీలోకి వెళ్ళడానికి కిలో మీటర్ల కొద్దీ దూరం ఉంటుంది. కనుచూపు మేరలో అంతా ఎడారిని తలపిస్తుంది. వేడి తట్టుకోవడానికి కొంతసేపు నిల్చుందామన్నా నిలువ నీడ ఉండదు. దుమ్ముధూళితో ప్రదేశం అంతా నిండిపోతూ ఉంటుంది. వేడి పొగలు భగభగమంటూ నిప్పుల ఆవిరిలా పైకి లేస్తుంటుంది. ఇంతటి వేడిలో కార్మికులు పనిచేస్తున్నారు. గతంలో కార్మికులు సేదతీరడానికి పాకలు, షెడ్డులు నిర్మించేవారు. ఇప్పుడవిలేకపోవడం వల్ల కార్మికులు అంతటి వేడిలోనే పనిచేస్తున్న పరిస్థితి ఉంది. కనుచూపుమేరలో మట్టికట్టలు, లోయలు, అగాధాల్లా కనిపించే ఓసీల్లో.. డంపర్లు, ఇతర వాహనాలు తిరగడంవల్ల దుమ్మూ, ధూళి పైకిలేవడం దీనికి తోడు విపరీతమైన వేడిగాలులు వీచడంతో కార్మికులు నీరసించిపోతున్నారు. ఎండదెబ్బకు గురై అనారోగ్యంపాలు అవుతున్నారని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కనీసం మంచినీటి సౌకర్యం కరువు

కుతకుతలాడే ఓసీల్లో వేడిని తట్టుకునేందుకు కార్మికులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో యాజమాన్యం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని కార్మిక సంఘాలంటున్నాయి. 200 మి.లీ మజ్జిగ ప్యాకెట్లు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని, అవి కూడా నాణ్యతలేని, తయారీ తేదీ, కంపెనీ పేరు లేనివి ఇస్తున్నారని, ఇక ఓఆర్ఎస్ ఊసే లేదని కార్మికులు వాపోతున్నారు. అంతేకాదు, గతంలో చల్లటి మంచినీటి క్యాన్లు, షెల్టర్లు, ప్రాథమిక చికిత్స కిట్లు ఇచ్చేవారని, ఈ ఏడాది వాటి ఊసేలేదని కార్మికులు తెలిపారు. ఎలాంటి ముందుజాగ్రత్త చర్యలు లేకపోవడంతో భగభగ మండే ఎండలకు కార్మికులు నీరసించి పడిపోయే అవకాశం ఉందని, అయినా యాజమాన్యం వారికోసం ఎమర్జెన్సీగా చికిత్సతో పాటు అంబులెన్స్ పెట్టాలనే ఆలోచన కూడా యాజమాన్యానికి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓసీ ఏరియాల్లో ప్రాథమిక చికిత్స చేయడానికి ఏఎన్ఎంతో పాటు వైద్యసౌకర్యం కల్పించాలని కార్మికులు కోరుతున్నారు.

పనివేళలు మార్చాలి : సింగరేణి కాలరీస్ ఎంప్లాయిూస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు, బ్రాంచి కార్యదర్శి ఎండీ అబ్బాస్



ఓసీల్లో వేడీ విపరీతంగా ఉంటుంది.. దాన్ని తట్టుకుని కార్మికులు పనిచేయదానికి ఇబ్బందులు పడుతున్నారు. మొదటి షిఫ్ట్ ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు, 2వ షిఫ్ట్ సాయంత్రం 4.30 నుంచి రాత్రి 11వరకు, 3వ షిఫ్ట్ రాత్రి 11.30 నుంచి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. మజ్జిగ ప్యాకెట్స్ రోజుకు నాలుగు, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ రెండు, కార్మికులు సేద తీరదానికి మంచినీటి సౌకర్యం, పాకలు లేదా షెడ్లు ఏర్పాటు చేయాలి.

నవతెలంగాణ

బిజినెస్

మెటాలో మరో 10వేల మందిపై వేటు..!

- డిస్నీలోనూ 15 శాతం మందికి ఉద్వాసన
- విప్రోలో ఫ్రెషర్లకు గడ్డుకాలం




వాషింగ్టన్ : ఆర్థిక సంక్షోభ భయాలతో దిగ్గజ టెక్ కంపెనీలు ఉద్యోగులకు ఉద్వాసనలు పలుకు తూనే ఉన్నాయి. తాజాగా మెటా, వాల్ట్ డిస్నీలు భారీ మొత్తంలో తొలగింపులకు సంకేతాలు ఇవ్వ గా.. విప్రో ఫ్రెషర్లపై వేటుకు సిద్దం అయ్యింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ అయినా మెటా మరోసారి వేలాది ఉద్యోగులను ఇంటికి పంపించే చర్యలకు దిగుతోందని సమాచారం. ఈ దఫా 10,000 మంది ఉద్యోగులకు కోత విధించనుందని బ్లూమ్‌బర్గ్ తాజాగా రిపోర్ట్ చేసింది. ఒక్కటి, రెండు రోజుల్లోనే దీనిపై అధికారికంగా ప్రకటన వెలుపడే సూచనలున్నాయి. ఇంతక్రితం మార్చిలో 10వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు మెటా సిఇఒ మార్క్ జుకర్ బర్గ్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి కొనసాగింపుగానే ప్రస్తుత నిర్ణయం. బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ ప్రకారం.. సంస్థ పునర్నిర్మాణంలో భాగంగా ఈ కఠిన నిర్ణయం తీసుకోక తప్పడం లేదని జుకర్ బర్గ్ పేర్కొన్నారు. తొలగింపు అంశంపై మేనేజర్లకు మెటా సమాచారం కూడా ఇచ్చింది. ఉద్యోగులు ఇంటిబాట పట్టడానికి సిద్దపడి ఉండాలని తెలిపింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, వర్చువల్ రియాలిటీ సంస్థ రియాలిటీ ల్యాబ్స్, క్వెస్ట్ హార్డ్ వంటి విభాగాల్లోని ఉద్యోగులకు ఉద్వాసన పలికే అవకాశం ఉందని తెలుస్తోంది. గతేడాది నవంబరులో 13 శాతానికి సమానమైన 11,000 మంది ఉద్యోగులపై వేటు వేసింది. ఇప్పటికే కొత్త నియామకాల్ని దాదాపు నిలిపివేసింది. ప్రకటనల ఆదాయం తగ్గడంతో పాటుగా ప్రతికూల వ్యాపార పరిస్థితుల నేపథ్యంలో ఉద్యోగులను తొలగించాల్సి వస్తుందని మెటా పేర్కొంది.

అమెరికాకు చెందిన ప్రముఖ వినోద సంస్థ వాల్ట్ డిస్నీ దాదాపు 15 శాతం మంది ఉద్యోగులను తొలగించనుంది. వచ్చే వారం ఆ సంస్థ ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలోఉద్వాసనలు ఉండనున్నాయని తెలిపింది. ఏప్రిల్ 24 నాటికి తొలగింపులపై సిబ్బందికి స్పష్టమైన సమాచారం చేరవేస్తామని ఆ వర్గాలు తెలిపాయి. ఆ సంస్థ 2023 ఫిబ్రవరిలోనే ఏడు వేల మంది ఉద్యోగులను తీసేసింది. తాజాగా మరో విడత తొలగింపు ప్రకటనతో ఆ కంపెనీ ఉద్యోగులు తీవ్ర ఆందోళన నెలకొంది.

భారత దిగ్గజ ఐటి కంపెనీల్లో ఒక్కటైన విప్రో తన ఫ్రెషర్లకు ఎసరు పెట్టే యోచనలో ఉందని తెలుస్తోంది. దాదాపు 15 నెలలకు పైగా ంచే పనిలో ఉఆన్‌బోర్డింగ్ కోసం ఎదురుచూస్తున్న ఫ్రెషర్‌లకు మరో పరీక్ష విధించడం ద్వారా అనేక మందికి ఉద్వాసన పలకనుందని రిపోర్టులు వస్తోన్నాయి. ఈ తరహా పరీక్షను ఇప్పటికే ఫ్రెషర్లు ఎదుర్కొన్నప్పటికీ.. మరోసారి ఈ చర్యకు దిగడం గమనార్హం. ఇటీవల ఫ్రెషర్లకు ఇచ్చే వేతనాలను రూ.6.5 లక్షల నుంచి రూ.3.5 లక్షలకు కోత పెట్టింది.

హైదరాబాద్‌లో 78% పెరిగిన సంపన్నులు



వాషింగ్టన్ : ప్రపంచంలో అత్యంత సంపన్న నగరాల జాబితాలో హైదరాబాద్ 65వ స్థానంలో నిలిచిందని హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఈ నగరం లో అత్యధిక నికర సంపదగల వ్యక్తుల సంఖ్య ఏడాదిలో 78 శాతం పెరిగిందని తెలిపింది. ఇక్కడ 11,100 మంది మిలియనీర్లు (రూ.8 కోట్ల పైగా సంపద) ఉన్నారని పేర్కొంది. హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ రూపొందించిన 'ప్రపంచంలోనే అత్యంత సంపన్న నగరాల నివేదిక 2023' రిపోర్ట్ ప్రకారం.. మొత్తం 97 నగరాలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. 2022 డిసెంబర్ 31 నాటికి భారత్ నుంచి ముంబయి నగరం 59,400 మంది మిలియనీర్లతో 21వ స్థానంలో, 12,600 మంది సంపన్నులతో బెంగళూరు 60వ స్థానంలో, కోల్‌కత్తా 12,100 మందితో 63వ స్థానంలో నిలిచాయి. అమెరికాలోని న్యూయార్క్ నగరం 3,40,000 మంది మిలియనీర్లతో అగ్ర స్థానంలో నిలిచింది. జపాన్ రాజధాని టోక్యో 2,90,300 మంది మిలియనీర్లతో రెండో స్థానంలో ఉంది. శాన్‌ఫ్రాన్సిస్కో, లండన్, సింగపూర్, లాస్ ఏంజెల్స్, హాంకాంగ్, బీజింగ్, షాంఘై, సిడ్నీ నగరాలు టాప్ 10లో వరుసగా ఉన్నాయి.

5జి స్మార్ట్‌ఫోన్లలో 19 విస్తృత మోడళ్లు

- సామ్‌సంగ్ గెలాక్సీ ఎం14 5జి ఆవిష్కరణ



హైదరాబాద్ : సామ్‌సంగ్ ఇండియా 5జి విభాగంలో 19 విస్తృత మోడళ్లను కలిగి ఉందని ఆ కంపెనీ మెబైల్ బిజినెస్ డైరెక్టర్ వరుణ్ సచ్‌దేవా తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన సామ్‌సంగ్ గెలాక్సీ ఎం14 5జిని ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రూ.10వేల -20,000 శ్రేణీ స్మార్ట్‌ఫోన్ విభాగంలో సామ్‌సంగ్ అగ్రస్థానంలో ఉందన్నారు. ప్రస్తుత ఏడాదిలో 5జిలో కొత్తగా తొమ్మిది ఫోన్లను ఆవిష్కరించామన్నారు. ఎం14ను 50ఎంపి కెమెరా, సెల్ఫీ కోసం 13ఎంపి కెమెరా, 6000 ఎంఎహెచ్ బ్యాటరీతో, 5ఎస్ఎం ప్రాసెసర్‌తో అందుబాటులోకి తెచ్చామన్నారు. 4జిబి, 128 జిబి ధరను రూ.13,490గా, 6జిబి, 128 జిబి ధరను రూ. 14,990గా నిర్ణయించామన్నారు. ఇది ఏప్రిల్ 21 నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అమ్మకానికి అందుబాటులో ఉంటుందన్నారు.

మలబార్ గోల్డ్ ప్రచారకర్తగా అలియా భట్



హైదరాబాద్ : ప్రముఖ అభరణాల రిటైల్ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ తన బ్రాండ్ అంబాసీడర్‌గా ప్రముఖ బాలీవుడ్ నటీ అలియా భట్‌ను నియమించు కుంది. అలియా అందం, అభినయం తో ప్రేక్షకులను అలరిస్తోందని.. ఆమె తమ సంస్థకు మరింత వన్నె తీసుకురాగలదని మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ ఓ ప్రకటనలో పేర్కొంది. సంస్థ 30 ఏళ్ల వేడుకల సందర్బంగా అలియాతో జట్టు కట్టినట్లు మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎంపి అహ్మద్ పేర్కొన్నారు. ఈ సంస్థ 10 దేశాల్లో 312 షోరూంలను కలిగి ఉంది.

ఫోన్‌పేలో పసిడిపై అక్షయ తృతీయ ఆఫర్లు

న్యూఢిల్లీ : అక్షయ తృతీయ సందర్బంగా తమ వినియోగదారులకు భారీగా క్యాష్ బ్యాక్ ఆఫర్లను అందిస్తున్నట్లు ఫోన్ పే తెలిపింది. తమ యాప్ ద్వారా ఏప్రిల్ 22న ఒక్క గ్రాము లేదా అంతకన్నా ఎక్కువ పరిమాణంలో డిజిటల్ బంగారం కొనుగోలు చేసే వారికి రూ.50 నుండి రూ.500 వరకు క్యాష్ బ్యాక్ తప్పనిసరి ఆఫర్ చేస్తున్నట్లు పేర్కొంది. తాము నిల్వ చేసిన బంగారాన్ని ఏ సమయంలో విక్రయించినా, 48 గంటల్లో దానికి సంబంధించిన డబ్బు వారి బ్యాంక్ ఖాతాలకు జమ అవుతుందని తెలిపింది.

బీఆర్ఎస్ పార్టీని వీడే ప్రసక్తే లేదు

- ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తేలేదని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి వెల్లడించారు. సోషల్ మీడియాలో కొన్ని లోకల్ గ్రూప్‌ల్లో వస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని అన్నారు. కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఆ ప్రచారం వాస్తవం కాదని, తప్పుడు ప్రచారాన్ని పట్టించుకోవద్దని బీఆర్ఎస్ పార్టీ నేతలను, కార్యకర్తలకు, ప్రజలను కోరారు.ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తాను పనిచేస్తానని అన్నారు.

అన్నింటా బీజేపీ ప్రభుత్వం విఫలం



కేంద్రీకరణ నుంచి రాష్ట్రాన్ని కాపాడలేకపోయింది

- సమాఖ్య స్ఫూర్తిని నీరుగార్చింది
- బహుత్వ కర్నాటక ఫోరం విమర్శలు

బెంగళూరు : కర్నాటకలోని బీజేపీ ప్రభుత్వం దాదాపు అన్ని రంగాల్లోనూ ఘోరంగా విఫలమైందని 'బహుత్వ కర్నాటక' అనే సంస్థ ఒక నివేదిక విడుదల చేసింది. ప్రధానంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కేంద్రీకృత విధానాలకు పూర్తిగా లొంగిపోయిందని, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కాపాడటంలో విఫలమైందని విమర్శించింది. కర్నాటక బీజేపీ ప్రభుత్వ పనితీరుపై ఈ ఫోరం వరుసగా రిపోర్టు కార్డులను విడుదల చేస్తోంది. ఈ క్రమంలో 'సమాఖ్య స్ఫూర్తిని కాపాడుకోవడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైన తీరును ఎండగడుతూ బుధవారం నాడు మరో నివేదిక విడుదల చేసింది. కేంద్రీకరణ ప్రమాదాల నుంచి కర్నాటక ప్రజలను కాపాడాలనే రాజ్యాంగ విధులను నిర్వహించడంలో రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అందులో పేర్కొన్నారు. భారతదేశాన్ని మన రాజ్యాంగం 'రాష్ట్రాల యూనియన్'గా పేర్కొంది. న్యూఢిల్లీ కీలుబొమ్మల్లో ఒకటిగా మారిపోయిన ఇక్కడి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఆడించినట్టు ఆడిందే మినహా ఇక్కడి ప్రజలకు జవాబుదారీగా లేకుండా పోయిందని 'బహుత్వ కర్నాటక' విమర్శించింది. నివేదిక విడుదల సందర్భంగా ఫోరం కన్వీనర్ వినయ్ శ్రీనివాస మీడియాతో మాట్లాడుతూ 'కర్నాటక ఆర్థిక ప్రగతిని, వనరులు దోపిడికి గురౌతున్నాయి. హిందీని బలవంతంగా రుద్దుతున్నందున విలక్షణమైన మన రాష్ట్ర సంస్కృతీ దెబ్బ తింటోంది. ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాధికారాలను ఢిల్లీకి సమర్పించేసుకుంది. దీంతో ఢిల్లీ చేతిలో కీలుబొమ్మలా మారి..రాష్ట్ర ప్రజానీకానికి సమాధానం చెప్పుకోలేని స్థితిలోకి కూరుకుపోయింది' అని విమర్శిం చారు. 2019-2023 మధ్య కాలానికి రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై ఈ ఫోరం విశ్లేషణాత్మక నివేదికలు విడుదల చేసింది.

తగ్గిన నిధులు

కేంద్ర పన్నులు, జీఎస్టీలో రాష్ట్రానికి రావాల్సిన వాటా, అలాగే కేంద్ర ప్రాయోజిత పథకాల కు రావాల్సిన నిధులుగా భారీగా తగ్గిపోయాయని శ్రీనివాస చెప్పారు. 14వ ఫైనాన్స్ కమిషన్ కింద 2015-2020లో రాష్ట్ర వాటా 4.71 శాతంగా ఉండగా ప్రస్తుతం 15వ ఫైనాన్స్ కమిషన్ కింద 2021-26 కాలానికి 3.64 శాతానికి కుదించారని పేర్కొ న్నారు. అంటే గతంలో ప్రతి వంద రూపాయల పన్ను ఆదాయానికి గాను కర్నాటక గతంలో రూ.53 తిరిగి వస్తుండగా ఇప్పుడు రూ.40కు పడిపోయిందని ఆయన విశ్లేశించారు. దీంతో పాటు 2021లో కర్నా టకను వరదలు ముంచెత్తినా కేంద్రం నుంచి సాయాన్ని రాబట్టడం లోనూ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంద న్నారు. ఎప్పుడో మూడు నెలల తర్వాత నామమాత్రపు సాయాన్ని విదిలిస్తే దాంతోనే ఇక్కడి ప్రభుత్వం సరిపెట్టు కుందన్నారు.

హిందీ రుద్దేస్తున్నారు..!

కేంద్ర ప్రభుత్వ నియామాకాలకు సంబంధించిన పరీక్షలను కన్నడలోనూ నిర్వహించాలన్న కన్నడ ప్రజల విజ్ఞప్తిని కేంద్రం పెడచెవిన పెట్టినా రాష్ట్ర ప్రభుత్వం మిన్నుకుండిపోయిందన్నారు. కన్నడ భాషాభిమానులు ఎంతగా వ్యతిరేకించినా కూడా ఢిల్లీ పెద్దల మెప్పు కోసం 'హిందీ దినోత్సవాన్ని' ఘనంగా నిర్వహించారని 'బహుత్వ కర్నాటక' ఫోరం తన నివేదికలో విమర్శించింది. కేంద్ర ప్రభుత్వ కార్యాక్రమాలు, పథకాలకు అన్నింటికి హిందీనే వాడుతున్నారని, దీనివల్ల కన్నడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఫోరం పేర్కొంది. మరోవైపు భాగస్వామ్య



రాష్ట్రాలు అన్నీ కూడా బీజేపీ పాలిత రాష్ట్రాలే అయినా కూడా 'మహదాయి' జలాల వాటా వివాదాన్ని పరిష్కరించడంలోనూ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు.

డబుల్ ఇంజిన్..సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకం

బీజేపీ నాయకులు పదేపదే డబుల్ ఇంజిన్ అంటుంటారని, వాస్తవానికి డబుల్ ఇంజిన్ సర్కార్ అనే విధానమే సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకమైనదని 'బహుత్వ కర్నాటక' ఆక్షేపించింది. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కేంద్ర ప్రభుత్వపు రిమోట్ కంట్రోల్‌గా మారిపోయిందని ఫోరం కన్వీనర్ శ్రీనివాస విమర్శించారు. శక్తివంతమైన బీజేపీ నాయకులు చెప్పుకునే బిఎస్ యడియూరప్ప లాంటి వ్యక్తిని ముఖ్యమంత్రి పదవి నుంచి కారణమేదీ లేకుండానే దింపేశారని ఆయన గుర్తు చేశారు. ఆయన స్థానంలో సీఎంగా కూర్చోబెట్టిన బసవరాజ్ బొమ్మై పూర్తిస్థాయి క్యాబినెట్ మంత్రులు లేకుండానే కొన్ని నెలల పాటు ప్రభుత్వాన్ని నడిపారంటే కేంద్రం చేతిలో రాష్ట్రం ఎంతటి కీలుబొమ్మలా మారిందో అర్థం చేసుకోవచ్చున్నారు.

చిన్నచితకా పథకాలూ మోడీ చేతుల మీదుగానే..

రాష్ట్రంలో ఏ చిన్నపాటి అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా..'హక్కు పత్రాల పంపిణి' వంటి ప్రతిదానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీని వచ్చేదాకా వేచిచూడటం, ఆయనతోనే ప్రారంభం చేయించడం వల్ల ఖజానాపై అదనపు భారం పడిందని, ప్రారంభించిన పథకాల వల్ల లబ్దిదారులకు కలిగే ప్రయోజనాల కంటే కేంద్ర ప్రభుత్వ పెద్దల రాకతో ఏర్పాట్లకయ్యే ఖర్చే ఎక్కువగా ఉంటోందని ఆయన ఎద్దేవా చేశారు. ఇదంతా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి, ప్రధాని మోడీకి ప్రచార కార్యక్రమాలుగా మారాయే తప్ప లబ్దిదారులకు మేలు కలిగించేలా లేవని పేర్కొన్నారు. బృహత్ బెంగళూరు మహానగర పాలిక (బీబీఎంపీ) ఎన్నికలు నిర్వహించడంలోనూ, పంచాయితీ ఎన్నికలు నిర్వహించడంలోనూ మూడేండ్లుగా రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని, ఇందుకు కర్నాటక హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి జరిమానా కూడా విధించిందని, రాష్ట్రంపై కేంద్రం పెత్తనం పెరిగిపోయిందనేందుకు ఇది మరో ఉదాహరణ అని శ్రీనివాస పేర్కొన్నారు. రాష్ట్ర జాబితాలో ఉన్న విద్యుత్ విషయంలోనూ స్వతహాగా నిర్ణయాలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందనీ, ఈ విషయంలో కూడా కేంద్రం ఆడించినట్లే ఆడుతోందని విమర్శించారు.

పాల రాజకీయం

కర్నాటకలో పాల మార్కెట్‌ను నిలువెల్లా దోచుకునేందుకు గుజరాత్‌కు చెందిన అమూల్ సంస్థ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ద్వారా ప్రయత్నాలు చేయగా ఇక్కడి ప్రభుత్వం ఏమాత్రం వ్యతిరేకించలేకపోయిందని, రాష్ట్ర ప్రజల జీవనంలో మమేకమైన నందిని సహకార సంస్థను ప్రజలే కాపాడుకోగలిగారని ఆయన చెప్పారు. సమాఖ్య వ్యవస్థను పరిరక్షించుకోవాలంటే కేంద్రానికి సాగిలపడిపోయి వారి చేతుల్లో కీలుబొమ్మల్లా పనిచేసే పార్టీలను ఈ ఎన్నికల్లో తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు కోరుతున్నారు.

పిల్లల దత్తత మరింత సులభతరం

'దత్తత హెల్ప్ డెస్క్' ప్రారంభోత్సవంలో మంత్రి సత్యవతి రాథోడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సంతానం కలగని దంపతుల కోరికను తీర్చేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం పిల్లల దత్తత ఇచ్చే ప్రక్రియను మరింత సులభతరం చేసిందని రాష్ట్ర స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. హైదరాబాద్ మధురానగర్‌లోని మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం లో దేశంలోనే మొట్టమొదటిసారి ఏర్పాటు చేసిన 'దత్తత హెల్ప్ డెస్క్'ను బుధవారం ప్రారంభించారు. హెల్ప్ డెస్క్‌కు వచ్చిన ఫోన్ కాల్‌ను మంత్రి స్వయంగా మాట్లాడి దత్తత వివరాలను తెలియ జేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దత్తత కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకం గా అమలు చేస్తుందని అన్నారు. సంతానం లేని తల్లిదండ్రులకు పిల్లలను దగ్గర చేయడం, తల్లిదండ్రులు లేని చిన్నారులకు కుటుంబాన్ని దగ్గర చేయడం ఒక గొప్ప కార్యక్రమం అని అన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ప్రక్రియల ద్వారా ఈ పిల్లల దత్తత ఒక క్రమ పద్ధతిలో జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధిత పత్రాలు కేరింగ్ వెబ్ సైట్‌లో అప్‌లోడు చేయబడతాయని పేర్కొ న్నారు. దత్తత గురించి సరైన అవగాహన లేని వారు, పిల్లలు లేని తల్లిదండ్రులు ఒత్తిడికి నిరాశకు గురి అవుతున్నారని, వీటన్నింటినీ దష్టిలో ఉంచుకుని ఈ దత్తత సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటి కేరింగ్ లో ఎలా దరఖాస్తు చేసుకోవాలో? ఆన్‌లైన్ రిజిస్ట్రే షన్ ఏ విధంగా చేసుకోవాలో? తెలి యజేయడం, సరైన ధవీకరణ పత్రాలు పొందడం, ఎవరిని సంప్ర దించాలి వంటి విషయాలపై వారికి అవసరమైన సలహాలు సూచనలు ఈ కేంద్రం ద్వారా అందచేయ బడతాయని తెలిపారు. ఐదేండ్లు దాటిన పిల్లలను దత్తత తీసుకునే తల్లిదండ్రులకు ఆ పిల్లలతో ఎలా సర్దుకుపోవాలో హెల్ప్‌డెస్క్ ద్వారా కౌన్సిలింగ్ చేయడం జరుగుతుందని, పిల్లలకు కూడా కొత్త జీవితంలో ఎలా ఉండాలనే విషయాలపై అవగాహ న కలిగిస్తామని తెలిపారు. పిల్లలను దత్తత తీసుకు న్న తర్వాత రెండు సంవత్సరాల వరకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు నాలుగు సార్లు విజిట్ చేసి పిల్లల పరిస్థితి ఎలా ఉందని పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. తదుపరి వారికి ఏవైనా సమస్యలు ఉన్న వాటి పరిష్కారానికి హెల్ప్ డెస్క్‌ను సంప్రదిం చొచ్చని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 2000కు పైగా తల్లిదండ్రులు పిల్లల కోసం దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. కానీ ప్రస్తుతం నార్మల్‌గా 38 మంది పిల్లలు ఉన్నారని, ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు 100 మంది ఉన్నారని అన్నారు. ఈ పరిస్థితి గురించి పిల్లల దత్తత కోసం ఎదురు చూసేవారికి హెల్ప్ డెస్క్ ద్వారా కౌన్సిలింగ్ ఇస్తామని తెలిపారు. ఈ దత్తత సేవా సమాచారం వ్యక్తులకు కమిటీ మీటింగ్ ద్వారా, దూర ప్రాంతంలో ఉన్న వారికి టెలిఫోన్/ వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా సహాయ పడతారని తెలిపారు. తెలంగాణలో దత్తత తీసుకోవాలనుకునే తల్లిదండ్రులు ఈ క్రింది నెంబర్లకు ఫోన్‌చేసి 040-23748663/040-23748664 సంప్రదించొచ్చని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ కమిషనర్ భారతి హెూలీకేరి, జేడీ.లక్ష్మి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యార్థుల్లేరనే పేరుతో వంద వసతి గృహాలను మూసివేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నిర్ణయం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు చదువుకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. హాస్టళ్లను మూసి దగ్గరలో ఉన్న గురుకులాలు, హాస్టళ్లలో విలీనం చేస్తామని చెప్పడమంటే సంక్షేమ వసతిగృహాలకు నష్టం చేయడమేనని విమర్శించారు. విద్యార్థులు చేరేలా ప్రభుత్వం ప్రోత్సహించకుండా, విద్యార్థులు 20 మంది కంటే తక్కువ ఉన్నారని మూసేయడం తగదని హెచ్చరించారు. దళిత, గిరిజన, ఆదివాసీ విద్యార్థులకు హాస్టల్ సదుపాయాలు కల్పిస్తేనే వారు చదువుకుంటారని తెలిపారు. వలసలు వెళ్లే వారి పిల్లలు, ఇతర పనులు చేసే తల్లిదండ్రులు వారి పిల్లలను సొంతూర్లో ఉంచి చదివించే అవకాశముండబోదని వివరించారు. మూసివేత పేరుతో సంక్షేమానికి నిధులు తగ్గించి, పేద విద్యార్థులను చదువుకు దూరం చేసే కుట్ర ఉందని పేర్కొన్నారు. హాస్టళ్లలో వార్డెన్ల ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, సరైన మెనూ, అదనపు గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. ఇవేవీ చేయకుండా విద్యార్థుల్లేరనే పేరుతో మూసివేస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

టీఎస్‌పీఎస్సీ రద్దుకు రాష్ట్రపతికి సిఫారసు చేయండి

- కొత్తబోర్డు ఏర్పాటు చేయాలి
- గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు వైఎస్ షర్మిల బహిరంగ లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆర్టికల్ 317 ప్రకారం టీఎస్‌పీఎస్సీ బోర్డు రద్దుకు రాష్ట్రపతికి సిఫార్సు చేయాలని, కొత్త బోర్డు వెంటనే ఏర్పాటు చేసేలా చూడాలని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల గవర్నర్ తమిళిసైని కోరారు. ఈ మేరకు బుధవారం గవర్నర్‌కు ఆమె బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోనే ఒక కమిషన్‌లో జరిగిన అతిపెద్ద స్కాం అని అన్నారు. సంతలో సరుకులు అమ్మినట్లుగా కీలకమైన పరీక్షా పేపర్లు అమ్మి 30లక్షల మంది జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. ఈ పేపర్ లీకుల వెనుక బోర్డు చైర్మెన్, సభ్యులు, ఉద్యోగుల నుంచి రాష్ట్ర ప్రభుత్వంలోని మంత్రుల వరకు హస్తం ఉందని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల ప్రోద్భలం లేకుండా ఇలా జరగడం అసాధ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీఎస్‌పీఎస్సీ పూర్తి విశ్వసనీయతను కోల్పోయిందని, పేపర్ లీకేజీపై రాష్ట్ర ప్రభుత్వ హయాంలో నియమించిన సిట్ పనితీరు నమ్మశక్యంగా లేదని విమర్శించారు. కేవలం ఇద్దరు వ్యక్తులు మాత్రమే పేపర్లు లీక్ చేశారని, మరెవరి ప్రమేయం లేదని, కేసును మూసివేసే కుట్ర జరుగుతోందని, స్వయంగా ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఆ ఇద్దరు వ్యక్తులే పేపర్ లీక్ చేశారని జడ్జిమెంట్ కూడా ఇచ్చేశారని గుర్తుచేశారు. కీలకమైన డాటా మంత్రి చేతుల్లోకి వెళ్లిందని, పలు వేదికల్లోనూ పరీక్షలు ఎవరెవరు రాశారో చెప్పేస్తున్నారని, ఇతరులకు దొరకని డాటా కేవలం మంత్రికి మాత్రమే ఎలా అందిందని నిలదీశారు. పేపర్ లీకుల వెనుక బోర్డు చైర్మెన్ జనార్ధన్‌రెడ్డి, సెక్రెటరీ, బోర్డు సభ్యుల దగ్గర నుంచి ప్రగతి భవన్ మంత్రుల వరకు లింకులు ఉన్నాయని తెలిపారు. పెద్దల హస్తం లేకుంటే సీబీఐతోనో, సిట్టింగ్ జడ్జితోనో విచారణ చేయించొచ్చు కదా అని అన్నారు. రాష్ట్ర గవర్నర్‌గా విచక్షణాధికారాలు ఉపయోగించి బోర్డు రద్దు చేసేలా చూడాలని విన్నవించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 317 ప్రకారం రద్దు విషయమై రాష్ట్రపతికి సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.

గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభ వెలికితీతకు త్వరలో సీఎం కప్

మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు

- అన్ని క్రీడల్లో మనోళ్లే ముందుండాలి : ఉన్నతస్థాయీ సమీక్షాసమావేశంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

క్రీడా ప్రతిభను వెలికితీయడానికి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సీఎం కప్ నిర్వహించనున్నామని, దానికి సంబంధించిన షెడ్యూల్ ప్రకటిస్తామని రాష్ట్ర క్రీడా, యువజన సర్వీసుల శాఖల మంత్రి డాక్టర్ వి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని బేగంపేట్ పర్యాటక భవన్‌లో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల జిల్లా యువజన సర్వీసుల శాఖల అధికారులతో బుధవారం క్రీడాప్రాధికార సంస్థ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ , రాష్ట్ర క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతో కలిసి ఉన్నత స్థాయి సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు భవిష్యత్తులో దేశంలో జరిగే అన్ని క్రీడాంశాలలో తెలంగాణ క్రీడాకారులు ఇతర రాష్ట్రాల క్రీడాకారుల కంటే జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించడంలో ముందుండాలని రాష్ట్ర క్రీడా శాఖ అధికారులు, జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలికి తీయాలనే లక్ష్యంతో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి, జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో సీఎం కప్ నిర్వహిస్తామన్నారు. త్వరలో సీఎం కప్ షెడ్యూల్‌ని అధికారికంగా ప్రకటిస్తామన్నారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపులను విజయవంతం చేసేలా స్థానికంగా ఉన్న స్వచ్ఛంద సంస్థలను, కార్పొరేట్ కంపెనీలను భాగస్వామ్యం చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గ్రామీణ క్రీడా ప్రాంగణాలను అన్ని గ్రామాలలో పూర్తి అయ్యేలా డిప్యూటీ ఎస్‌ఓలు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో నిర్మిస్తున్న క్రీడా మైదానాలు సత్వరం పూర్తి అయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. నగరంలో ఉన్న అన్ని ప్రధాన క్రీడా మైదానాలలో మైనర్ మరమత్తులను వెంటనే చేపట్టాలని సూచించారు. సీఎం కప్పు నిర్వహణపై త్వరలో ఉద్యోగ సంఘాలతో, క్రీడా సంఘాలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ క్రీడలకు పెద్దపీట వేసేలా తెలంగాణ సంస్కృతి, క్రీడా ఉత్సవాలను నిర్వహించేలా అందుకు తగిన కార్యచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఉన్నతాధికారులు ధనలక్ష్మి, సుజాత, దీపక్, చంద్రారెడ్డి, డాక్టర్ హరికష్ణ, 33 జిల్లాలకు చెందిన డిప్యూటీ ఎస్‌ఓలు పాల్గొన్నారు.

జబిందా మైదానంలో 24న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ

కేసీఆర్‌కు ఆత్మీయ స్వాగతం పలకనున్న ఔరంగబాద్ ప్రజలు

- ఔరంగబాద్ చరిత్రలోనే రికార్డు
- 450 తెలంగాణ పథకాలను ప్రజలకు నివేదిస్తాం
- భారీ ఆదాయ వనరులు, బడ్జెట్‌లో మహారాష్ట్ర ఫస్ట్
- అభివృద్ధి, సంక్షేమంలో లాస్ట్

మీడియా సమావేశంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మహారాష్ట్రలోని ఛత్రపతి శంబాజీనగర్ (ఔరంగబాద్) జిల్లా కేంద్రంలో గల జబిందా మైదానంలో ఈ నెల 24న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు జబిందా మైదానంలో పీయూసీ చైర్మెన్, ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఆశన్నగారి జీవన్‌రెడ్డి తెలిపారు. సభ ఏర్పాట్లకు సంబంధించిన పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మైదానమంతా కలియదిరిగి చేయాల్సిన ఏర్పాట్ల గురించి చర్చించారు. సభలో ఉత్సాహంగా పాల్గొనేందుకు ఔరంగబాద్ జిల్లా ప్రజలు సమాయత్తమవుతున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్థానిక పార్టీ నాయకులకు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సూచించారు. సభకు సంబంధించి వివిధ రూట్లను ఏర్పాటు చేయాలని, వివిధ నియోజక వర్గాల నుంచి వచ్చేవారికి అనువైన పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్‌కు ఆత్మీయ స్వాగతం పలకడానికి ఔరంగబాద్ జిల్లా ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఔరంగాబాద్ జిల్లా చరిత్రలోనే బీఆర్ఎస్ సభ అతిపెద్దదిగా రికార్డు సష్టిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నాందేడ్, కందార్‌లోహ సభలు లక్షలాది మంది ప్రజల దీవెనలతో సక్సెస్‌కాగా ఔరంగబాద్ సభ సూపర్ సక్సెస్ అయి మహారాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం అమలు చేస్తున్న 450 పథకాలను ఔరంగబాద్ సభ ద్వారా కేసీఆర్ ప్రజలకు నివేదిస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో ప్రచార రథాల ద్వారా గ్రామ గ్రామాన తెలంగాణ అభివద్ధి మోడల్ గురించి పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. 450 పథకాలును తొమ్మిదేళ్లుగా తెలంగాణలో ఎలా అమలు చేస్తున్నారో ముఖ్యమంత్రి కేసీఆర్ వివరిస్తారని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతీ పథకం రాజకీయాలకతీతంగా ప్రతీ ఇంటికీ చేరుతోందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాదిరిగా బీజేపీ వారికే పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తూ మిగతా వారి కడుపు కొట్టే చిల్లర మల్లర పనులకు కేసీఆర్ పూర్తిగా వ్యతిరేకమన్నారు. తెలంగాణలో సాధ్యమైన ఈ పథకాల అమలు మహారాష్ట్రలో ఎందుకు సాధ్యం కాదని ఆయన ప్రశ్నించారు. భారీ ఆదాయ వనరులు, అతి పెద్ద బడ్జెట్‌లో మొదటి వరసలో ఉన్న మహారాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో మాత్రం ఆఖరి వరసలో ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక రాజధానిగా పేరుగాంచిన మహారాష్ట్ర ఎందుకు రైతుల ఆత్మహత్యలకు పరాకాష్టగా మారిందో అర్థం కావడం లేదన్నారు. ఇక్కడి పాలకుల నిర్వాకమే రైతాంగానికి ప్రాణ సంకటంగా మారిందన్నారు. బీఆర్ఎస్‌ను ఆశీర్వదిస్తే దేశవ్యాప్తంగా తెలంగాణ మోడల్‌ను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీ. పాటిల్, ఐడీసీ చైర్మెన్ వేణుగోపాల చారి, బీఆర్ఎస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హిమాన్షు తివారి, బీఆర్ఎస్ పార్టీ మహారాష్ట్ర కిసాన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు మాణిక్ కదం, ప్రముఖ వాస్తు నిపుణులు తేజ శర్మ, యువ నాయకులు అంకిత్ యాదవ్, శివాంక్ యాదవ్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.